# కథామంజరి

## పది కథల సమాహారం



అక్టోబర్ 2025

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

**అక్టోబర్ 2025**

సంపుటి : 6 ♦ సంచిక : 10



కథామంజరి

మిత్రులకు

# దసరా

మరియు

# దీపావళి

## శుభాకాంక్షలు





కీ.శే. తాతా శ్రీనివాసరావు గారి

జ్ఞాపకార్థం

వారి శ్రీమతి తాతా కామేశ్వరిగారు

అందించిన ఆర్థిక  సాయానికి

మా

కృతజ్ఞతలు





# మా జట్టు


సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**




## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథా మార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| వినదగునెవ్వరు చెప్పిన .. | ix |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| పూనిక | పి.ఎస్.నారాయణ | 1 |
| నేనే రాధనోయి | భమిడిపాటి గౌరీశంకర్ | 10 |
| పాపం పసివాడు | నిష్టల సుబ్రహ్మణ్యం | 16 |
| ఇది కదా ప్రేమ! | బివిడి ప్రసాదరావు | 25 |
| ఏరు దాటాల | పి. రాజేంద్రప్రసాద్ | 33 |
| రెండవబాణం | డా.పూడిపెద్ది శేషు శర్మ | 39 |
| టప్ టప్ ఢాం ఢాం | సంగనభట్ల చిన్న రామకిష్టయ్య | 45 |
| సింహం సలహా | భారతి | 48 |
| దృశ్యం | డా. సుభద్ర వేదుల | 50 |
| గాడిద బొమ్మ | జ్యేష్ఠ | 59 |


Cover Page Credits : Shri John Jude Peter

# కథాకీయం



ఈ మధ్య ఓ కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత శ్రీ చంద్రబోస్‌గారు ఓ పాట, ఆ పాట సాహిత్యం, పాట పాడిన గాయని గురించి మాట్లాడుతూ.. అనుభూతి, సహానుభూతి, రసానుభూతి.. అంటూ అద్భుతంగా నిర్వచించారు. పాటలో కనబడే ప్రతీ విషయాన్ని తాను అనుభూతి పొందుతూ రచయిత పాటని వ్రాస్తాడు. పాట పాడేవారు రచయిత అనుభూతిని తాను కూడా అనుభవిస్తూ పాడుతారు. ఇది సహానుభూతి. ఈ ఇద్దరి అనుభూతులను.. ఆ పాటలో వింటూ రసానుభూతి చెందేవారు శ్రోతలు! నిజానికి ఏ పాటైనా సాహిత్య సంగీతాల పరంగా గొప్ప విలువలు కలిగి ఉండొచ్చు, కానీ పండితులనే కాదు పామరులకు కూడా ఆ రసానుభూతి కలిగించినప్పుడు.. తప్పకుండా ఆ పాట గొప్పదవుతుంది. సాహిత్యవిలువలు ఉన్న ఎంత గొప్ప పాట వ్రాసినా.. దానికి అనువైన శృతి లయలు అందించాకే గొప్ప పాట అవుతుంది. శాస్త్రీయ సంగీత గీతాల దగ్గర్నుంచి.. పల్లె ప్రజలు మాట్లాడే మాండలిక పదజాలంతో ఆశువుగా అల్లిన జానపద గీతాలు వరకు.. ఏ పాటైనా శృతి లయలతోనే శ్రోతల్ని చేరి, రంజింపచేస్తున్నాయి!

కథ కూడా అంతే!

ఈ మూడు.. కథా సాహిత్యానికి కూడా వర్తిస్తాయి. ఏ రచయితైనా సరే.. తాను అనుభూతి పొందిన విషయాన్నే కథావస్తువుగా ఎన్నుకుని, దానికి అక్షర రూపం ఇస్తాడు. ఊహాజనితమైన కథల కంటే.. యదార్థ విషయాలని కథావస్తువుగా చేసుకుని వచ్చిన కథలే కలకాలం నిలిచిపోతాయి! అలాగే.. ఓ విషయాన్ని ఎక్కడో వినో, చదివో చలించి, ఆ విషయాన్ని కథావస్తువుగా తీసుకుని రచనలు చేసే రచయిత.. సహానుభూతి చెందితేనే వ్రాయగలుగుతాడు. అలా వచ్చే రచనలని చదివే పాఠకుడికి.. కథలోని శైలి గాని, కథనం, శిల్పం గాని, వస్తువు గాని, లేదా ఇవన్నీ గానీ మనసుకి తాకినప్పుడు అతను రసానుభూతి పొందుతాడు. ఆ కథలో సంఘటనో, పాత్రో తన చుట్టూ ఉన్నట్లు భావించి ఓ మంచి అనుభూతి పొందుతాడు.

ఈ కోణాలను క్షుణ్ణంగా ఆకళింపు చేసుకున్న మన పెద్దలు.. రచనలు చేసేవారికి ఈ సూచనలే చేస్తారు. నిజానికి వ్యవహారిక భాషా ఉద్యమం తర్వాత వచ్చిన ఎన్నో లక్షల కథల్లో.. కొన్ని వందల కథలు మాత్రమే ఇంకా పాఠకుల హృదయాలలో గూడుకట్టుకుని ఉన్నాయంటే.. అవి రసానుభూతి కలిగించిన కథలే అని చెప్పాలి! ముందు అనుభూతి రచయితకి ఉంటే.. తప్పకుండా మంచి కథే వ్రాయగలడు. ఇప్పుడు వచ్చే వంద కథల్లో కనీసం పది కథలు అలాంటి రసానుభూతి కలిగిస్తున్నాయని అనుకోవచ్చు! అయితే.. పాటలకి, డాన్స్‌లకి ఉన్న ఆదరణ.. కథల విషయంలో తగ్గి.. పదికాలాల పాటు నిలిచిపోయే నేటి కథలు మరుగున పడిపోతున్నాయి.

కథ.. మనిషి ఉనికికి జీవం పోస్తున్నదనే సత్యం తెలుసుకుని, తిరిగి కథకి మంచి రోజులు తీసుకురావడానికి అందరం తలో చెయ్యి వేద్దాం!

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

**డా. వేదుల సుభద్ర**

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అనుకుంటూ... అమ్మ దగ్గర, పుట్టిన ఊర్లోనూ ఎంతో మధురానుభూతి పొందుతాం! ఆ జననీ, జన్మభూమి సన్నిధిలో... ఎన్నెన్నో జ్ఞాపకాలు పెనవేసుకొని ప్రతీ మనిషిలోనూ నిలిచిపోతాయి. అలా పుట్టిన ఊరు, అక్కడ మనుషులు, పెరిగిన వాతావరణం, అప్పటి మాటలు చేష్టలు.. మదిలోనే దాచుకోకుండా, వాటిని కథావస్తువుగా చేసుకుని రచనలు చేయడం నూటయాభై సంవత్సరాల క్రిందట థామస్ హార్డీ.. తన 'ససెక్స్' నవలల ద్వారా చాలా ప్రాచుర్యం సాధించారు. తర్వాత కాలంలో మన దేశంలోనే ఆర్.కె. నారాయణ గారి 'మాల్గుడి డేస్' కథల గురించి తెలియనివారు లేరు. ఇక తెలుగు నేలమీద.. నామిని సుబ్రమణ్యం నాయుడు గారి 'మిట్టూరోడి కథలు', వంశీగారి 'మా పసలపూడి కథలు', ఖాదిర్‌బాబు గారి 'దర్గామిట్ట కథలు' వంటివి చాలా ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఆ కోవలోనే.. ఈ మధ్య కాలంలో "అగ్రహారం కథలు" కూడా తనదైన ప్రపంచంలోకి పాఠకుల్ని పరకాయప్రవేశం చేయించాయి. ఆ కథల సృష్టికర్త శ్రీ వేదుల సుభద్ర గారు!

కథ శైలిలో గాని, కథనం, శిల్పం, వస్తువు విషయాల్లో గానీ.. ఏం మాయ ఉందో తెలియదు గాని, ఆ కథలు చదువుతుంటే మమేకమయిపోతాం. గొల్లపూడి మారుతీరావు గారన్నట్టు.. సుభద్ర గారి కథలు పాఠకుల్ని ఆ కథా ప్రపంచంలోకి పరకాయప్రవేశం చేయిస్తాయి! పాత్రలు మన చూట్టూ ఉన్నట్టో, ఆ మాటలు చేష్టలు, ఆ వాతావరణంలోనే మనం పెరిగినట్లు అనిపిస్తాయి. సుభద్ర గారు పుట్టి పెరిగిన ఊరిని, మనుషుల్ని, వాతావరణాన్ని మామూలుగా చూసి అనుభవించి, మనసులో పదిలంగా దాచుకోలేదు. నుడికారం, రచనా దక్షతా ఎరిగిన రచయిత్రిగా ఎదిగారు. సుభద్ర గారి కథల్లో చెడు ఉండదు, విలన్‌లు ఉండరు.. ఆప్యాయత, అనురాగం, అనుబంధాలతో పోతపోసిన పాత్రలే కనబడతాయి. వాటికి తోడు కథావస్తువు.. వాస్తవ జీవనంలో నుంచి వచ్చినదే! ఆ కథలని, పాత్రలని ఊహించి రాయడం అసాధ్యం! అలా.. పెద్దావిడ ప్రయాణం, పిన్ని, ఆవకారాలు-మమకారాలు, నలుడా-భీముడా, అమ్మాయి కాపురం, ఆయుర్(జీవన)వేదం, అరుగు మీద సత్యంగారు.. వంటి కథలు పాఠకుల్ని కట్టి పడేస్తాయి.

సుభద్రగారు పుట్టింది అమలాపురం, విద్యాభ్యాసం చాలా చోట్ల జరిగి. ఉస్మానియా యూనివర్సిటీలో జెనెటిక్స్‌లో పి.హెచ్.డి. చేసారు. ఉద్యోగ రీత్యా బెంగుళూరులో నివాసం.. అప్పుడప్పుడు అమెరికాలో కూడా! భర్త శ్రీ శ్రీనివాస్‌గారు.. అబ్బాయి ప్రతీక్ కూడా సుభద్ర గారి కథా అభిమానులే!

సుభద్ర గారు ఎక్కువగా కథలు వ్రాయలేదు గాని, వ్రాసిన కథలు ఆణిముత్యాలే. కౌముది అంతర్జాల మాసపత్రికలో 'అగ్రహారం కథలు" శీర్షికనే మూడు సంవత్సరాలు ధారావాహికంగా ప్రచురింపబడ్డాయి. ఆ కథలతో అదే శీర్షికతో.. సంపుటి కూడా విడుదలైంది. మంచి వక్తగా, రచయిత్రిగా అనతికాలంలోనే పేరు తెచ్చుకున్న డా. వేదుల సుభద్రగారు ఈ సంచిక విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు ధన్యవాదాలు తెలుపుకుంటూ.. సుభద్ర గారి కలం నుండి మరెన్నో కథలు రాగలవని.. రావాలనీ కోరుకుంటూ..!

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



## "జ్యేష్ఠ"

ముందు తన చుట్టూ ఉన్న సమాజం, కళ్ల ఎదురుగా కనబడుతున్న మంచీ చెడు, న్యాయ అన్యాయాలు.. కథాంశాలుగా తీసుకుని.. నిక్కచ్చిగా నిర్భయంగా తన అభిప్రాయాలని కథల్లో చెప్పగలిగే రచయితలను ఉత్తమ రచయితలుగా చెప్పుకుంటాం. వారి కథలకు బహుమతులు, అవార్డులు రివార్డులు వచ్చినా, రాకపోయినా సరే.. పాఠకుల మదిలో కథలు గూడుకట్టుకుని, వారు తెలిపే స్పందనలే.. పెద్ద బహుమతులని చెప్పాలి! అలాంటి రచనలు చేసిన ఓ గొప్ప రచయిత "జ్యేష్ఠ". ఇవటూరి చిన వీర బసవరాజు గారంటే తెలిసేది బహు కొద్దిమంది మాత్రమే గానీ.. జ్యేష్ఠ గారంటే తెలుగు సాహితీరంగంలో తెలియనివారు లేరు! వారి తల్లితండ్రులు ఇవటూరి చిన బసవరాజు, భానుమతీదేవి గార్ల ఎనిమిది మంది సంతానంలో జ్యేష్ఠుడు. ఆయన కలం పేరు జ్యేష్ఠ.. మొదటి కథ "స్వర్గానికి నిచ్చెన వేస్తాం" 1955లో 'తెలుగు స్వతంత్ర' వారపత్రికలో అచ్చయిన నాటికి ఆయన వయసు పదహారు! ఆ మొదటి కథలోనే.. పరిపక్వతను చూసి పాఠకులు, కథకులు.. ఎవరో చెయ్యి తిరిగిన రచయిత రచన అని అనుకున్నారుట. ప్రముఖ ఆంగ్ల సాహితీవేత్త గోర్కీ సాహిత్యాన్ని అప్పటికే జ్యేష్ఠ గారు క్షుణ్ణంగా చదివిన దాఖలాలు ఆ కథ చదివితే అవగతం అవుతుంది. ఆయన సాహితీ సమావేశాలకి దూరంగానే ఉండి.. సాహితీ పఠనంలో మునిగి తేలేవారు. వేల పుస్తకాలు చదివినా సరే... నిజానికి ఆయన వ్రాసినవి.. ఓ డెబ్బై ఐదు కథలు, ఓ నవల, ఓ సిద్ధాంత చర్చా గ్రంథం, కొద్దిగా కవితలు, వ్యంగ్య రచనలు..! అయితేనేం.. ఆ రోజుల్లో ప్రముఖ పత్రికలన్నీ ఆయన రచనలన్నీ ప్రచురించాయి. నండూరి రామమోహనరావు గారి నుంచి పురాణం, వాకాటి వారి వరకు ఉన్న ప్రముఖ సంపాదకులందరూ జ్యేష్ఠ గారి రచనలంటే చాలా ఇష్టపడేవారు. చాలా కథలు.. అడిగి రాయించుకున్నవే! ఆయన రచనలే.. ఆయనకి గుర్తింపు తీసుకు వచ్చాయనడానికి నిదర్శనం ఏమిటంటే...చిన్న పెద్ద సాహితీవేత్తల దగ్గర్నుంచి శ్రీశ్రీ, ఆరుద్ర గార్ల వరకు కూడా జ్యేష్ఠ గారింటికి ప్రత్యేకంగా వెళ్ళి ముచ్చటించేవారు.

జ్యేష్ఠ గారి సాహితీ జీవితంలో ఓ ప్రత్యేకత కనబడుతుంది. చిన్నప్పుడు యోగాభ్యాసం, తాత్విక దృష్టి, కళా దృష్టి... తల్లిదండ్రుల నుండి గ్రహించి, ఇరవై సంవత్సరాలు నిండకుండా ఇంజనీరింగ్ డిగ్రీని సాధించారు. ఆంధ్రా యూనివర్సిటీలో జ్యేష్ఠ గారు చదువుతున్న రోజుల్లో... వీరాజీ, గొల్లపూడి మారుతీరావు, మోదుకూరు జాన్సన్, కొలకలూరి, కొండముది శ్రీరామచంద్రమూర్తి, కవనశర్మ, ఎ. ప్రసన్నకుమార్.. వంటి ఎంతోమంది రచయితలు కూడా సహ విద్యార్థులుగా ఉండేవారు. కాలేజీలో అడుగుపెట్టే సమయానికే జ్యేష్ఠగా పేరు తెచ్చుకున్న ఆయన.. తర్వాతి కాలంలో మార్క్సిజం వైపు కూడా ఆకర్షితుడై కొంతకాలం కథలు కూడా రాయలేదు. వివేకానంద రచనలు చదివిన తర్వాత.. తిరిగి ఆయన ఆలోచనలలో చాలా మార్పు వచ్చింది. ఆయనలో వచ్చిన ఈ మార్పు... ఆయన రచనలలో కొట్టొచ్చినట్లు కనబడుతుంది.

1962కి ముందు ఆయన వ్రాసిన కథలలో జీవితపు విలువలు, మధ్యతరగతి మనుషుల జీవితాల గురించి వ్రాసారు. వాటిలో ముళ్ళపూడి వెంకటరమణగారి రచనల ప్రభావం కనబడుతుంది. హాస్యం తొంగిచూస్తుంది! స్వర్గానికి నిచ్చెన వేస్తాం, అబల, రాజా పాడిన విషాద గీతం, విలువలు, ఎర్రతేలు వంటి ఎన్నో ఆణిముత్యాలు ఆ కోవకి చెందినవి. 1977 తర్వాత రాసిన కథలలో సమాజం మీద కసి కనబడుతుంది. నిర్భయంగా ఏ విషయాన్నైనా చెప్పగలిగే కథనం కనబడుతుంది. 'ఓ రకంగా ఈ కాలంలో జ్యేష్ఠగారు వ్రాసిన కథలు గురిచూసి ఎక్కు పెట్టిన తుపాకీలని' ప్రముఖ రచయిత శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి గారంటారు. వృద్ధ కన్యలు, గాడిద బొమ్మ, కల్చరల్ రివల్యూషన్, బాస బాసే – స్టోను స్టోనే.. వంటి కథలు ఆ కోవకు చెందినవి. ముందులో హాస్యాన్ని పండించి, తర్వాత నీతి బోధలు, ఆ తరువాత సీరియస్‌గా సమాజం మీద కథలు... ఇలా ఎంతో పరిణితి ఉన్న సాహితీ ప్రస్థానం జ్యేష్ఠగారిదని చెప్పాలి. శ్రీశ్రీ, రావిశాస్త్రీ, షేక్స్పియర్, బాపు రమణలు..అంటే వల్లమాలిన అభిమానం జ్యేష్ఠ గారికి! ముందులో వారి ప్రభావం జ్యేష్ఠ గారి రచనలలో కనబడినా, రానురాను తనకంటూ ఓ ప్రత్యేకతని సాధించారు.

1939 జూన్ 24 న జన్మించిన బసవరాజుగారు.. 1955లో ఆంధ్రా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజీ మొదలైన మొదటి బ్యాచ్ లో చేరి, ఇరవై ఏళ్ళు నిండకుండానే ఇంజనీరింగ్ డిగ్రీ సాధించారు. అదే కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్ అధ్యాపకుడుగా పనిచేసారు. ఆ రోజుల్లో రచయిత అంటే ఆకాశంలో కనబడే చందమామ, నక్షత్రాలు, ఇంద్రధనస్సు అని అప్పటి వరకు భావించిన జానకీదేవి గారితో వివాహం, నిశ్చయం అయిన తర్వాత జ్యేష్ఠ గారి "ఎర్రతేలు" కథ చదివి చాలా సంబరపడిపోయారుట! అలా.. భర్తగారి గురించి జానకీదేవి గారు కూడా మంచి జ్ఞాపకాలు అందించారు. వారికి ముగ్గురు కుమారులు. వారిలో శ్రీ రాజామోహన్ ఇవటూరి గారు కూడా మంచి కథారచయితే! జ్యేష్ఠ గారు.. తన రచనలని చదివించ గలిగే రచయితగానే కాకుండా.. మేధావిగా, సమర్ధవంతమైన అధ్యాపకుడుగా, మంచి ఆతిథ్యం ఇచ్చే ఆత్మీయుడుగా, గొప్ప 'తోడుగా' కూడా పేరు తెచ్చుకున్నారు. వైవిధ్యమైన రచనలు అందించిన జ్యేష్ఠ గారు చిన్నవయసులోనే.. అంటే 49 ఏటనే కాలం చేయడం.. తెలుగు సాహితీ జగతికి తీరని లోటే! "జ్యేష్ఠ అవార్డు" పేరున ఎందరో సాహితీవేత్తలను సత్కరించిన వారి కుటుంబ సభ్యులు.. ఈ రోజు మాకు కూడా ఎంతో విలువైన సమాచారం, సహకారం అందించి, జ్యేష్ఠ గారిని తలుచుకునే భాగ్యం కలిగించారు. శ్రీమతి జానకీదేవిగారికి, శ్రీ రాజామెహన్‌గారికి కృతజ్ఞతలు తెలియ చేసుకుంటూ.. జ్యేష్ఠ గారికి నివాళులు అర్పించుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

# కథా పరిచయం



## రావిశాస్త్రి 'సృష్టిలో'

'నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం' అన్నవారెవరో చెప్పనక్కరలేదు. అవే మాటల్ని ఒక కథారూపంలో చెప్పిన రచయిత రావిశాస్త్రి అనబడే రాచకొండ విశ్వనాథశాస్త్రి గారు! సామాన్యుల జీవితాల్ని, వారి బాధలు, కష్టాలు, కన్నీళ్ళు సాహిత్యంలో బంధిస్తూనే ఆ సాహిత్యాన్ని ఎంతో ఎత్తుకు తీసుకెళ్ళిన అతి కొద్దిమంది రచయితలలో అగ్రగణ్యులు రావిశాస్త్రి గారు. కథ వేరు, అది చెప్పే విధం వేరు. ఈ రెండింటిలోనూ పరిపక్వతతో తనదైన శైలితో బలమైన కథలను అల్లిన కథకుడీయన. రావిశాస్త్రి గారి గురించి ఎక్కువగా చెప్పనక్కరలేదు. అందుకే ఆయన కథలోకి వెడదాం.

'సృష్టిలో' కథ చిన్నదే చెప్పడానికి. మూడు చిన్నపిల్లలున్న నక్క ఊరు బయటున్న తన కలుగులోంచి బయటకు వస్తుంది – ఆహారాన్ని సంపాదించి తన పిల్లల కడుపులు నింపాలి కాబట్టి, ఆదే మాట.. దిగులుతో చూసిన పిల్లలకి చెప్పి వూర్లోకి బయల్దేరుతుంది. అంతకు ముందు రెండు రోజులు తను తెచ్చిన రెండు కోడి పెట్టలతో కడుపు నిండినా, మళ్ళీ ఈ రోజు ఏమీ తేకపోతే పిల్లలు పస్తులుండాలాయే. రెండు పెట్టలు దొరికిన వైపుకి కాక, ఇంకో దిక్కుగా ఊర్లోకి వెళ్దామనుకున్నా కుదరలేదు. సరే, ఈ రోజు ఆ ఉన్న మూడో కోడిని కూడా ఎత్తుకు రావడమే తను చేయగలిగింది.

ఆ మూడు కోళ్ళనూ పక్క ఊరు నుంచి ఎంతో కష్టపడి దొంగిలించి తెచ్చి ఆ బోర్లించిన తట్ట కింద పెట్టి, తను కోసుకు తినాలనుకున్నవాడు వీరన్న. ఆరోజు సాయంత్రం ఇంటికొచ్చినప్పుడు అర్థమయింది.. అప్పటికే రెండు కోళ్ళు మాయమయ్యాయని! భార్యనడిగాడు. ఆమె చెప్పింది, గత రాత్రులు నక్క వచ్చి రెండు కోళ్లను తినేసిందని. నమ్మలేదు వీరన్న. పెళ్ళాన్ని ఏడా పెడా వాయించాడు. కొట్టాడు. తిట్టాడు. పిల్లలు వచ్చి చెప్పేంతవరకూ నమ్మలేదు. నక్క మీద కోపం ఎక్కువయ్యింది. తన కోళ్లను తినేయడమే కాక, తన పెళ్ళాన్ని కొట్టించింది కూడా! ఆ రాత్రి పన్నెండింటికి ఓ దుడ్డుకర్ర పట్టుకుని, ఆ చీకట్లో కోపంతో మిగిలిన మూడో కోడి ఉన్న బుట్టకి కొంచెం దూరంగా, నక్క కోసం ఎదురు చూస్తూ కూర్చొన్నాడు.

అనుకున్నట్లే నక్క తల్లి వచ్చింది. వీరన్న దుడ్డుకర్రకు బలైపోయింది. మర్నాడు పొద్దున్నే నిద్ర లేచిన వీరన్న కుటుంబానికి, ఆ చుట్టుపక్కలున్న వారికి పండగ చేసుకున్నంత ఆనందం! వీరన్న మీసం మెలేశాడు. అయితే ఆ ఆనందం అట్టే సేపు మిగలలేదు. ఓ పోలీసు జవాన్ని తీసుకుని పక్క ఊరు వీరాసామి వచ్చాడు. తన కోడిని గుర్తుపట్టాడు. ఒక్కటే కోడి మిగిలింది. మిగిలిన రెండు కోళ్ళూ, నక్క తినేసిందని చెప్పాడు వీరన్న. చచ్చి పడున్న నక్క తల్లే అందుకు సాక్ష్యం. ఆ కోళ్లను దొంగిలించిన వీరన్నని జైల్లో పెట్టడానికి తీసుకెళ్ళిపోయారు. పెళ్ళాం, పిల్లలు లబోదిబో మన్నారు.

తల్లి నక్క వస్తుందని ఎదురు చూసి, ఎదురు చూసి ఆకలితో వున్న పిల్లల్లో ఒక పిల్ల కలుగులోంచి బయటకు వచ్చి, తొంగి చూసింది. అంతే. ఎదురుగా ఓ కొండచిలువ. ఒకటీ, ఒకటీ చొప్పున మూడు నక్క పిల్లల్నీ తనకు ఆ రోజుకి ఆహారం చేసుకుంది.

కోడిపెట్ట అనుకుంది.. తను బతికింది ఈ పూటకి. వీరాసామి చేతిలో పడుకుని పోయింది. ఆ తరవాత ఎవరింట్లోనో మంచి పలావుగా మారిపోయి వుంటుంది.

ఈ కథ ఇక్కడితో ఆగిందే కానీ, జీవితం ఆగుతుందా? వీరాసామి కోడిపెట్ట్ని వీరన్న ఎత్తుకు పోయేడు. వాటిలో రెండింటిని వీరన్న ఇంటి నుంచి దొంగనక్క కరుచుకుపోయింది. నూకనాయుడి పదిసెంట్ల భూమిని తన పది ఎకరాల్లో వీరినాయుడు కలిపేసుకున్నాడు. అందు గురించి నూకనాయుడు దావా తేగా, ప్లేడరు గుమాస్తా అతని డబ్బంతా ఎగేశాడు. ప్రతివాదైన వీరినాయుడి దగ్గర పెద్ద ప్లీడరుగారు అయిదువందలు ఒడికేశారు. .... ఇలా సాగిపోతుంది ... వాడిని వీడు, వీడిని ఇంకోడు....

చిన చేపను పెద చేప, పెద చేపను .... ఇలా ఇలా ఒకరినొకరు హింసించుకోవడమే జీవితమా?

కథ ఏంచెప్పిందీ అన్నది ఒకటైతే, ఎలా చెప్పబడిందీ అన్నది ఇంకోటి. రచయిత శైలి, వాక్యనిర్మాణం, సందర్భానికి సరిగ్గా సరిపోతూ పాఠకుడిని తన ఆలోచనాలకనుగుణంగా తనతో పాటు నడిపించే వర్ణనలు, కథకు ఆయువుపట్లు. నిజానికి శాస్త్రిగారి ప్రతీ కథపైనా ఒక థీసిస్ రాయచ్చు. చాలామంది రాసారేమో కూడా!

కథలోని కొన్ని మచ్చుతునకలు – పాక బైట పండువెన్నెల్లో పళ్ళ గుట్టుల్ని ఆకులపైట చాటున దాచుకోడం మర్చిపోయి జామిచెట్టొకటి నిద్రపోతోంది ఆ రాత్రి. కోళ్లకూడా నిద్రపోతుందో లేదో శాస్త్రజ్ఞులు చెప్పాలట, కథకులు చెప్పలేరట!

చంద్రుడి గురించిన సందర్భాలలో రచయిత ఆలోచనలు చూడండి. “చంద్రుడు దొంగలకు మల్లే ఎప్పుడూ తెలివిగా నిద్ర పోకుండా ఉంటాడట. పట్టపగ్గాలు లేకుండా విర్రవీగుతూ తిరుగుతున్నాడట. కాని చాలా అందంగా, గురువుగారికే ఎసరుపెట్టే పక్కా దొంగే అయినప్పటికీ, ఎంతో అందంగా వుండి, భూమ్మీదకు దిగితే.. ఏ చోర సామ్రాజ్యానికి చక్రవర్తో, ఏ దొంగల దేశానికి ప్రెసిడెంటో అయి తీరగలడట.”

“అదే రాత్రి, చంద్రుడు అప్పనంగా తిని బలిసిన దత్తపుత్రుళ్ళా వెలుగుతున్నాడట.”

“స్పాట్‌లైటులో స్టేజిరాజులా చంద్రుడు ధగధగ వెలుగుతున్నాడు. డాబా మీద వెన్నెట్లో ప్రియురాలి సిల్కు చీరలా గాలి చల్లగా ఉంది. కొండవార బంజర్లో బండరాళ్ళు పడుచు భార్యలు సరసాలకి పరుగుతీయగా ముణుకులు పడిపోయిన ముసలి భర్తల్లా లేవూ?”

“తల్లి నక్క బయల్దేరిన రాత్రి ఎట్లా ఉందో... వెన్నెల చల్లగా ఉంది. తుమ్మలు దొంగల్లా వున్నాయి.... వల్లకాడు శవరహితంగా, ముండమోపిలా వుందిట.” ఇవి (అప) శకునాలా, నక్కకి?

“ఆకలివేడి తప్ప లోకంలో ఇంకేమీ కనిపించని నక్కకి కరుణామయుడయిన భగవంతుణ్ణి కేదారగౌళలో తిడదామన్నంత కోపం వచ్చిందట. ఇవాళ కూడా నాకో కోడిపెట్టను రాసి పెట్టాడో, లేక ఇంకేవైనా రాసి పెట్టాడో రాక్షసి దేవుడు అనుకుందిట నక్క తల్లి.” ఆకలితో అలమటించే జీవుల కష్టాలు తీర్చలేని దేవుడు కరుణామయుడెలా అవుతాడు?

“రచయితలకీ, రచయిత్రులకీ అయితే.. చల్లగాలికి, వెన్నెల తడికీ కడుపులు నిండిపోవచ్చునేమో గాని, మిగతా జంతువులకి అలా కడుపులు నిండవు.” — రచయితలపై విసిరిన వ్యంగ్యం!

"భగవత్‌సృష్టి సజావుగా సాగడానికి ప్రధానకారణమైన హింసాకాండని కళ్ళారా చూడ్డానికి అతని కళ్ళు తహతహలాడాయి" – ఇది ఇంకోరకమైన వ్యంగ్యం. ప్రపంచం జరగడానికి హింస అవసరమా?

ఇహ భయంతో వణికిపోతున్న కోడిపెట్ట ఏమనుకుంటోంది? "తనుచేసే నిత్యహింసని తనెప్పుడైనా, ఎన్నటికైనా త్యజించగలదా? హింసకు బలి కాబోతామేమోననే అనుక్షణం భయం నుంచి తనకి ఎన్నటికయినా, ఎప్పటికయినా విముక్తి అంటూ ఉంటుందా?"

రచయిత వ్యాఖ్యానం – "కోడిపెట్ట వేదం వినలేదు. కురాన్ చదవలేదు. బైబిల్ చూడలేదు. అది ఎమ్మే చదవలేదు. కథలేవీ ఊహించలేదు. దానికి స్పష్టంగా ప్రశ్నలు వేసుకోడం కూడా (పాపం!) సరిగా రాదు."

నాకీ కథ చదువుతూంటే ప్రపంచంలో ఉన్న బాధలకు, కష్టాలకు సమాధానాన్ని వెతుక్కుంటున్న గౌతముడు జ్ఞాపకానికొచ్చాడు. ఈ కథ ద్వారా రచయిత వ్యక్తినీ, సమాజాన్నీ కూడా ప్రశ్నిస్తున్నారు. హింస అవసరమా? సమాజంలో బడుగు ప్రజలకు ఆకలి తీరే మార్గం లేదా?

సుమారు 1968 లో రాయబడ్డ ఈ కథ 'రాచకొండ విశ్వనాథశాస్త్రి రచనా సర్వస్వం – బాకీ కథలు' – నవోదయా బుక్‌హౌస్ వారు ప్రచురించిన పుస్తకంలో చదవవచ్చు.

***పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్***

# వినదగునెవ్వరు చెప్పిన..

సెప్టెంబర్ 25 సంచికలోని.. కథాకీయంలో విదేశాలలోని తెలుగువారు తమ మాతృభాషపై అభిమానంతో సమావేశాలు నిర్వహించడాన్ని ప్రశంసించడం ముదావహం.. ఏడునూర్లు పైగా కథలు రచించిన విశేష అతిథి శ్రీ వడలి రాధాకృష్ణ గారి కథాశైలి, కథాకాలం నాటి పరిస్థితులను కథాంశాలుగా తీసుకోవడం ఆయన రచనా ప్రజ్ఞకు ఉదాహరణ. కథామార్గదర్శి కె. రామలక్ష్మిగారి రచనా జీవిత విశేషాలు తెలియజేస్తూ నివాళి సమర్పించడం.. అనుభవజ్ఞులైన కథారచయితల పట్ల గౌరవాన్ని తెలియజేస్తోంది. అలాగే.. శ్రీ పాలగుమ్మి వారి "పడవ ప్రయాణం" విశ్లేషణ.. గ్రామీణ వాస్తవిక వాతావరణాన్ని అద్దంపట్టేలా వున్నది. ఇక కథల్లోకి వెళ్తే ప్రతీ కథ ఒక ప్రత్యేకతను ప్రతిబింబిస్తోంది. కాకపోతే కొన్ని కథలు ఇంకొంచెం బాగున్నాయి. ఇక శ్రావ్యసంచికలో కొందరి శ్రావ్య శైలి ఆ కథలోని పాత్రలే ప్రాణం పోసుకుని మాట్లాడుతున్నాయా అన్నట్లున్నాయి. కాకపోతే 'ఆర్ట్ ఆఫ్ లీవింగ్' కథ చదివిన శరత్ జ్యోత్స్న. గతంలో కథలు చదవడంలో శ్రీమతి శరత్ జ్యోత్స్నగారు, ఆరితేరిన ఆర్టిస్టు శ్రీమతి శారదా శ్రీనివాసన్ తలపించారు.

ధన్యవాదాలు.

***గండికోట వేంకట కుటుంబరావు, విజయనగరం***

---

So, one needs to know the "art of leaving" to live the life...not for leading. సుగుణరావు గారి కథలోని కాన్సెప్ట్ తెలిసినట్టే ఉన్నా కొత్తగా ఉంది. బావుంది. శరత్ జ్యోత్స్న గొంతులో పడిందంటే అది కథ వినడం కాదు, చెవులతో చూడడం. As always, great modulation and rendering.

***సీతామహాలక్ష్మి కాకాని***

---

"3 జి 3 బి" కథ గొప్ప ఉత్కంఠభరితంగా నడిచింది. రచయిత ప్రతిభ విషయంలో సందేహం లేదు. అయితే ఎంత గొప్ప కార్యానికి పూనుకున్నా, కన్నవారి పట్ల బాధ్యత చూపలేదు ఆ యువత... అది ఆమోదయోగ్యం కాదు. ఎండింగ్ కాస్త సినిమాటిక్‌గా ఉంది. ఆదర్శం మంచిదే, ఆచరణ కూడా అంతే గొప్పగా చూపితే బాగుండేది. కథనం ఆసక్తికరం..! ఇక శ్రీనివాసరావుగారి పఠనం, అవసరమైనప్పుడు యాస ప్రయోగం సహా మాబాగా నప్పింది. చాలా చాలా బాగా చదివారు... అభినందనలు!

***శరత్ జ్యోత్స్న***

---

"నా గిరెడ్డన్న" కథ బావుంది. వ్యసనపరుడితో వ్యవహారం ఎంత ప్రమాదమైనదో ఈ కథలో చక్కగా చూపించారు. శ్రీమతి లలితగారు యాసతో సహా పలుకుతూ అద్భుతంగా చదివి వినిపించారు.

***భాను కొవ్వలి***

---

# పూనిక

పి.ఎస్.నారాయణ
✆ 9959808862

> ***ఇరవై అయిదు సంవత్సరాలు పెంచి, వృద్ధిలోకి తెచ్చిన మిమ్మల్నే సురేష్ మర్చిపోయాడని మా వివాహానికి ముందే తెలిసి ఉంటే అతడిని నా భర్తగా అంగీకరించి ఉండేదాన్నే కాదు. అలాంటి మనిషి కొన్ని నెలల పరిచయంతోనే తన భార్యగా చేసుకున్న నన్ను ఎన్నాళ్ళు భార్యగా చూడగలుగుతాడో ముందే ఊహించి ఉండగలిగేదాన్ని!***

ముసురుతో ఇంట్లో బందీలా కూర్చోవటమంత చికాకు మరొకటి ఉండదు. పొద్దుననగా పట్టింది. సాయంత్రం ఐదింటికే చీకటి పడిందా అన్నట్లుగా ఆకాశాన్ని కమ్ముకున్న మబ్బులకు తోడు ఇంకా తగ్గని చిరుజల్లులు, చల్లటి గాలి... వరండాకు ఉన్న కిటికీ దగ్గర కుర్చీలో కూర్చుని బయట రోడ్డు మీదకే చూస్తున్నాను.

సాయిరాంపురం నాలుగొందల గడప ఉన్న పల్లెటూరు. చీకటి పడితే రోడ్లన్నీ నిర్మానుష్యమవుతాయి. అందునా జల్లు పడుతుంటే చెప్పేదేమున్నది. పంచాయతీవారి దీపాలు గుడ్డిగా వెలుగుతున్నాయి.

ఈ ఊరి ఎలిమెంటరీ స్కూల్లో హెడ్మాస్టర్‌గా చేసి రెండు సంవత్సరాలుగా విశ్రాంత జీవితం గడుపుతున్నాను.

“ఆ కిటికీ దగ్గర ఎంతసేపు కూర్చుంటారు? చల్లగాలికి ఆయాసం వచ్చిందంటే ఉప్పు కాపడం పెడతావా, మరో కప్పు వెచ్చటి కాఫీ ఇస్తావా అంటూ నా ప్రాణం తీయటం తప్పా!” వంటింట్లోనుంచి ఉమాదేవి నోరు పెద్దది చేసింది.

పోట్లాడుకున్నా, ఆప్యాయంగా మాట్లాడుకున్నా... ఆ ఇంట మేమిద్దరమే!

“పొద్దుటినుండి కదలకుండా కుర్చున్నాననే జాలి గూడా లేదే నీకు, రాక్షసీ!” అది ఆమెకు నేను పెట్టుకున్న ముద్దుపేరు. వంటింటి వైపుకు తొంగి చూస్తూ అన్నాను.

“అంటే కాఫీ ఇవ్వలేదనా వెక్కిరింత?” మోకాళ్ళ నెప్పులున్నా నామీద ఒంటికాలి మీద లేస్తూ హాల్లోకి వచ్చింది.

“చిన్నగా నడువు... జారి పడ్డావంటే నీకేం ఆసుపత్రిలో స్పాంజ్ పరుపు మీద హాయిగా పడుకుంటావ్... నేనే అటూ ఇటూ తిరగలేక చస్తా!”

“పోనీలేండి... మీరు ఎముక విరక్కుండా పడటానికి ప్రయత్నించండి... నేనా పని చేస్తా!”

"కుంటుకుంటూనా?" పకపకా నవ్వాను. అది మా మేనత్త కూతురే, చిన్నప్పటినుంచి కొక్కిరాయె... ఎంత మాటయినా చనువుగా అనేస్తుంది. ఎన్ననుకున్నా మేమిద్దరం ఒకటే అనేది బంధువర్గమంతా ముక్త కంఠంతో చెప్పే మాట.

సరిగ్గా అప్పుడే ఓ స్త్రీ మా వాకిటి మెట్లెక్కి లోపలకు వస్తూ కనబడింది. వానలో తడవటంతో ముఖం మీదకు జారిన జుట్టు, కట్టుకున్న చీర ఒంటికి అతుక్కుపోయి ఉన్నాయి. మరేదో ఊరినుంచి వస్తున్నట్లుగా చేతిలో సంచీ...



వరండాలో వెలుగుతున్న దీపపుకాంతిలో గమనించాను ఆమె లోపలకు రావటం... వయసు ముప్పై ఉండవచ్చు. పచ్చటి పసిమి... నుదుట కుంకుమబొట్టునుండి ముక్కు మీదగా జారుతున్న ఎర్రటి నీటిధార! ఆమెను అంతకు ముందు ఎక్కడా చూసిన గుర్తుకు రావటం లేదు. కుర్చీలోనుంచి లేచి, తలుపు తీసి, 'ఎవరు కావాలి' అన్నట్లుగా చూచాను.

"మంగళగిరి పొగాకు కంపెనీలో పని చేసి రిటైరయిన చిదంబరం గారింటికి వచ్చానండి. ఈ వానతో రోడ్డుమీద మనిషి కనబడలేదు వారిల్లెక్కడో చెప్పేటందుకు! మీ వరండాలో లైట్ వెలుగుతుంటే లోపలకు వచ్చాను, మీరు చూపించగలుగుతారేమోనని..."

"పొగాకు కంపెనీ చిదంబరమా... వాళ్ళిప్పుడు ఇక్కడ లేరు గదా... రెండేళ్ల క్రితం రిటైరయిన తరువాత ఈ ఊరు వదిలి హైద్రాబాద్‌లో ఉన్న కొడుకు దగ్గరకు వెళ్లారు!" అన్నాను.

"అయ్యో అలాగా... భూమి గుండ్రంగా ఉన్నదనటానికి ఇదే నిదర్శనం. ఆయన కోసం నేను హైద్రాబాద్‌నుంచే వస్తున్నాను!" అన్నది నీరసంగా ఆమె.

తడిసి ముద్దయిన ఆమెను అలా వరండాలో నిలబెట్టి మాట్లాడటం కాస్త ఇబ్బందిగా అనిపించి, "ముందు లోపలకు వచ్చి గుడ్డలు మార్చుకోండి... చిదంబరం నాకు తెలిసినవాడే... మీకు బంధువా?" అడిగాను.

ఆమె లోపల కాలు పెడుతుంటే గమనించాను చీరకు బురద కూడా అంటుకున్నదని.

నా చూపు గమనిస్తున్నట్లుగా, "బాత్రూమ్ చూపిస్తే రెండు చెంబులు నీళ్లు పోసుకుంటాను... చీకట్లో కనబడక గుంటలో కాలు వేసి పడ్డాను!" చిరాకుతో చీరకు అంటిన బురదకు కారణం చెబుతున్నట్లుగా చిన్నగా అన్నది.

ఉమాదేవి లోపలినుండి వచ్చింది, "ఎవరూ?" అంటూ.

"చిదంబరం బంధువటే... అతడు ఈ ఊరు నుంచి వెళ్లిన సంగతి తెలియక వచ్చిందట... బాత్రూమ్ చూపించు!"

"నాకు చిదంబరంగారు బంధువు కాదండి... వారిని ఇంతవరకు నేను ఎన్నడూ చూడను కూడా లేదు. మా ట్రస్ట్‌కు వారు ప్రతి సంవత్సరం పెద్దమొత్తంలో విరాళం ఇస్తుండేవారు, రెండేళ్ళబట్టి ఇవ్వకపోవటంతో కారణం తెలుసుకోవటానికి మా ఛైర్మన్‌గారు పంపితే వచ్చాను!"

ఉమాదేవి బాత్రూమ్ చూపిస్తే సంచీలో నుంచి పొడిగుడ్డలు తీసుకుని అటు వెళ్ళింది.

చిదంబరం దేవుడు, గుళ్లు అంటూ ఎప్పుడు తిరుగుతూనే ఉంటాడు. బాగా డబ్బున్నవాడే. పెద్ద మొత్తాలలో అలాంటి సంస్థలకు చందాలు ఇస్తుండవచ్చు!

తరువాత పావుగంటకు బాత్రూమ్ నుండి బయటకు వస్తూనే ఆ అమ్మాయి, "అంకుల్! మీకు అభ్యంతరం లేకపోతే, రాత్రికి ఇక్కడే ఉండి, పొద్దున్నే వెళతాను. ఈ వానలో ఇక్కడ నుంచి విజయవాడ వెళ్లి హైదరాబాద్ బస్సు ఎక్కటం నావల్ల కాదు... నా కోసం మీరేం చేయనక్కరలేదు... బ్యాగ్‌లో బిస్కెట్ ప్యాకెట్లు ఉన్నాయి... చాపిస్తే సంచీని తల క్రింద పెట్టుకుని ఓ పక్కగా పడుకుంటాను!" అన్నది వినయంగా.

ఆ అమ్మాయి మాటకు నొచ్చుకున్నట్లుగా అన్నాను, "అదేంటమ్మా! ఒక్కపూట భోజనం పెట్టలేమా మేము? ఏం ఫరవాలేదు... భోంచేసి, వైర్ మంచం ఉన్నది ఈ హాల్లోనే వేస్తాను నిశ్చింతగా పడుకో!"

ఏం మాట్లాడలేదు గాని కళ్ళతోనే తృప్తిని వ్యక్తంచేసింది.

చలవచేసిన పొడిబట్టలు కట్టుకున్న ఆ అమ్మాయిని చూస్తుంటే పెద్దింటి పిల్లే అనిపించింది. సమాజానికి పనికివచ్చే సేవాకార్యక్రమాలలో పాల్గొంటున్నదీ అంటే మెచ్చుకోదగ్గ విషయమే. ఈలోగా ఉమాదేవి ట్రేలో మూడుకప్పుల కాఫీతో వచ్చి, మా ఇద్దరికీ చెరొకటి ఇచ్చి తనూ ఒకటి తీసుకుని నా పక్కగా కూర్చున్నది.

"ఏం ట్రస్ట్ అమ్మా మీది?"

"మా ట్రస్ట్ ఋషీకేష్ లోను, కాశీలోను, నాగార్జునసాగరుకు సమీపంలో ఎత్తిపోతల దగ్గర ఉన్న మూడు వృద్ధాశ్రమాలను నిర్వహిస్తుంటుంది. వాటి నిర్వహణకు దేశవిదేశాలనుండి ఎందరో దాతలు విరాళాలు ఇస్తుంటారు!"

"ఏం చదువుకున్నావమ్మా... వివాహమైందా... భర్త ఏంచేస్తుంటాడు?"

"బిటెక్ చేసానండి... నా పేరు స్పందన! నేనూ నా భర్తా హైదరాబాద్‌లో సాఫ్టువేర్‌లో పనిచేస్తున్నాం... సెలవల్లో స్వచ్ఛందంగా ట్రస్ట్ పనులు చేస్తుంటాను!"

కాఫీలు త్రాగటం అవ్వటంతో ఉమాదేవి వంట చేయటానికి లేచింది. స్పందన లేస్తూ, "ఆంటీ! పెద్దవారు... మిమ్మల్ని కష్టపెట్టటం నాకిష్టం లేదు. ఏవి ఎక్కడున్నయ్యో చూపిస్తే నేను వంట చేస్తాను!" అన్నది చిన్నగా.

"ఎంత కాళ్ళనొప్పులున్నా మా ఇద్దరికీ నేనే వండుతాను. అందులోనే మరో గుప్పెడు బియ్యం పోస్తే, నీకూ సరిపోతుంది. టమాటాలు ఉన్నాయి కూర చేస్తాను, రసం పెడతాను, జాడీల్లో రకరకాల ఊరగాయలు... వాటికి వేయించిన వడియాలు జత చేస్తే సరి!" స్పందనను వారిస్తూ వంటింట్లోకి వెళ్ళిపోయింది ఉమాదేవి.

"ఈ ఇంట్లో ఉండేది మీ ఇద్దరేనా అంకుల్... మీ పిల్లలు ఎక్కడుంటారు?"

ఆ ప్రశ్న ఎప్పుడు ఎవరు వేసినా నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. భయపెడుతుంది. సిగ్గుపడేలా చేస్తుంది. కానీ మాకో కొడుకున్న నిజాన్ని దాచలేను కదా! వాడు అమెరికాకు వెళ్లి అక్కడే ఓ టక్కులాడిని పెళ్ళిచేసుకుని మేమంటూ ఇంకా బ్రతికి ఉన్నామనే విషయాన్ని మర్చిపోయాడు! వాడి గురించి ఎంత తక్కువగా ఆలోచిస్తే అంత మంచిదని అనుకుంటూనే ఉంటాను గాని, అప్పుడప్పుడు ఇలాంటి ప్రశ్నలను ఎదుర్కోక తప్పటంలేదు!

"మేం ఇద్దరమే ఉంటామమ్మా... మాకు మేమే ఒకళ్ళకొకళ్ళం అండ... ఇది మా స్వంత ఇల్లు... ఇక్కడే రెండెకరాల మాగాణి ఉన్నది. సంవత్సరానికి సరిపడా వడ్లు వస్తాయి, ఇరవైవేల ఫించన్ వస్తుంది. రోజులు గొప్పగా కాకపోయినా సుఖంగానే గడిచిపోతున్నాయి!" అన్నాను. ఆ మాటల్ని ఎంత గంభీరంగా అంటున్నా నాభి దగ్గర నుంచి దిగులు ఎగదన్నుకు వస్తూనే ఉన్నది.

"పిల్లలు లేరా అంకుల్?"

అంత బాధలోనూ నాకు నవ్వు వచ్చింది. “ఉన్నాడంటే ఉన్నాడు... లేడనుకుంటే లేడు”

“అదేంటి అంకుల్?”

“అంతేనమ్మా! కనటం, రెక్కలొచ్చిందాకా మన పిల్లలే అనుకుంటూ సాకటం... తరువాత ఎగురుకుంటూ కనబడనంత దూరం వెళ్ళిపోతానంటే గుండెలో ఎలా ఉన్నా ముఖమంతా ఆనందాన్ని నింపుకుని సాగనంపటం!”

ఉమాదేవి వంటింట్లోనుంచి ఒకసారి రమ్మనమంటూ పిలిస్తే వెళ్లాను.

“ముక్కూ ముఖం తెలియని వాళ్లందరికీ మన అబ్బాయి సంగతి ఎందుకు చెబుతారు? కొంప గుట్టు రట్టు చేసుకోవటం అంటే ఇదే... వాళ్ళ ముందు లోకువయిపోమా!”

“మన సంగతి ఈ ఊళ్ళో అందరికీ తెలుసు. మరో ఒక్క మనిషికి తెలిసినంత మాత్రాన కొత్తగా వచ్చే నష్టమేమీ లేదు. అయినా ఆ అమ్మాయి అడిగింది కాబట్టి చెప్పాను!” నేను వెనక్కు వచ్చేశాను.

“మీది ఏ ఊరమ్మా?”

“మా నాన్నది కేరళ, మా అమ్మది తమిళనాడు. నాన్న ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో కాలు పెట్టాం! అందరివీ వలసబ్రతుకులే అంకుల్! దాని లాభాలు దానికున్నాయి. మలయాళం, అరవం, తెలుగు, హిందీ అన్ని భాషల్లోనూ మాట్లాడగలను, ఇప్పుడిప్పుడే మరాఠీ నేర్చుకుంటున్నాను!” హాయిగా నవ్వింది.

పూర్వం కరువుకాటకాలు వస్తే స్వంత ఊళ్లు వదిలి కాస్త తిండి దొరికే చోటుకు వలస వెళ్ళేవాళ్ళు. ఇప్పుడు జేబులు నింపుకోవటానికి వెళుతున్నారు. సాంప్రదాయాలు ఎప్పుడో మంట కలిసిపోయినాయి!

“మీ భర్త ఎక్కడివారు?” కాస్తంత ఎగతాళిగా అడిగాను.

“తెలియదు! ఉద్యోగం ఒకేచోట అవ్వటంతో ఇష్టపడి పెళ్లిచేసుకున్నాం. వివాహం అయింతరువాతే తెలిసింది తెలుగువారేనని!” నవ్వుతూ అన్నది. “మనసులు కలిస్తే ప్రాంతమూ, భాషా ఎప్పుడూ అడ్డంకి కావు అంకుల్! మీ పిల్లలగురించి అడిగినప్పుడు మీరెందుకో బాధ పడుతున్నట్లుగా అనిపించింది. నా ఉద్దేశ్యంలో ఈ రోజుల్లో తల్లిదండ్రులుగా ఎవరి బాధ్యతైనా కన్నపిల్లల్ని పెంచటం వరకే... వాళ్ళనుంచి డబ్బునే కాదు, ప్రేమనూ ఆశించకూడదు! వాళ్ళను మీరు చూసేది మహా అయితే పాతిక సంవత్సరాలు... వాళ్ళ భవిష్యత్తు అంతకు మూదురెట్లు ఉంటుంది. దాన్ని వాళ్ళు వాళ్లకు నచ్చినరీతిలో మలుచుకుంటారు!”

ఆ మాటలకు మనస్సు చివుక్కుమన్నది. విద్యాలయాలలో నేడు పిల్లలకు నేర్పుతున్న పాఠాలు ఇవా?

“మీ అమ్మ, నాన్న ఎక్కడుంటారమ్మా?”

చేయెత్తి పైకి చూపించింది. “మా అన్నలే ఎక్కడున్నారో తెలియదు. ఒకడు ఇంగ్లాండు వెళ్ళాడు, ఇంకోడు ఆస్ట్రేలియా వెళ్ళాడు. ఇంకా అక్కడే ఉన్నారో మరో దేశానికి వెళ్లారో... నా జీవితాన్ని నేను ఎన్నుకున్నట్లే వాళ్ళూ వాళ్ళ జీవితాలను ఎన్నుకుని సంతోషపు బాటలో నడిపిస్తుంటారు. ఎప్పుడయినా ఎక్కడైనా కనబడి గుర్తు పడితే ‘హాయ్’ అంటూ పలకరించుకోవటమే!” పకపకా నవ్వింది.

“అంకుల్! మీ పేరేమిటో అడగనే లేదు!” అన్నది చిన్నగా నవ్వుతూ. ఆ నవ్వు ఎంతో ఆప్యాయతతో కూడి ఉన్నట్లే అనిపించింది.

“ఉమాదేవికి భర్త ఎవరమ్మా... ఉమాపతే! నేను పుట్టిన మూడేళ్లకు అది పుట్టింది. అప్పుడు అత్తయ్యే అమ్మతో అన్నదిట... వదినా! అది ఎట్లాగూ నీ కోడలే అవుతుంది కనుక ఉమాపతికి సరిపడేలా ఉమాదేవి అని పెడదాం అని... అమ్మేమో వదినగారి మాటకు పెద్దగా నవ్వేసి ‘శుభం’ అన్నదట!”

“బాగుంది అంకుల్... మీకు కాలక్షేపమేమిటి?”

“ఏం తోచకపోతే చిన్నప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటుంటాం. ఏదో విషయం మీద వాదించుకుంటుంటాం, అరుచుకుంటుంటాం... తరువాత కంచాల దగ్గర కలిసిపోతుంటాం!”

కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండిపోయింది స్పందన.

“ఏం అమ్మా! విచిత్రంగా ఉన్నదా మా తీరు!”

“విచిత్రమేమీ లేదు అంకుల్! ట్రస్ట్ పనుల మీద ఎలా లేదన్నా సంవత్సరానికి నెలరోజులు వివిధ ప్రదేశాలకు వెళ్లి ఎంతోమందిని కలుస్తుంటాను... మీలాంటివారు తరచూ తటస్థపడుతూనే ఉంటారు. అలాంటి వారి సుఖం కోసమే నేను, మా సంస్థ తాపత్రయపడుతుండేది!”

ఆమె అలా స్పందిస్తున్నప్పుడు ఆమెలోనూ ఎదో బాధ ఉన్నట్లే అనిపించింది నాకు. బహుశా ఆమె తల్లిదండ్రులు కూడా తమలాగానే ఒంటరి బ్రతుకులు బ్రతికి వెళ్ళిపోయి ఉండవచ్చు. చెప్పింది గదా అన్నలే ఎక్కడున్నారో తెలియదని!

“మీకున్న ఆ దిగులును మీనుండి దూరం చేయాలనిపిస్తోంది నాకు!” తలవంచుకుని చిన్నగా అన్నది.

“చాలా కష్టమమ్మా!”

“మీరు చదువుకున్నవారు... ఎంతోమందికి చదువు చెప్పినవారు... ఈనాడు దేశమంతా వృద్ధాశ్రమాలు ఎందుకు వెలుస్తున్నయ్యో ఆలోచించండి! పాతకాలం మనుష్యులలోనే ఉన్నది వాటి మీద చిన్న చూపు, వాటిల్లో ఉండటానికి న్యూనతాభావం! మారుతున్న కాలంలో తెలుసుకోవాల్సింది ఒంటరి దంపతులకు అదొక స్వర్గంలాంటిదని... అవి అనాథాశ్రమాలు కావు, మీరు అనుకుంటున్నట్లుగా... విశ్రాంత మందిరాలు! మీ వయసు వాళ్ళతో మీరు కలివిడిగా తిరుగుతుంటే మనస్సులకు ప్రశాంతత చేకూరుతుంది!”

అంటే ఆ అమ్మాయి ఉద్దేశ్యం మమ్మల్ని వృద్ధాశ్రమంలో జేరమనా? కించిత్ బాధ వేసింది మనసుకు. తెలిసిన నలుగురి నడుమా ఎంత నామర్దాగా ఉంటుంది. అలా అనుకోవటమే భయం కలిగిస్తోంది!

“ఈ గ్రామంలో సరైన రహదారులే లేవు. చూచారుగా నేనెంత ఇబ్బంది పడుతూ వచ్చానో! మీకు దగ్గరలో ఆసుపత్రి సౌకర్యమూ ఉన్నట్లు అనిపించటంలేదు. డబ్బున్నా అవసరానికి ఆదుకునే దగ్గరవారూ లేరంటున్నారు. పదండి మా ట్రస్ట్ తరపున మీకు నాగార్జునసాగర్ దగ్గర ఓ అందమైన కొత్తజీవితం లభించేలా చేస్తాను!”

"అనాథల్లాగానా?"

"కాదు... రాజాలా కాలుమీద కాలేసుకుని మీ దంపతులు జీవితాన్ని అనుభవించ వచ్చు!"

"దానికి ఎంత ఖర్చు అవుతుంది!"

"మీరు ఇవ్వగలిగినంత!"

"అంటే కొంతైనా మరొకరి దయాధర్మ భిక్షం మీదే ఆధారపడవలసిందే గదా!"

"లేదు... పొందే సౌకర్యాలకు తగినంతా డబ్బులు మీరే ఇస్తారు. ఎవరి భిక్షా అక్కరలేదు. ఎంతోమంది అనుభవజ్ఞులు, మంచివాళ్ళ మధ్య మీరు మీ కాలాన్ని వెళ్ళబుచ్చవచ్చు, వారి విజ్ఞానాన్ని మీరు పొందటమే కాదు, మీ విజ్ఞానాన్ని వారితో పంచుకోవచ్చు, మీ మనసును ప్రశాంతంగా ఉంచుకోనూవచ్చు!" అన్నది ఎంతో అనునయంగా.

"ఆ అమ్మాయి చెప్పింది బాగున్నదండీ! నలుగురితో కలిసిన జీవితం ఎలా ఉంటుందో వెళ్ళి రెండునెలలు చూచి వద్దాం! ఏమాత్రం ఇబ్బంది అనిపించినా ఇక్కడ మనగూడు, మనబ్రతుకు ఎలాగూ ఉండనే ఉన్నాయి. ఆ కొద్దికాలం యాత్రలకు వెళ్లాం అనుకుంటే సరి!"

ఉమాదేవి మా మధ్యకు ఎప్పుడు వచ్చిందో గమనించనంతగా ఆ అమ్మాయితో మాటల్లో పడిపోయాను నేను!

"భేష్ ఆంటీ! ఇంటిని అలంకరించుకున్నట్లే మనస్సునూ కొత్తకొత్త అనుభవాలతో అలంకరించుకోవాలి. అప్పుడే నిస్తేజమైన బ్రతుక్కు వెలుగు లభించేది... జన్మకు సార్థకతా ఉండేది. కూపస్థమండూకాల్లా బ్రతికేందుకు కాదు.. మనకో మెదడును భగవంతుడు ఇచ్చింది!"

ఇక నేను మాట్లాడేదేమున్నది?

★★★

మూడోరోజు ఉదయాన వాకిట్లో క్యాబ్ వచ్చి ఆగేటంత వరకూ స్పందన ఆ ఏర్పాటును కూడా చేసిందనే విషయాన్ని గమనించ లేకపోయాను. ఆమె కార్యసాధకురాలన్నమాట!

ఉదయం ఏడుగంటలకు బయల్దేరి నాగార్జున సాగర్ రోడ్డులోని ఓ రెండంతస్తుల పెద్ద భవనం ముందు పదిన్నరప్పుడు దిగుతుంటే తెలియని ఉద్విగ్నత... గుట్టల నడుమ పెద్దపెద్ద వృక్షాల నీడలో ఉన్న గేటులోనుండి లోపలకు వెళ్ళిన కారులోనుంచి ముగ్గురం దిగాం.

పచ్చని గడ్డితో లాను, దానికి అటూ ఇటూ పూలమొక్కలు... వాటిమధ్య తిరుగుతున్న వృద్ధులూ కనబడ్డారు. గోడవారగా గులాబీలు, చామంతులూ! కొందరు ఆడవాళ్లు వాటిని కోసి బుట్టల్లో పడేస్తున్నారు. ఎంతో ఆహ్లాదంగా కనిపించింది ఆ దృశ్యం! తలను పక్కకు తిప్పి చూస్తే కాస్తంత దూరంలో అదే తీరులో ఉన్న మరో పెద్ద మేడ.

"మనం ఇప్పుడు కాలు పెడుతున్నది వృద్ధాశ్రమం, ఆ పక్కన కనబడుతున్నది అనాథాశ్రమం. ఇక్కడ ఉండేవాళ్ళు డబ్బులు ఇస్తారు, అక్కడివాళ్ళు ఉచితంగా ఉంటారు!" స్పందన చెబుతున్నది వాటి గురించిన వివరాలు.

"ఆంటీ అన్నట్లు మీరు ఇక్కడ రెండునెలలు ఉంటే మీరు మీ పిల్లవాడు అమెరికాలో స్వర్గసౌఖ్యాలు అనుభవిస్తూ, మిమ్మల్ని నిర్లక్ష్యం చేశాడనే బాధనే మరిచిపోతారు!" అన్నది చిరునవ్వుతో.

మౌనంగా వింటున్నాను. ఇన్నాళ్లు పల్లెలోనే ఉన్న నాకు ఆ అమ్మాయి మాటలు, ఆ ఆహ్లాదకరమైన వాతావరణమూ ఉత్సాహాన్నే కలిగిస్తున్నాయి. అన్నిటినీ పరిశీలనగా చూస్తూ లోపల కాలు పెడుతుండగానే వరండాలో పెట్టి ఉన్న పెద్ద బోర్డు నా కళ్ళను ఆకర్షించింది. దాని మీద ఇలా రాసి ఉన్నది.

"ఈరోజు సాయింత్రం ఆరుగంటలకు సమావేశమందిరంలో ఆశ్రమవాసి సంస్కృత పండితులు శ్రీమాన్ రంగనాథాచార్యులు గారి ప్రవచనం 'రామాయణంలో భరతుడి వేదన' అనే విషయం మీద ఉంటుంది. అందరికీ ఇదే ఆహ్వానం"

కొత్త ప్రపంచంలో కాలుపెట్టామా అన్నట్లుగా దాన్నే చూస్తూ ఉండిపోయాను, నా పక్కగా ఉమాదేవి...

★★★

మధ్యాహ్నం భోజనాలు అయినతరువాత నాకిచ్చిన గదిలో మేము ముగ్గురుమే కూర్చున్నాం. ఆ గదిలో తెల్లటి దుప్పట్లు పరిచిన డబుల్‌కాట్ మంచం. గోడవారగా సోఫా... టీవీ, గోడకు ఏసీ... లోపలే ఉన్న బాత్రూము.

"ఇంత ఖరీదైన గదిని నేను భరించగలనా అమ్మా?" అడిగాను కాస్తంత జంకుతూ.

"చెప్పాను కదా అంకుల్... ఆశ్రమానికి మీరు ఎంత ఇవ్వగలిగితే అంతే ఇవ్వండి! ఇది స్వచ్ఛంద సంస్థ... నాకు పరిచయం ఉన్న వాళ్ళదే గనుక మిమ్మల్ని ఇబ్బంది పెట్టరు!"

"ఏసీ మాకు అనవసరమమ్మా... ఆ వృధా ఖర్చును తగ్గించుకోవచ్చు కదా!"

"ఇప్పుడు అక్కరలేదు. ఎండాకాలంలో అవసరమొస్తే వాడుకోవచ్చు! అంకుల్ ఇక నేను బయల్దేరి సాగర్‌కు వెళతాను అక్కడ హైదరాబాద్‌కు వెళ్లే బస్సు ఎక్కేస్తా!"

"నువ్వు చిదంబరం కోసం సాయిరాంపురం వచ్చావ్. నీ పని కాకపోయినా మమ్మల్ని ఓ కొత్తజీవితం చూడమంటూ ఇక్కడ జేర్చావ్... నువ్వన్నట్లు మేం ఇక్కడ ఉండగలిగితే ఉంటాం, లేకపోతే తిరిగి సాయిరాంపురం వెళ్ళిపోతాం. ఇప్పుడు ఇక్కడ ఎంత కట్టాలో కనుక్కుంటే రెండునెలలకు డబ్బు ఇచ్చేస్తాను!" అన్నాను.

నాకు ఒకందుకు సంతోషంగా ఉన్నది.. కుంటుకుంటూ నడిచే ఉమాదేవికి వంటచేసే శ్రమ తగ్గించగలిగాను. ఇంతవరకూ జీవితంలో దానికి నేను చేసిన మేలు ఇదొక్కటే!

★★★

అక్కడ మేము జేరిన పదిహేను రోజులకు స్పందన నుండి ఓ ఉత్తరం వచ్చింది. అదీ అమెరికా నుండి.

ఆత్రంగా కవరు చించి ఉత్తరాన్ని బయటకు తీశాను.

"మామయ్య గారు,

నమస్కారం. నేను స్పందనను. సాయిరాంపురం వచ్చింది నాకు తెలియని చిదంబరంగారి కోసం కాదు. మీ కోసమే. నేను ఉద్యోగం చేస్తున్నది హైదరాబాద్‌లో కాదు, అమెరికాలోనే.

నన్నో ధర్మసందేహం పీడిస్తున్నది. మీ అబ్బాయి నాకు విడాకులు ఇచ్చి ఇంట్లో నుంచి తరిమేసిన తరువాత నేను మిమ్మల్ని మామయ్యగారు అని పిలవవచ్చా? అలా పిలవటం తప్పయితే మన్నించండి.

అసలు విషయం చెప్పకుండా మీ దంపతుల్ని వృద్ధాశ్రమంలో జేర్చటానికి కారణం – నిజాలు చెబితే మీరు అంగీకరించరనే భయం. మీ భవిష్యత్తంతా ప్రశాంతంగా గడిచిపోయేలా చేయాలనే మీ ఇంట కాలు పెట్టాను.

అమెరికాలో ఉద్యోగం చేస్తున్న మీ అబ్బాయికి నేను మా వివాహసమయంలో సహ ఉద్యోగిని. అతడు నన్ను వివాహం చేసుకున్నది నా మీద ప్రేమతోనూ, నా అందం చూసీ కాదని, నా జీతమే అతడిని ఆకర్షించిందని... తరువాత కొద్ది నెలల్లోనే తెలుసుకోగలిగాను. అతడి నరనరానా స్వార్థమే! అయినా నేను అతడిని అంత తేలిగ్గా వదిలిపెట్టలేదు. పట్టుబట్టి చాలా పెద్ద మొత్తంలోనే కోర్టు ద్వారా భరణం పొందాను. కానీ దాన్ని నేనేం చేసుకోను? నా సంపాదనే నాకు ఎక్కువ. అతడిచ్చిన డబ్బులోనుంచే పదిలక్షలు మీకు ఉపయోగపడేలా ఆశ్రమానికి కట్టాను. తల్లిదండ్రులు లేని నాకు ఇక మీరే కావాల్సినవారు అనే సదుద్దేశ్యంతో, మిమ్మల్ని ఎలా కలవాలి అనుకున్నప్పుడు.. నేను మీ అబ్బాయితో సంసారం చేసిన రోజుల్లో మాటల్లో ఒకసారి మీ ఊళ్లోని మీ స్నేహితుడు చిదంబరం గురించి, తనతో చదివిన వాళ్ళ అబ్బాయి గురించి చెప్పాడు. ఆయన సాయిరాంపురంలో ఇప్పుడు ఉండటంలేదనీ చెప్పాడు. ఆఫీసుపని మీద ఇండియా వచ్చిన నేను ఆ ఆధారంతోనే మీ ఇంట్లో కాలుపెట్టింది. కానీ, ఇరవై అయిదు సంవత్సరాలు పెంచి, వృద్ధిలోకి తెచ్చిన మిమ్మల్నే సురేష్ మర్చిపోయాడని మా వివాహానికి ముందే తెలిసి ఉంటే అతడిని నా భర్తగా అంగీకరించి ఉండేదాన్నే కాదు. అలాంటి మనిషి కొన్ని నెలల పరిచయంతోనే తన భార్యగా చేసుకున్న నన్ను ఎన్నాళ్ళు భార్యగా చూడగలుగుతాడో ముందే ఊహించి ఉండగలిగేదాన్ని!

ఇప్పుడు నన్ను వదిలించుకుని ఓ అమెరికా దొరసానిని చేసుకుని, మరో ఉద్యోగంలోకి మారి, మరో దేశం వెళ్ళిపోయాడు. ఆమెనూ ఎన్నాళ్ళు భార్యగా చూస్తాడో నాకు అనుమానమే.

ఒంటరిదాన్ని అయిన నాకు అమెరికా మీద, ఉద్యోగం మీద మోజు తీరినప్పుడు, నేనూ మీతోపాటే ఆ ఆశ్రమంలోనే గడుపుతాను. నేను ఇక్కడ బాగానే సంపాదిస్తున్నాను గనుక నాకు డబ్బు భయం లేదు.

సాయిరాంపురంలో కంటే మీరు అక్కడే ప్రశాంతంగా ఉండగలుగుతారని నా నమ్మకం. అది వమ్ము కాదనేది నా ధైర్యం.

నా అమెరికా చిరునామా, నా ఫోన్ నంబరు ఇస్తున్నా. నేనే ప్రతి ఆదివారం మీకు ఫోన్ చేస్తుంటాను!

మీ

స్పందన"

# నేనే రాధనోయి

భమిడిపాటి గౌరీశంకర్

✆ 9492858395

***"జీవితం కోసం నేను పెద్ద యుద్ధమే చేసానురా. కానీ యుద్ధం చేయటం వలన నా మీద నాకు జాలి పోయింది. అవతలి వారి బలహీనతలని క్షమించగలిగే స్థితి వచ్చింది. బహుశా వేదాంతమంటే అదేనేమో..! ఇప్పుడు నువ్వు వచ్చిమన్నా వచ్చేస్తా!" అంది కళ్లతో నవ్వుతూ. "వచ్చేయనా?" అంది బుగ్గ లాగుతూ.. "నీ సిగ్గు బాగుంటుందిరా!" అంది. అన్ని భావాలను ఒకే సమయంలో ఎలా సాధ్యమూ!***

వేసే ప్రతీ అడుగుకి అంగుళం దూరంలో ధ్యేయం పెడతాడు దేవుడు! అందుకే స్వర్గాన్ని అంత ఎత్తులో కట్టాడు. కొందరే అక్కడికి చేరుకోగలరు... అంగలేసి అలసిపోనివారు! నాకు ఎక్కడో.. ఎవరో రాసిన వ్యాఖ్యలు గుర్తుకు వచ్చాయి, మా ఊరి గ్రామదేవత పండుగలో రాధని చూసాక... రాధ నా మేనకోడలు.. మూడు దశాబ్దాల తరువాత చూసాను. అప్పటికన్నా అందంగా, హుందాగా, ప్రభుత్వ టీచర్‌గా, ఐదు పదుల నిండైన వ్యక్తిత్వంతో మెరుస్తున్న వ్యక్తిగా!

★★★

విజయనగరం నుంచి సింహాచలం వెళ్లే రూట్‌లో ఉన్న చిన్న గ్రామం తునివలస! రెండువందల గడప. వెయ్యి జనాభా. గ్రామానికి ప్రారంభంలో గ్రామదేవత బంగారమ్మ ఆలయం... కొత్త రంగులతో మెరిసిపోతోంది. నేను బస్సు దిగేసరికి, ఏ పని లేనివారంతా... యువత హడావుడిగా తిరుగుతున్నారు. గ్రామదేవత పండుగ రెండురోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. ఎక్కడెక్కడి నుంచో బంధువులు, స్నేహితులు చేరుకుంటారు ఒకరోజు ముందుగానే!

తునివలస మా తాతగారి ఊరు! బాల్యమంతా ఇక్కడ పొలాలు, తాటితోపులు, గొడ్ల చావడిలలో పెట్రోమాక్స్ లైట్స్, బుడ్డిదీపాల నడుమ గడచిపోయింది. వేసవి సెలవులు వస్తే, పదిరోజులు నా మకాం ఇక్కడే! చూరు నేలను తాకుతున్నట్టు ఉండే ఇళ్ళు, అన్నీ నిట్రాట గుడిసెలే! దీపాలు లేవు. గ్రామ పంచాయితీ రేడియో రోజుకు మూడుగంటలు ప్రసారం చేసే కార్యక్రమాలే వినోదం. ఇటువైపు ఐదు కిలోమీటర్ల దూరంలో కోరుకొండ సైనిక్ స్కూల్. మైసూర్ పాలెస్ మాదిరి గర్వంగా నిలిచి ఉండేది. అక్కడ శని, ఆదివారాలు రాత్రి ఎనిమిది గంటలకు ఆరుబయలు థియేటర్‌లో కేవలం హిందీ సినిమాలు వేసేవారు. వాటికోసం ఆరుగంటలకే భోజనాలు పూర్తిచేసి... నేను, మూర్తి, సొట్టడు, శ్యామ, రోహిణి, బుచ్చి వెళ్లేవారం. సినిమా పూర్తయేసరికి తెల్లవారి నాలుగయేది. నిద్రకళ్ళతో పొలాలకు అడ్డంపడి వచ్చేసేవారం... వెన్నెల టార్చిలైట్ వెలుగును చూసుకుంటూ! ఆడ, మగ తెలిసేది కాదు.. కేవలం మేమంతా స్నేహితులం, బంధువులం! హాయిగా ఆడుకుంటూ, పాడుకుంటూ వచ్చేసేవారం.

అమ్మవారి పండుగంటే సంబరమే! ఎక్కడెక్కడినుంచో కొత్త కొత్త అమ్మాయిలు వచ్చేవారు. అదో ఆనందం. ఓ రెండురోజులు ఆ చీకట్లో హీరోలని ఫీలయేవారం!

ఆ తరువాత షరా మామూలే... ఎవరిదారి వారిది!



ప్రతీ సంవత్సరం, మా బావ పిలుపు మేరకు పండగకు ఇప్పటికీ వెళుతుంటాను. పాత జ్ఞాపకాల కోసం, కొత్త యువతరం ఆలోచనలను పంచుకునేందుకు.. నాతో తిరిగిన వారంతా కలుస్తారు. ఏరా అంటే.. ఏరా అనుకుంటాం!

ఈ సంవత్సరం పండుగ నాకు మరింత ఆనందాన్నిచ్చింది. కారణం... రాధ!

★★★

“రమణమ్మ నిన్న వచ్చిందిరా. దాని చిన్న కూతురు వస్తున్నాదిట. చిన్నతల్లి, ప్రకాష్‌లు వస్తున్నారు. వాళ్ళన్నయ్య శివ కూడా. కొంచం కూరలు గట్రా ఎక్కువ తీసుకురా” అంది అమ్మ సంచి అందిస్తూ.

మా నాన్న రిటైర్ అయిన తరువాత ఓ పాత పెంకుటిల్లు అమ్మకానికి వస్తే మా మామయ్య ఆనాటి రోజుల్లో వందల్లో పెట్టి కొనిపించాడు. మా అమ్మ కన్నవారిల్లు తునివలస. మా మామయ్యది ప్రక్క ఇల్లు. మా పెద్ద మామయ్య విజయనగరం – గర్భాం బస్సు కండక్టర్. ఆయన భార్య ప్రభుత్వ టీచర్. ఆవిడే మాకు ఆదర్శం! నేను, మా రెండో అన్నయ్య, మా పెద్దనాన్నగారి అబ్బాయి టీచర్‌గా స్థిరపడటానికి ఆమే రోల్ మోడల్! నాన్నగారి రిటైర్మెంట్ తరువాత మా ఆర్థిక పరిస్థితిలో ‘లేమి’ కనిపించింది.

అయినా... ఎవరి మీద ఆధారపడేవారం కాదని మాకో విశ్వాసం. కారణం... అమ్మ ఇంటిని నడిపే విధానం!

అమ్మవారి పండుగ ఘనంగా జరుగుతోంది. ఘటాలు, జంగిడెలు, బంధువులు, జాతర, పిక్క ఆటలు, రంగుల రాట్నాలు, తాగుబోతుల గొప్పలు... రోడ్డు మీద పడిపోవటాలు... ఇవన్నీ పెట్రోమాక్స్ వెలుగుల్లో సగం చీకటి, సగం వెలుతుర్లు మధ్య గడచిపోయేది. అందరం కలిసి, ఎవరి ఇంట్లో ఎవరు తింటున్నారో తెలియదు. అయినా అందరూ అప్యాయంగా ‘రారా... తినేసి వెళ్ళు’ అని అభిమానంగా విస్తరాకు వేసి ఆత్మీయతతో వడ్డించేవారు. పంచభక్ష్య పరమాన్నాలు కాదు కాని, పచ్చడి, చారు, బూరె... నోరారా పలుకరించి, మనసంతా నవ్వు వడ్డన చేసేవారు. మధ్య మధ్యలో బంధుత్వాల జోకులు, ఆడపిల్లల చెమట వాసనలు. పెళ్ళయిన ఆంటీల కాలి మువ్వలపట్టీల శబ్దాలు, దూరంగా డప్పుల మ్రోతలు.. సంప్రదాయపూరిత కాక్‌టైల్ అనుభూతి!

అదిగో... అప్పుడు నా ప్రక్కన కూర్చుందో పదిహేనేళ్ళ అమ్మాయి రాధ!

సన్నగా... అంతా కలిపితే రెండుకేజీల మాంసం కూడా ఉండదు శరీరంలో! అయినా కళగా ఉన్నమొహం.. ఎప్పుడూ పెదాలపైన చిరునవ్వు... కళ్ళతో నవ్వుతూ మాట్లాడగలిగే నైపుణ్యం... నడకలో హుందాతనం... పలకరింపులో భోళాతనం... శరీరం నిండా నాజూకుతనం... మొత్తంగా... ఏదో ఫ్లేవర్ శరీరానికి పూసుకున్న వ్యక్తిత్వం!

“రాధరా... మన రమణమ్మ గారి చిన్నకూతురు. శివా చెల్లి, చిన్నతల్లికి కూడా చెల్లి!” మా వదిన పరిచయ వాక్యాలు.

ఒక్కసారి చూసాను. “నువ్వు మా శంకరానివి కదా...” అంది.

“అది జగదల్‌పూర్‌లో చదువుతోంది. ఈసారి ఏవో సెలవులట. వచ్చింది!” మరోసారి మా వదిన పరిచయం.

రాధ... పేరు బాగుంది. మనిషి గొప్ప అందగత్తె కాదు, కాని.. ఏదో తెలియని ఆకర్షణ ఉంది. బహుశా పద్దెనిమిదేళ్ళ ప్రాయంలో ఎవరైనా అలాగే ఉంటారేమో, అలానే ఉంటుందేమో! నేను స్వతహాగా సిగ్గరిని. ఆడపిల్లలంటే బెరుకు. రాధ చనువు... రెండురోజుల్లో దానిని కాస్త తగ్గించింది.

★★★

'రమణమ్మగారి కుటుంబం గొప్ప కలిగిన కుటుంబం కాదు. అయినా ఫర్వాలేదు. ఓ ఎకరా బంజరుంది. అక్కడ ఓ స్థలముంది, తాటి తోపుంది. ఆరుగురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు...' ఆ రాత్రి పండగ కోసం మల్లెపూలు దండ కడుతూ... వదిన చెప్పిన మాటలు! రాధ వాళ్ళ కుటుంబం గురించి నాకు తెలుసు... ఈ రోజు కాస్త ఆసక్తిగా విన్నాను అంతే!

ఈలోపుగా దండను పూర్తిచేసి వదిన ఇంట్లోకి వెళ్ళిపోయింది. రాధ, నా దగ్గరకు వచ్చి, "రారా... బయట మంచం వేసుకొని కూర్చుందాం" అంది. అందరం ఆరుబయట వెన్నెల్లో, నులకమంచం వేసుకొని కూర్చున్నాం.

"చెప్పురా... నీ చదువు... గట్రా..." అంది.

నేను చెప్పాను.

"పండగయిపోతే భీమిలి వస్తావా?" అంది. సరేనన్నాను. "అమ్మకు ఓ మాట చెప్పాలిగా" అన్నాను.

గట్టిగా కళ్ళతో, నోరారా నవ్వింది. "అక్కకి నేను చెబుతాలే... నిన్నేమీ అక్కడ తినేయనురా" అంది.

నాకు నవ్వు వచ్చింది.

ఆ తరువాత, దూరంగా మ్రోగుతున్నడప్పులు శబ్దం దగ్గరవసాగింది. మంచం ఎత్తేసి, అందరం ఎవరింటికి వారెళ్ళిపోయాం. పండగ రెండు రోజులు సరదాగా గడచిపోయింది. రాధ నన్ను వదలలేదు. నేను కూడా!

భీమిలి కూడా తీసుకువెళ్ళింది. అక్కడ ఆమెలోని ధైర్యం, తెగింపు, లక్ష్యంకోసం తపన గమనించాను. పండగ తరువాత ఆమె జగదల్‌పూర్ వెళ్ళిపోయింది, చదువుకోసం!

చదువు అవసరం ఆమె వలన మరోసారి తెలుసుకున్నాను.

అదే ఆమెను ఆఖరుగా చూడటం.

జ్ఞాపకశక్తి గనిలాంటిది. తవ్వేకొద్దీ బంగారం దొరుకుతుంది!

★★★

గ్రామమంతా కొత్త పెళ్ళికూతురులా ముస్తాబయింది. పల్లె నిండుగా జనం. కృత్రిమదీపాల కాంతుల వరుసలు. కొత్తతరం యువతీ యువకుల నాగరికత ప్రదర్శనలు. మద్యం దుకాణాల్లో సీసాల శబ్దాలు... త్రాగుబోతుల సందళ్ళూ... పల్లె కొత్త నాగరికతతో ఊగుతోంది. సంప్రదాయం సిగ్గుతో ప్రక్కకు తప్పుకుంటున్న దృశ్యాలు!

నేను ఒక్కడినే గుడికి వెళ్ళాను. ఐదున్నర పదుల వయస్సులో దాదాపుగా ఒంటరితనానికి అలవాటు పడిపోయాను.

కోవెల రద్దీగా ఉంది. రమణమ్మగారి కుటుంబీకులే... అంటే చిన్నతల్లి, ప్రకాష్‌లే ఆలయబాధ్యతలు తీసుకున్నారు, అత్యధిక మొత్తం వేలం పాడి! దేవుడు కూడా సంతలో వస్తువైన చందం!

జనం మధ్యలో క్యూలో నిల్చున్నాను. క్యూ చాలా దూరం వరకు ఉంది. "ఒరే శంకరం... ఇటు... ఇటు..." అని ఎవరిదో పిలుపు. చిరపరిచితమైన పిలుపు! అటు చూసాను. ఎవరో పెద్దావిడ. ఓ డబ్భై కేజీల బరువు గల ఆసామి... స్త్రీనే! చేతులతో రమ్మని సైగ చేస్తోంది. టిక్కెట్స్... దర్శనం కోసం భక్తులకిస్తోంది.

క్యూలోంచి అక్కడకు వెళ్లాను. "గుర్తు పట్టావా?" అంది.

"లేదు" అన్నాను.

"నువ్వేమీ మారలేదురా" అంది.

"రా" అని అంటుంటే "రాధవా?" అంటూ, గుర్తుపట్టాను.

"హమ్మయ్య! గుర్తుకు వచ్చాను." అని, ప్రక్కనున్న ముసలాయనతో, "ఏమండీ... వీడు మా అక్క కొడుకు. ఉండండి. దర్శనం చేయించి వస్తాను" అని, "రారా!" అంటూ, చేయి పట్టుకొని లాక్కెళ్ళింది. దర్శనం అయిపోయింది. ఓ అరటిపండు చేతిలో పెట్టింది. "దా... అలా వెళ్దాం. పనేమీ లేదుగా" అంది.

"పండగే ఓ పని" అన్నాను సరదాగా! వాళ్ళాయనకు... అదే ఆ ముసలాయనకు చెప్పి, ఇద్దరం బయటకు వచ్చాం.

దూరంగా... ఓ ఖాణా మీద కూర్చున్నం. వెన్నెల విరగకాస్తోంది. వెన్నెల్లో పండుగ సిరిని తెస్తుందట. నాకు నవ్వు వచ్చింది.

"చెప్పు నీ గురించి... చాలా ఏళ్ళు అయిపోయింది!" అంది.

"ఏముంది? టీచర్ ఉద్యోగం వచ్చింది. ఇద్దరాడపిల్లలు... పెళ్ళిళ్ళు చేసేసా! అందరూ సెటిల్ అయిపోయారు. ఇదిగో ఇప్పుడు... కాస్త ఖాళీ... ఇలా వచ్చేసాను. లక్కీగా నువ్వు కలిసావు!" నా చేతిని తన చేతిలోనికి తీసుకొని, "నీ గురించి చెప్పు! నాదేముంది? పరాజితైన ప్రస్తుత విజేతను నేను..." అని అంతా చెప్పాను. కొంచెం సేపు ఆగి, "నీ ప్రేమ పెళ్ళి, జీవితం! అది చెబుదూ" అన్నాను, ఆసక్తిగా!

"జీవితం కోసం నేను పెద్దయుద్ధమే చేసానురా. కానీ యుద్ధం చేయటం వలన నా మీద నాకు జాలి పోయింది. అవతలివారి బలహీనతలని క్షమించగలిగే స్థితి వచ్చింది. బహుశా వేదాంతమంటే అదేనేమో... ఇప్పుడు నువ్వు వచ్చేయమన్నా వచ్చేస్తా!" అంది కళ్లతో నవ్వుతూ. "వచ్చేయనా?" అంది బుగ్గ లాగుతూ. "నీ సిగ్గు బాగుంటుందిరా!" అంది. అన్ని భావాలను ఒకే సమయంలో ఎలా సాధ్యమో!

"పిల్లలను తీసుకురాలేకపోయావా!" అన్నాను టాపిక్ మార్చి.

"కావాలనే తీసుకురాలేదు. ఈ మధ్య నిర్లిప్తత వస్తోంది. ఒక్కసారి దానిని దగ్గరకు రానిచ్చామా... ఆ మత్తు నరనరాల్లోనికి పోతుంది. లక్ష్యాన్ని దూరం చేస్తుంది!" అంది, గొప్ప వేదాంతిలా.

"అవునా?" అన్నాను.

"అఫ్ కోర్స్... నా బరువు వలన కూడా అనుకోవచ్చా?" నవ్వింది. "దా... అలా నడుద్దాం. నీతో నడవాలని ఉందిరా" అంది.

ఇద్దరం కొద్ది దూరం నడిచాం_ _ _ వెన్నెలలో, వృద్ధాప్యపు ఛాయలతో ఇద్దరి నడక!

సమస్యల్ని చిరునవ్వుతో సాధించిన వారే తన లక్ష్యాన్ని చేరుకుంటారు. రాధ. ఆ కోవకు చెందుతుంది.

"ఈరోజు ఆనందంగా ఉంది. లవ్ మారేజ్ చేసుకున్నాను. పిల్లలు సెటిలైపోయారు. ఎవరి ఉద్యోగాలు, కుటుంబాలు వారివి. మరో ఎనిమిదేళ్ళుంది సర్వీసు! ఆ పెద్దాయన మా ఆయన... చూసావుగా, నీలాంటివారే!" అంది టీజింగ్‌గా.

కాలప్రవాహంలో మనిషి మారతాడంటారు. కాని ఈమె శారీరకంగా మారింది, మానసికంగా ఎదిగింది.

ఇద్దరం నవ్వుకున్నాం. పరిసరాలు కూడా వెన్నెల వెలుగులో నవ్వినట్టనిపించింది.

'నేనే రాధనోయి...' నా ఫోన్ రింగ్‌టోన్. వదిన నుంచి ఫోన్.

"రింగ్‌టోన్ బాగుంది" అంది రాధ.

"నీ నవ్వులా" అన్నాను.

వెనక్కి తిరిగిపోయాం. తను కోవెలలోకి వెళ్ళిపోయింది 'బై' అని!

ఫోన్ నెంబర్ తను ఇవ్వలేదు, నేనూ అడగలేదు. ఈ ప్రపంచంలో గొప్ప ఆనందాలన్నీ మొదట్లో బాధపెట్టేవే!

పురుషుడినుంచే స్త్రీ సృష్టించబడింది. అతని మీద ఆధిపత్యం వహించడం కోసం అతను తలనుండి కానీ, దాసిగా ఉండటం కోసం పాదాలనుంచి కానీ సృష్టించబడలేదు. అతనితో సమానంగా జీవించడం కోసం... అతని రక్షణ పొందడం కోసం... అతనిని ప్రేమించడం కోసం... ప్రేమించబడటం కోసం అతని భుజానికి, హృదయానికి సమీపంలోని ప్రక్కటెముక నుంచి స్త్రీ సృష్టించబడింది!

రాధ అటువంటిదే...

# పాపం పసివాడు

నిష్టల సుబ్రహ్మణ్యం
✆ 8374747930

***తను ప్రేమించిన పవన్ కొడుకని తెలిసి, ఆ బాబుని వదులుకోలేక అలా చేసింది. నేను అప్పటికీ చెబుతూనే ఉన్నాను. తను చేసింది తప్పు! బాబుని తీసుకువెళ్ళి ఇచ్చేద్దామని చెప్పినా, అది వినలేదు. దాని మానసిక పరిస్థితి చూసి, ఆ పిచ్చిలో బాబుని ఏం చేస్తుందోనని, నెమ్మదిగా సర్ది చెప్పి బాబుని తీసుకువెళ్ళి ఇచ్చేయవచ్చు అని అనుకున్నాను.***

కాలింగ్ బెల్ మ్రోగడంతో, అసిస్టెంట్ డిటెక్టివ్ గోపి, వెళ్లి తలుపు తీసాడు. ఎదురుగా ఇద్దరు వ్యక్తులు నిలబడి ఉన్నారు.

అందులో ఒక వ్యక్తి, "డిటెక్టివ్ రాజుగారిని కలవాలి." అన్నాడు. గోపి వాళ్ళను లోపలకు రమ్మని సైగ చేసాడు. వచ్చిన వాళ్ళు లోపలకు వెళ్లి అక్కడ సోఫాలో కూర్చున్న డిటెక్టివ్ రాజుకి నమస్కరించి అతనికి ఎదురుగా ఉన్న కుర్చీలలో కూర్చున్నారు.

రాజు, వాళ్ళ వైపు నిశితంగా చూసాడు. ఒక వ్యక్తికి దాదాపు 70 సంవత్సరాలు ఉంటాయి. ఖద్దరు పంచె, ఖద్దరు లాల్చీ ధరించాడు. కళ్ళద్దాలు పెట్టుకున్నాడు. రెండవ వ్యక్తికి దాదాపు 35 సంవత్సరాలు ఉంటాయి. ఖరీదైన దుస్తులు ధరించి చాలా మోడరేట్‌గా ఉన్నాడు. ఇద్దరూ కూడా చాలా బాధపడుతున్నట్లుగా ఉన్నారు.

"చెప్పండి." అన్నాడు రాజు.

పంచె కట్టుకున్న వ్యక్తి, "మీ సహాయం కోరి వచ్చాము. నా పేరు భూషణం. మేము విజయవాడలో ఉంటాం. మాది వ్యవసాయ కుటుంబం. వీడు నా కొడుకు. పేరు పవన్. అమెరికాలో ఉంటున్నాడు. వీడికి ఒక కొడుకు. మూడుసంవత్సరాల మీద ఆరునెలలు ఉంటాయి. పేరు రాహుల్. వీళ్ళు నాలుగురోజుల క్రితమే అమెరికా నుంచి వచ్చారు. ఇంతలోనే..." అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. అతని కొడుకు కూడా వచ్చే దుఃఖాన్ని ఆపుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

"ప్లీజ్... బాధపడకండి. ఏం జరిగిందో చెప్పండి. నా శాయశక్తులా మీకు సహాయం చేస్తాను!" అంటూ రాజు, గోపి వైపు చూసాడు.

గోపి రెండు గ్లాసులతో మంచినీళ్ళు తెచ్చి వారిద్దరికీ ఇచ్చాడు.

భూషణం కొద్దిగా త్రాగి, కళ్ళు తుడుచుకుంటూ చెప్పసాగాడు. "నిన్నటినుంచి మా మనవడు కనిపించడం లేదు సార్! పోలీస్ స్టేషన్‌లో కంప్లయింట్ ఇచ్చాం. మీ గురించి తెలిసి, మీ సహాయం కూడా తీసుకుంటే మంచిదని వచ్చాం!" అన్నాడు.

“మీకు ఎవరిమీదనయినా అనుమానం ఉందా? శత్రువులు ఉన్నారా? అంటే మీ ఆస్తికి సంబంధించి ఎవరితో అయినా విభేదాలు ఉన్నాయా?” రాజు అడిగాడు.

“అలాంటివేమీ లేవు సార్!” చెప్పాడు భూషణం.

గోపి మధ్యలో కలగచేసుకుంటూ అడిగాడు, “ఆఖరిసారిగా మీ మనవడ్ని ఎవరు, ఎప్పుడు చూసారు?”

“ఆరోజు సాయంత్రం మా తమ్ముడు శేషగిరి వాడిని ఉయ్యాలలోంచి తియ్యడం చూసానని మా పనిమనిషి చెప్పింది. నిద్రపోతున్న బాబుని ఉయ్యాలలోంచి తియ్యడం ఎందుకా అనుకున్నానని చెప్పింది.” అన్నాడు భూషణం.

“అప్పటినుంచే కనబడటం లేదన్నారు కదా... ఆ సమయంలో బాబు ఏ రంగు డ్రెస్ వేసుకున్నాడు? ఏమైనా గుర్తులు చెప్పగలరా?” అని ఆడిగాడు రాజు.



“ఆ సమయంలో బాబు నీలంరంగు డ్రెస్‌లో ఉన్నాడు. ఆ డ్రెస్ మీద ఏవో బొమ్మలు ఉన్నాయి. రెండు చేతులకు బంగారు మురుగులు అంటే, తీగలాంటి చుట్లు, కాళ్ళకు వెండి మువ్వలు ఉన్నాయి. పాదాలకు కూడా నీలిరంగు సాక్స్ తొడిగాం!”

“గుడ్. అన్నట్టు మీ ఆస్తి ఎవరి పేరు మీద ఉంది? అంటే మీది ఉమ్మడి కుటుంబం అంటున్నారు కదా!”

“ఆస్తి అంతా నా పేరు మీదే వ్రాసారు మా నాన్నగారు. మా తమ్ముడు శేషగిరికి చదువు అబ్బలేదు. చిన్నప్పటి నుంచే, వాడికి

చెడు అలవాట్లు వచ్చాయి. అందుకని ఆస్తి నా పేరు మీద వ్రాసారు. వాడిని, వాడి భార్యను, నేను పోషించాలి. నా తరువాత ఆస్తి అంతా నా మనవడికి దక్కుతుంది." భూషణం చెప్పాడు.

"మీకు బెదిరింపు ఫోన్ కాల్స్ ఏమైనా వచ్చాయా?"

వాళ్ళు అటువంటి ఫోన్ కాల్స్ ఏమీ రాలేదని చెప్పారు.

"సరే, మేము వస్తాము. మీరేమీ కంగారు పడకండి మీ అడ్రస్ ఫోన్ నెంబర్లు అన్నీ ఇవ్వండి." అన్నాడు రాజు.

పవన్ చెప్పిన వివరాలు, అతని కొడుకు ఫోటో అన్నీ గోపి తీసుకున్నాడు.

"మీ ఫీజ్, ఎడ్వాన్స్‌గా ఇది ఉంచండి" అంటూ, కొంత డబ్బు అక్కడ ఉన్న టీపాయ్ మీద పెట్టాడు పవన్.

"మిమ్మల్నే నమ్ముకున్నాం. మరి వెళ్తాము సార్." అని తండ్రీ కొడుకులు వెళ్ళిపోయారు.

మర్నాడు... 'రెడ్ రోజ్' కారు, విజయవాడ పోలీస్ స్టేషన్ ముందు ఆగింది. అందులోంచి డిటెక్టివ్ రాజు గోపి దిగి లోపలకు వెళ్లారు.

ఎస్సై సుకుమార్ వీళ్ళని చూసి, విష్ చేసి, కుర్చీలు చూపించి కూర్చోమని, "రాజుగారూ! ఎలా ఉన్నారు? చాలారోజులయింది మనం కలుసుకుని. ఏమిటి ఇలా వచ్చారు? ఏదైనా కేసు విషయమై వచ్చారా?" అడిగాడు.

"అవును మిస్టర్ సుకుమార్! ఇక్కడ భూషణంగారి మనవడు గత రెండురోజుల నుంచి కనబడటం లేదు అని మీకు కంప్లయింట్ ఇచ్చారుట కదా! ఆయన నా సహాయం కూడా కోరి, నా దగ్గరకు వచ్చారు. ఆ కేసు గురించి వచ్చాము." అని కాస్సేపాగి, "మీ ఇన్వెస్టిగేషన్ ఎంతవరకు వచ్చింది?" అడిగాడు రాజు.

"ఓహ్! ఆ కేసా? మేము ఇన్వెస్టిగేట్ చేస్తున్నాము. మాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. కిడ్నాప్ అనుకుందామంటే, వాళ్లకు ఎటువంటి బెదిరింపులు రాలేదుట. ఆ వీధి కూడా చాలా చిన్నది. ఆ వీధిలో ఉన్న ప్రతి ఇంటినీ సోదా చేసాము." సుకుమార్ అన్నాడు.

"ఆ వీధిలో మీకు ఏ ఆధారాలు దొరకలేదా?" అడిగాడు గోపి.

"ఏమీ దొరకలేదు. అక్కడ సీసీ కెమెరాలేమీ లేవు!" చెప్పాడు ఎస్సై.

"ఓకే! మేము ఒకసారి భూషణం ఇంటికి వెళ్లి, మా పద్ధతిలో పరిశోధన మొదలుపెడతాం!" అని గోపితో కలిసి పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చాడు డిటెక్టివ్ రాజు.

భూషణం ఇంటిముందు ఆగిన 'రెడ్ రోజ్' నుంచి దిగారు డిటెక్టివ్ ద్వయం.

వీళ్ళను చూసి భూషణం, లోపలకు ఆహ్వానించాడు. వాళ్ళు అక్కడ ఉన్న కుర్చీలలో కూర్చున్న తరువాత, భూషణం తన కుటుంబ సభ్యులను పరిచయం చేసాడు. ఇంతలో పవన్ భార్య సుమ, ఒక ట్రేతో కాఫీ తీసుకు వచ్చి టీపాయ్ మీద పెట్టి, వెళ్ళిపోయింది.

“భూషణం గారూ! మేము ఇప్పుడు పోలీస్ స్టేషన్ నుంచి వస్తున్నాము. ఎస్సై సుకుమార్‌గారు మీ మనవడ్ని వెతికే ప్రయత్నంలోనే ఉన్నారు. మీరేమీ కంగారు పడకండి. ఈ కేసుని మేము ఒక ఛాలెంజ్‌లాగా తీసుకుంటాము. నేరస్థుడిని త్వరలో పట్టుకుంటాం. మీ మనవడ్ని మీకు అప్పజెబుతాం. మీరు బాధపడకండి. ఎలాంటి బెదిరింపు కాల్స్ రాలేదన్నారు, శత్రువులు ఎవరూ లేరన్నారు. కాబట్టి మీ బాబు క్షేమంగానే ఉండి ఉంటాడు. ఎవరో తెలిసిన వాళ్లే మిమ్మల్ని ఆటపట్టించడానికి తీసుకువెళ్లి ఉంటారు!” రాజు అన్నాడు.

“సార్! మీరు దయచేసి మా మనవడ్ని వెతికి పెట్టండి. మేము ఎప్పుడూ ఎవరికీ అపకారం చెయ్యలేదు. మరి దేముడు మమ్మల్ని ఎందుకింత ఇంత క్షోభ పెడుతున్నాడో!” అంటూ వాపోయింది భూషణం భార్య. గోపి ఇల్లంతా ఒకసారి చెక్ చేసి, పెరటివైపు ఉన్న ఒక కుర్చీలో కూర్చుని, ఇంట్లోని వాళ్ళను ఒక్కొక్కరినీ విడివిడిగా ప్రశ్నిస్తున్నాడు. శేషగిరి అక్కడ ఉన్న మొక్కల దగ్గర నిల్చుని, ఫోన్లో ఎవరితోనూ మాట్లాడుతున్నాడు. గోపి ఒకవైపు ఒక్కొక్కరినీ ప్రశ్నిస్తూనే, శేషగిరివైపు చూస్తూ అతను మాట్లాడుతున్నది వినడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇంతలో బాగా నలిపేసి ఉండగా చుట్టి ఉన్న ఒక కాగితం గోపి కాళ్ళదగ్గర పడింది. గోపి వంగుని ఆ కాగితం తీసుకుని చుట్టూ చూసాడు. ఎక్కడనుంచి ఆ కాగితం పడిందోనని. ఎవరూ కనబడలేదు. అది జేబులో పెట్టుకున్నాడు.

తరువాత... శేషగిరిని ప్రశ్నిస్తున్నప్పుడు యథాలాపంగా అడిగాడు. “ఇందాక ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతున్నారు కదా... ఎవరితో?” అడిగాడు.

“అబ్బే ఏమీలేదు. పొలానికి ఎరువుల కోసం మాట్లాడుతున్నాను.” అని నోటికి వచ్చిందేదో చెప్పేసాడు. గోపి మాట్లాడలేదు. శేషగిరి భార్య సుందరిని ప్రశ్నిస్తున్నప్పుడు అమె వెర్రిచూపులు చూస్తోంది. బాగా భయపడినట్లుగా ఉందనుకుని, భూషణాన్ని అడిగాడు గోపి, “ఆవిడ అలా ఉందేమిటీ?” అని.

“బాబు కనబడకుండా పోయినప్పటి నుంచి అలా ఉంది.” అని చెప్పాడు భూషణం.

అందరికీ ధైర్యం చెప్పి, గోపితో కలిసి బయటకు నడిచాడు రాజు. భూషణం అతని తమ్ముడు శేషగిరి వీరి వెనుక రాబోతుంటే, రాజు వారిని రావద్దంటూ వారించాడు. గోపి, భూషణాన్ని ప్రక్కకు పిలిచి ఏదో అడిగాడు.

అతను చెప్పిన సమాధానం విని, నవ్వుకున్నాడు.

బయటకు వచ్చాక, ఇంట్లో తన కాళ్ళ దగ్గర పడిన కాగితం ఉండ తీసి చదివి, రాజు చేతిలో పెట్టాడు. కారుని భూషణం ఇంటి దగ్గరే వదిలి, ఇద్దరూ నడుచుకుంటూ ఆ ప్రదేశం అంతా చూస్తున్నారు. ఇంతలో ఒక ఆటో వీరిని దాటుకుంటూ, వీధి చివరవరకూ వెళ్లింది. అప్పుడు ఆటోలో ఉన్న ఒక వ్యక్తి... మాటిమాటికీ వంగుని, వెనక్కి వీళ్ల వైపు చూస్తున్నట్లు గోపి గమనించాడు.

★★★

ఆ రోజు రాత్రి...

ఊరికి చివరగా పొలాలకు ప్రక్కగా ఉన్న ఇళ్ళల్లో దీపాలు ఆర్పేసి ఉన్నాయి. అందరూ నిద్రలో ఉన్నారు. ఒక ఇంట్లో మాత్రం దీపాలు వెలుగుతున్నాయి. ఒక మంచం మీద ఒక పసిబిడ్డ ఉంది. ఆ ప్రక్కనే ఒక యువతి కూర్చుని ఉంది. ఆ యువతి

ముఖం చాలా చికాకుగా, కోపంగా, అసహనంగా ఉంది. జుట్టుకూడా చిందర వందరగా ఉంది. జబ్బుమనిషిలాగా ఉంది. ప్రక్కనే ఉన్న బల్లమీద కొన్ని బొమ్మలతో పాటు, ఒక కత్తి కూడా ఉంది. ఆ పసిపిల్లవాడి కేసి కసిగా చూస్తోంది. వాడు ఉండి, ఉండి ఏడుస్తున్నాడు.

"చూడు శివాణీ! ఆ ఇంటి దగ్గర అందరూ కంగారు పడుతున్నారు. ఆ ఇంటిముందు ఏదో కారు ఆగి ఉంది. అక్కడ ఎవరో ఆఫీసర్లు ఉన్నారు. అక్కడే నిల్చుని మాట్లాడుకుంటున్నారు. నువ్వు ఆపద కొనితెచ్చుకుంటున్నావు. తొందరపడి వాడినేమీ చెయ్యకు!" అంది యువతి ప్రక్కనే నిల్చుని ఉన్న యువతి. ఆమె పేరు గంగ.

ఆమె మాటలు పట్టించుకున్నట్లు లేదు శివాణీ.

"ఈ శివాణీ అంటే ఏమిటో చూపిస్తాను!" అంది కసిగా. కత్తి తీసి చేత్తో పట్టుకుంది.

గంగ ముందుకు కదిలి, అమెను ఆపుతూ ఏదో మాట్లాడబోయింది. శివాణీ ఆమెకేసి తీక్ష్ణంగా చూసింది. గంగ ఆమె ప్రయత్నం మానుకుంది.

★★★

రాహుల్ కనబడకుండా పోయి, అప్పుడే మూడురోజులు అయిపోయాయి.

భూషణం ఇంట్లో అందరూ, రాహుల్ గురించి ఇప్పుడు ఏ వార్త వినవలసి వస్తుందో అని కంగారుగా ఉన్నారు. అందరూ శేషగిరిని అస్తమానూ, ఏదో ఒకమాట అంటూనే, 'పడుకున్న వాడిని ఉయ్యాలలోంచి తియ్యవలసిన పనేమిటీ?´ అని అడుగుతున్నారు. శేషగిరి కూడా అసహనంగా ఉన్నాడు. మాటిమాటికీ బయటకు వచ్చి ఎవరికో ఫోన్ చేస్తున్నాడు. ఆ వీధిలో దూరంగా నిలుచుని అతడ్ని గమనిస్తున్న గోపి, ఫోన్ అందుకున్నాడు.

డిటెక్టివ్ రాజు, గోపినుంచి వచ్చిన ఫోన్ గురించి ఆలోచించసాగాడు. ఏదో గుర్తుకు వచ్చి, ఎస్సై సుకుమార్‌కి ఫోన్ చేసాడు. గోపీకి ఫోన్ చేసి, మర్నాడు ఏం చెయ్యాలో పథకం వేసుకున్నారు.

★★★

"ప్లాస్టిక్ సామాన్లు అమ్ముతాం. బకెట్లు, డబ్బాలు, బొమ్మలు, ఆటవస్తువులు, అమ్ముతాం." అంటూ ఒక తోపుడుబండి మీద కొన్ని ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకునేవాడు ఆ ఇంటిముందు నిలబడి గట్టిగా అరుస్తున్నాడు.

ఆ ఇంట్లోనుంచి ఒక యువతి బయటకు వచ్చింది. ఆమెకు దాదాపు 35 సంవత్సరాలు ఉంటాయి. సాధారణ చీరలో చాలా సింపుల్‌గా ఉంది. ఆమె జుట్టు తైలసంస్కారం లేకుండా ఉంది. ముఖంలో చికాకు కొట్టొచ్చినట్లుగా ఉంది. ఆమె ఆ బండిలో ఉన్న బొమ్మలు చూసి, కొన్ని బొమ్మలు తీసుకుని, లోపలకు వెళ్ళిపోయి తలుపులు వేసేసింది.

బండివాడు కొంచెంసేపు, ఆమె డబ్బులు తెచ్చి ఇస్తుందని ఎదురు చూసి, ఆమె ఎంతకీ రాకపోయేసరికి, "ఏమండీ అమ్మగారూ! త్వరగా డబ్బులు త్వరగా డబ్బులు ఇవ్వండి. వెళ్ళిపోవాలి." అంటూ అరిచాడు.

ఎవరూ బదులు పలకకపోయేసరికి, ఆ బండివాడు ఇంటి తలుపులు కొద్దిగా తోసాడు. లోపల గడియ లేకపోవడంతో తలుపులు తెరుచుకున్నాయి. బండివాడు "ఏమండీ!" అంటూ లోపలకు వెళ్ళాడు.

లోపల వరండాలో నిల్చుని చూస్తున్నాడు ఎవరైనా కనిపిస్తారేమోనని! కుడివైపు ఉన్న ఒక గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి.

'డబ్బులు ఇవ్వకుండా ఈ అమ్మగారు ఎక్కడికి వెళ్లిపోయారూ?' అనుకుంటూ మాటలు వినిపించిన గది వైపు రెండడుగులు వేసాడు.

"శివాణీ! నా మాట విను, నువ్వు చేసిన పని మంచిది కాదు. ఇన్నేళ్లయింది. నువ్వు పెళ్లి చేసేసుకుంటే ఈ బాధలు మర్చిపోతావు. నా మాట విను. ఇప్పుడు నువ్వు చేసిన పని ఏమీ బాగులేదు. మీ అమ్మానాన్నా పోయారు. నువ్వేమో ఇలా తయారయ్యావు. నా స్నేహితురాలివయుండి, నీ బాధ చూడలేక ఈ సహాయం చేసాను. ఇప్పుడు నేను కూడా దొరికిపోతాను." అంది ఒక స్త్రీ గొంతు.

వెంటనే "గంగా! నువ్వు ఎన్ని చెప్పినా నేను వినను. చాలా మంచి అవకాశం దేముడే నాకు ఇచ్చాడు. ఆ పోలికలు చూడు. ఎంత బాగా ఉన్నాయో! అసలే తనని మర్చిపోలేకపోతున్న సమయంలో అదే పోలికలతో వీడిని, ఆ దేముడు నాకివ్వడం ఎంత తమాషాగా ఉంది గంగా!"

"అది సరే... అన్నమాట ప్రకారం తీసుకువెళ్ళి ఇచ్చేయ్యాలి కదా!"

"నువ్వు నాకు ఎదురు చెప్పావనుకో... వీడిని చంపేసి, నేను చచ్చిపోతాను." అని గదిలోంచి బయటకు వచ్చి, బండివాడిని చూసి "ఏయ్ అబ్బాయ్! లోపలకు వచ్చేసావేమిటీ? డబ్బులు తెచ్చి ఇచ్చేదాకా ఆగలేవూ! ఇంద, తీసుకో." అని, వాడిచేతిలో కొంత డబ్బు పెట్టింది.

"ఎంతసేపు చూడాలి? అవతల బేరాలు పోతాయి. గొప్ప బేరమే." అంటూ డబ్బులు పుచ్చుకుని వెళ్లిపోయాడు.

బండివాడు బయటకు వచ్చి, ఎవరికో ఫోన్ చేసి "డబ్బులు అందాయి." అన్నాడు.

★★★

తలుపు చప్పుడయ్యేసరికి, గంగ తలుపు తీసింది. ఎదురుగా ఉన్న పోలీసులను చూసి లోపలకు పరిగెత్తింది.

"ఎవరే?" అంటూ బాత్రూంలోంచి బయటకు వచ్చిన శివాణీ పోలీసులను చూసి స్థాణువై నిలబడిపోయి వెర్రిచూపులు చూసింది. గబుక్కున తలుపు వేసేసి లోపలకు వెళ్తూ, "గంగా! పోలీసులు... పదపద పారిపోదాం" అంటూ బాబుతో, పెరటిద్వారం వైపు పరుగుతీసింది.

ఆ వెనుకే, గంగకూడా పరిగెత్తింది. పెరటితలుపు తీసి బయటకు వెళ్ళేసరికి, అక్కడ డిటెక్టివ్ రాజు, గోపి గుమ్మానికి అటూ, ఇటూ నిలబడి ఉన్నారు. వారి చేతుల్లో రివాల్వర్లు ఉన్నాయి. అంతే! గంగ, శివాణీ బిక్కచచ్చిపోయారు.

★★★

మరునాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సుకుమార్, డిటెక్టివ్ రాజు, గోపి, భూషణం, వాసు కూర్చుని ఉన్నారు. ఒకప్రక్కన గోడ దగ్గర... శివాణీ, గంగ, శేషగిరి భార్య నిలబడి ఉన్నారు. వారికి అటూ ఇటూ పోలీసులు నిలబడి ఉన్నారు.

డిటెక్టివ్ రాజు మాట్లాడుతూ, ”మాకు రాహుల్ ఆచూకీ నేరస్థులే చెప్పారు” అన్నాడు.

అందరూ రాజు వైపు చూసారు.

రాజు మళ్ళీ మాట్లాడుతూ “భూషణంగారి ఇంటికి వచ్చి, తిరిగి వెళ్ళేటప్పుడు, ఒక ఆటో మా ముందునుంచి వెళ్ళింది. అందులో ఉన్న ఒక వ్యక్తి... మాటిమాటికీ వెనక్కి తిరిగి మాకేసి చూడటం, గోపి చూసి ఆ ఆటోని వెంబడించాడు. అతని ప్రయత్నం వృధా కాలేదు. శివాణీ, గంగా కలిసి, బాబుని బంధించడం చూసాడు. వెంటనే నాకు ఫోన్ చేసి చెప్పాడు. నేను ఎస్సైగారితో మాట్లాడి అక్కడ పోలీస్ కాపలా పెట్టించి, ఒక పథకం వేసుకుని వీళ్ళని పట్టుకోవడం జరిగింది. మిస్టర్ సుకుమార్! శేషగిరి భార్య చేసిన చిన్నతప్పు వలన ఒక పసిబిడ్డ కష్టాల పాలయింది. మేము అసలు ఊహించలేదు. శేషగిరి భార్య సుందరే కిడ్నాప్‌కి కారణమని! మేము శేషగిరిని అనుమానించాం. అతనికి దురలవాట్లు ఉన్న మాట నిజమే కానీ, అతనికి అన్నగారి మీద చాలా గౌరవం ఉందని, అతనీపని చేసి ఉండకపోవచ్చునని మా పరిశోధనలో తేలింది. సుందరి ఏ ప్రతిఫలమూ ఆశించలేదు, చెడు తలంపు లేదు, కేవలం శివాణీ మాయమాటలు నమ్మి, ఆమె కోరిక తీర్చడం కోసం రాహుల్‌ని అమెకు ఇచ్చింది!” అంటూ, సుందరితో, “అసలు ఆ రోజు ఏమి జరిగిందో... మీరే చెబితే బాగుంటుంది!” అన్నాడు.

“నిజమే! శివాణీ మాయమాటలు నమ్మి, ఈ తప్పు చేసాను. ఆరోజు ఏమి జరిగిందంటే...” సుందరి చెప్పడం ప్రారంభించింది.

★★★

ఆరోజు సుందరి ఇంటి అరుగు మీద రాహుల్‌ని ఒళ్ళో కూర్చోబెట్టుకుని ఆడిస్తోంది. ఆ సమయంలో అటుగా వెళుతున్న శివాణీ, ఆమె స్నేహితురాలు గంగ వచ్చి, “ఏం అత్తయ్యగారూ! బాగున్నారా?” అంటూ పలకరించారు.

“బాగానే ఉన్నాము. మీ అమ్మ, నాన్న పోయిన తరువాత నువ్వు ఏమైపోయావో తెలియలేదు. ఇప్పుడు ఎక్కడ ఉంటున్నావు శివాణీ?” అడిగింది సుందరి.

గంగ కలుగజేసుకుని, “తను నా దగ్గరే ఉంటోంది.” అంది.

“ఈ బాబు ఎవరు?” అంటూ శివాణి అడిగింది.

”వీడు మా పవన్ కొడుకు. మొన్ననే అమెరికానుంచి వచ్చారు.” సుందరి అంది.

“అబ్బా! ఎంత ముద్దొస్తున్నాడో...” అంటూ గబుక్కున, సుందరి ఒళ్ళో ఉన్న రాహుల్‌ని ఎత్తుకుని, “అత్తయ్యగారూ! ఒక్కసారి వీడిని తీసుకుని ఆ సందు దాకా తీసుకువెళ్ళి తీసుకువస్తాను” అంది శివాణీ.

“వద్దు తల్లీ! మావాళ్ళకు తెలిస్తే ఊరుకోరు.” సుందరి అంది.

“ఇప్పుడే తీసుకువచ్చేస్తాను” అని సుందరి సమాధానం కోసం చూడకుండా, రాహుల్‌ని తీసికెళ్ళిపోయింది.

‘సరేలే! వెర్రిపిల్ల... ఇప్పుడే తీసుకువచ్చేస్తుందిలే.’ అనుకుని కొంచెంసేపు చూసింది సుందరి. ఎంతకీ రాకపోయేసరికి భయపడుతూ, అ సందు చివరిదాకా వెళ్ళి చూసింది. అక్కడ శివాణీ కానీ, గంగ కానీ కనబడలేదు. ‘అయ్యో! వీడిని

తీసుకుని ఎటు వెళ్ళిపోయిందీ?' అనుకుంటూ కాళ్ళూచేతులూ ఆడక ఏం చెయ్యాలో తోచక, ఇంటికి తిరిగొచ్చి, 'సరేలే! అదే తీసుకువస్తుంది. అప్పటిదాకా ఇంట్లో చెప్పకుండా ఉండాలి. ఎవరి పనుల్లో వాళ్ళున్నారులే, ఎవరికీ తెలియదు. ఫరవాలేదు.' అనుకుని గమ్మున ఉండిపోయింది. అంతలో ఏదో పని జ్ఞాపకం వచ్చి, ఆ పనిమీద బయటకు వెళ్ళింది.

కొంచెంసేపటికి సుమ హాల్లోకి వచ్చి, ఉయ్యాల్లో బాబు లేకపోవడం చూసి, ఈ విషయం అందరికీ చెప్పి, ఏడవడం మొదలుపెట్టింది. ఇంట్లో అందరికీ బాబు కనబడటం లేదన్న విషయం తెలిసి, కంగారు పడిపోయారు. బయటనుంచి సుందరి వచ్చేసరికి బాబు కనబడటం లేదని, పోలీస్ కంప్లైంట్ ఇవ్వడం కూడా జరిగిపోయింది. ఇక ఆ సమయంలో శివాణీకి తను బాబుని ఇచ్చిన సంగతి ఇంట్లోవాళ్ళకు చెబితే, పోలీసులు తనని పట్టుకుంటారని నోరు మూసుకుని కూర్చుండిపోయింది. బిక్కుబిక్కుమంటూ తనలో తాను కుమిలిపోసాగింది.

జరిగిన విషయం అంతా చెప్పి సుందరి కళ్ళు తుడుచుకుంటూ భూషణంతో, "బావగారూ! నన్ను క్షమించండి. మిమ్మల్ని అందరినీ క్షోభ పెట్టాను!" అంది.

"మరి పనిమనిషి బాబుని శేషగిరి ఉయ్యాలలోంచి తియ్యడం చూసానని చెప్పింది?" భూషణం అడిగాడు.

"ఆయన చేతిలోంచి, నేను తీసుకుని అరుగు మీదకు వచ్చాను!" చెప్పింది సుందరి.

రాజు నవ్వుతూ, "ఆవిడ మేము మీ ఇంటికి వచ్చినప్పుడు, ఒక కాగితం మీద జరిగింది వ్రాసి, మాకు అందజేసింది. తన తప్పు తాను తెలుసుకుని, మాకు చెప్పబట్టి మా పని కొంత సులువయింది!" అన్నాడు.

ముందునుంచీ ఆమె మంచితనం, ప్రవర్తన చూస్తున్న భూషణం, ఆమెతో, "పోనీలే! బాబు దొరికాడు. నువ్వేమీ కావాలని చెయ్యలేదు. అసలు నువ్వు భయపడకుండా జరిగిన విషయం ముందే చెబితే బాగుండేది!" అన్నాడు.

అక్కడే ఉన్న గంగ, "ఎస్సైగారూ! శివాణీ, పవన్ని ప్రేమించింది. అతడ్ని పెళ్ళిచేసుకుందామని అనుకుంది. కానీ వాళ్ళు, దానికి చదువులేని కారణంగా ఒప్పుకోలేదు. అదే సమయంలో తన తల్లిదండ్రులు ఇద్దరూ ఒకేసారి యాక్సిడెంట్‌లో చనిపోయేసరికి, మానసికంగా క్రుంగిపోయింది. సైకాలజిస్ట్ దగ్గర మందులు వాడుతోంది. చిన్నప్పటినుంచీ అదీ, నేనూ మంచి స్నేహితులం! దాని అమ్మా, నాన్నా పోయిన దగ్గరనుంచీ నాతోనే ఉంటోంది. నేనూ ఒంటరిదానినే. చిన్న ఉద్యోగం చేసుకుంటూ, దీనిని నేను జాగ్రత్తగా చూసుకుంటున్నాను. అసలు ఆరోజు బాబుని మేము తీసుకువెళ్ళాలని అనుకోలేదు. అప్పటికి ఆ ఆలోచనే లేదు. తను ప్రేమించిన పవన్ కొడుకని తెలిసి, అ బాబుని వదులుకోలేక అలా చేసింది. నేను అప్పటికీ చెబుతూనే ఉన్నాను. తను చేసింది తప్పని, బాబుని తీసుకువెళ్ళి ఇచ్చేద్దామని చెప్పినా, అది వినలేదు. దాని మానసిక పరిస్థితి చూసి, ఆ పిచ్చిలో బాబుని ఏం చేస్తుందోనని, నెమ్మదిగా సర్ది చెప్పి బాబుని తీసుకువెళ్ళి ఇచ్చేయవచ్చని అనుకున్నాను. ఇంతలోనే మీరు రావడం జరిగింది. దానికి సహకరించినందుకు, నాకు ఏ శిక్ష వేసినా భరిస్తాను. దయచేసి శివాణీ మానసిక పరిస్థితి చూసి, దానిని వదిలెయ్యండి!" అంటూ వాపోయింది.

"సుకుమార్ గారూ! వీరిపై చట్టప్రకారం ఏ చర్యలు తీసుకుంటారో, మీ ఇష్టం! నేరస్థులను పట్టి ఇవ్వడమే మా కర్తవ్యం!" అన్నాడు డిటెక్టివ్ రాజు.

ఎస్సై సుకుమార్ రాజుతో కరచాలనం చేస్తూ, “మొత్తానికి ఈ కేసు సాల్వ్ చేసి మాకు ఊరట కలిగించారు” అన్నాడు. ’రాజుగారూ! మేము మీ మీద పెట్టుకున్న నమ్మకం వమ్ము కాలేదు. మీకూ, గోపిగారికి ధన్యవాదాలు!” భూషణం అన్నాడు.

“మీరు కేసు సాల్వ్ చెయ్యమని నన్ను అడిగారు, నేను చేసాను. అంతే!” అని, ఎస్సైతో, “ఓకే, మిస్టర్ సుకుమార్! ఇక మేము వస్తాం!” అంటూ గోపి భుజం మీద చెయ్యి వేసి, “కమాన్ డియర్!” అంటూ బయటకు నడిచాడు.

పవన్ వెంటనే రాజు వెనుకనే బయటకు వచ్చి, ఒక కవర్ గోపి చేతిలో పెట్టి, “మీ ఫీజ్.” అన్నాడు.

గోపి అది తీసుకుని జేబులో పెట్టుకున్నాడు. రెడ్ రోజ్ అక్కడినుంచి కదిలింది.

# ఇది కదా ప్రేమ

బివిడి ప్రసాదరావు

✆ 9618236937

***"నువ్వు పెళ్లి చేసుకోవలసింది." సడన్‌గా అంది సూర్యకళ. నేనేమీ అనలేదు.***

***"నా మూలంగానే కదూ?" అంది. తను నన్నే చూస్తున్నట్టు అనిపిస్తోంది.***

***నేను మాత్రం రోడ్డునే చూస్తున్నాను.***

***"నేను భయపడుతూనే నీ వద్దకు వచ్చాను. అప్పటి నీ ప్రేమని తిరస్కరించిన నాకు... నువ్వు సాయపడవేమో అనుకున్నాను." సూర్యకళ అంది. ఆమె మాటలు చాలా భారంగా ఉన్నాయి.***

"కళగారట. మిమ్మల్ని కలవాలంటున్నారు." చెప్పాడు కాంతారావు.

జలదరించాను.

"ఎవరన్నావ్?" అడిగాను.

"కళగారట." చెప్పాడు కాంతారావు.

కాంతారావు మా ఆఫీస్ అటెండర్.

"వచ్చిన వారి వివరాలు... కనీసం పూర్తి పేరైనా తెలుసుకోవాలికదయ్యా." చిరాకయ్యాను.

అప్పటివరకూ చూస్తున్న ఫైల్ లోనివి నన్ను కలవరపెడుతున్నాయి. ఆ సొదను ఉండగా, కాంతారావు వచ్చాడు. అసంపూర్తి సమాచారం ఇచ్చాడు.

"కళగారంటే... సరిపోతుందా? ఏ కళగారో, ఎందుకు వచ్చారో... కనీసం తెలియాలిగా!" నాలో చిరాకు కొనసాగుతోంది.

ఆ తోవనే...

"పూర్తి సమాచారం తెలుసుకో." అనేసాను.

నా కేబిన్ గ్లాస్‌డోర్ మూసేస్తూ కాంతారావు వెళ్లిపోయాడు.

నేను తిరిగి ఫైలులోకి వెళ్లలేకపోతున్నాను.

కొద్దిసేపటికే తిరిగి కాంతారావు వచ్చాడు.

"సూర్యకళగారట. పార్వతీపురమట. ఇంటర్మీడియట్లో మీ క్లాస్మేట్‌ట. మిమ్మల్ని కలవాలని వచ్చారట!" మెల్లమెల్లగా చెప్పాడు కాంతారావు.

అతడు చెప్తుతుండగానే నేను ఆ సూర్యకళని గుర్తు పట్టేసాను.

"సరే. విజిటర్స్ రూమ్‌లో కూర్చో పెట్టు. వచ్చి కలుస్తానని కూడా చెప్పు." చెప్పాను.

కాంతారావు వెళ్లిపోయాడు.

చూస్తున్న ఫైల్‌ని మూసేసాను.

సూర్యకళ... నా క్లాస్మేట్! తను నాకు క్లాస్మేటే కాదు... ఎన్నాళ్లకెన్నాళ్లకు..

ఇలా ఎందుకు వచ్చిందో... తల విదిలించుకున్నాను. మరి ఆగలేక... ఛైర్‌లోంచి లేచాను. అటు వెళ్లాను.



విజిటర్స్ రూమ్‌లో తనే ఉంది. సోఫాలో కూర్చునుంది. నన్ను చూస్తూనే కాస్త కదిలింది.

చూడగానే సూర్యకళని పోల్చుకోగలిగాను. చిన్నగా నవ్వుతూ, తనకు దరినే సోఫా కుర్చీలో కూర్చున్నాను.

“చాన్నాళ్లకి.” అన్నాను.

“ఎలా ఉన్నావ్? సారీ… ఎలా ఉన్నారు సార్?” సూర్యకళ సర్దుకుంటూ పలకరించింది.

“ఫర్వాలేదు. మన మధ్య రెస్పెక్ట్ అనవసరం.” చెప్పాను.

“లేదు. మీరు ఇప్పుడు ఆఫీసర్‌గా…” చిన్నగా అంది సూర్యకళ.

“నీక్కాదులే. నీకు ప్రకాష్‌నే.” చెప్పాను.

సూర్యకళ ఏమీ అనలేదు.

“ఏంటిలా వచ్చావ్? అన్నట్టు నేను ఇక్కడ ఉన్నట్టు ఎలా తెలుసు?” అడిగాను.

“నిన్నటి పేపరులోని న్యూస్ వలన…” చెప్పింది సూర్యకళ.

“అర్థం కాలేదు.” అన్నాను.

“నిన్న నీ… మీ…”

వెంటనే అడ్డై… “ప్లీజ్… నేను ప్రకాష్, నువ్వు సూర్యకళ. దట్సిట్.” చెప్పాను.

“నిన్నటి పేపర్‌లో… ఓ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నువ్వు పాల్గొన్నట్టు ఫోటోతో పాటు వార్త ఒకటి వచ్చిందిగా… అలా నీ గురించి తెలిసింది.” చెప్పింది సూర్యకళ.

“అవునా!” అనేసాను.

“దాంతో నిన్ను కలవాలని ఇలా వచ్చాను.” చెప్పింది సూర్యకళ.

చిన్నగా నవ్వేసి, “విషయమేంటి?” అడిగాను.

“నీతో మాట్లాడాలి. నీకు ఇప్పుడు వీలవుతుందా?” అడిగింది సూర్యకళ.

సూర్యకళలో నాకు అణుకువ అగుపించింది.

“బాగా మారిపోయావే. అప్పటిలా ఒన్‌వే తత్వం నీలో కానరావడం లేదు!” అనేసాను.

సూర్యకళ తల దించుకుంది.

“నువ్వు ఉంటుంది ఇంకా పార్వతీపురంలోనేనా?” అడిగాను.

సూర్యకళ తల ఎత్తింది. నన్నే చూస్తూ, "లేదు. పాడేరులో." చెప్పింది.

"అవునా? పార్వతీపురమన్నావట?" కనుబొమల్ని కుదించాను.

"నీకు అర్థమవుతుందని." చెప్పింది సూర్యకళ.

"అవునా?" అంటూనే రిస్ట్‌వాచీని చూసాను.

ఆ వెంబడే, "లంచ్‌టైమ్ కావస్తోంది. ఫ్యూ మినిట్స్... వస్తా." అనేసి, నా కేబిన్‌కి వెళ్లాను. వెళ్తూ, వరండాలోనే ఉన్న కాంతారావును రమ్మన్నాను.

హెడ్‌క్లర్క్‌ని పిలిపించుకున్నాను.

"నాకు బయట పని ఉంది. కొద్ది ఆలస్యంగా తిరిగివస్తాను. మేనేజ్ చేసుకోండి." మెసేజ్ ఇచ్చేసి, సూర్యకళ దగ్గరకి వచ్చాను.

"పద. ముందు లంచ్‌కి వెళ్దాం." చెప్పాను.

సూర్యకళ తడబడుతోంది.

"ప్లీజ్. ఆకలితో మాటలేమిటి? లంచ్ చేస్తూ మాట్లాడుకుందాం." చొరవ తీసుకున్నాను.

సూర్యకళ లేచింది. నాతో అక్కడినుండి కదిలింది.

నా కారు చేరాం. ఫ్రంట్ సీట్ డోర్ తెరిచాను. "కూర్చో." సౌమ్యంగా అన్నాను.

తను కూర్చుంది.

డ్రయివింగ్‌సీట్లో సెటిలయ్యాను. కారు స్టార్ట్ చేసాను. నేరుగా ఓ హోటల్ ముందు కారు ఆపాను.

సూర్యకళ నన్ను చూస్తోంది.

"ఫామ్లీ లేదు. సో... హోటల్ మీల్సే." నవ్వుతూనే చెప్పాను.

హోటల్‌లో... ఓ కేబిన్‌లో ఇద్దరం ఎదురెదురుగా కూర్చున్నాం.

వెయిటర్ వచ్చాడు.

"వెజ్ ఆర్ నాన్?" సూర్యకళని చూస్తూ అడిగాను.

"నాకు వెజ్." తను చెప్పింది.

"రెండు వెజ్ మీల్స్." నేను చెప్పేక, వెయిటర్ వెళ్లిపోయాడు.

“ఊఁ చెప్పు. ఏమిటి మాట్లాడాలి? అంత దూరం నుండి వచ్చావు, విషయమేమిటి?” గబగబా అడిగాను.

“ఫామ్లీ లేదు అన్నావు. అంటే...” అడిగింది సూర్యకళ.

“అమ్మా, నాన్న... ఓ కారు ప్రమాదంలో చనిపోయారు. మూడేళ్లవుతోంది.” చెప్పాను మెల్లిగా.

“సారీ.” అంది సూర్యకళ.

అప్పుడే రెండు ఛోటా వాటర్‌బాటిల్స్‌తో వచ్చి, వాటిని టేబిల్‌మీద సర్ది పెట్టి, తిరిగి వెళ్లిపోయాడు వెయిటర్.

“అంటే... నీ ఫామ్లీ... అదే, అమ్మానాన్నలు కాక...” సూర్యకళ సంశయిస్తోంది.

“నేను పెళ్లి చేసుకోలేదు.” సూటిగానే చెప్పేసాను.

సూర్యకళ జలదరించినట్టు కదలిపోయింది. తనంతట తానే సర్దుకుంది. నన్నే చూడసాగింది.

నేను సూర్యకళనే చూస్తూ, “అవును. నేను పెళ్లి చేసుకోలేదు. ఒంటరిగా ఉంటున్నాను.” చెప్పాను.

సూర్యకళ తన చూపులను నా నుండి తిప్పుకుంది. తల దించుకుంది.

వెయిటర్ మీల్స్‌ప్లేట్లు తెచ్చాడు. మా ముందు సర్దాడు. ఆ వెంబడే మరో అబ్బాయి తెచ్చిచ్చిన వాటిని మా టేబిల్ మీద సర్దాడు.

“పిలవాలంటే ఆ కాల్‌బెల్ బటన్ నొక్కొచ్చు సార్.” చెప్పాడు వెయిటర్ అటు వైపు చూపిస్తూ.

తలాడించాను.

వచ్చిన ఆ ఇద్దరూ వెళ్లిపోయారు.

రమారమీ నిముషం తర్వాత నేనే మాట్లాడేను.

“తిను.” చెప్పాను.

నా ప్లేట్‌ని దగ్గరగా లాక్కున్నాను.

అప్పటికీ సూర్యకళలో కదలిక రాకపోయేసరికి, “తింటూ మాట్లాడుకుందాం.” మళ్లీ నేనే మాట్లాడేను.

సూర్యకళ తన ప్లేట్‌ని దగ్గరగా లాక్కుంది.

నేను చొరవగా, “నీ సంగతి చెప్పు.” అన్నాను.

సూర్యకళ ఏమీ మాట్లాడడం లేదు.

“పాడేరులో ఉంటున్నావా?” నేనే కదుపుతున్నాను.

'అవును' అన్నట్టు తలాడించింది సూర్యకళ.

"నీ పేరెంట్స్ ఎలా ఉన్నారు?" నేనే అడిగాను.

"లేరు. వాళ్లు సహజంగానే కాలం చేసారు, కొన్ని నెలల తేడాలో..." సూర్యకళ మాట్లాడింది.

"నువ్వు సరిగ్గా తినడం లేదు. తిను." చెప్పాను.

నేను అన్నంలో సాంబారు కలుపుకొని, తింటున్నాను. అలాగే సూర్యకళను మాటిమాటికి చూస్తున్నాను.

తను నెమ్మదిగానైనా తింటోంది.

"పెళ్లైందా?" అడిగేసాను.

సూర్యకళ తలెత్తలేదు. 'అయింది' అన్నట్టుగా మాత్రం తలాడించింది.

"పిల్లలు ఎంతమంది?" అడిగేను రమారమీ నిముషం తర్వాత.

"బాబు. ఫిఫ్త్ స్టాండర్డ్." చెప్పింది సూర్యకళ. ఇంకా తను తలెత్తడం లేదు.

నేను తగ్గాను.

గమ్మున తిరిగి మాట్లాడలేకపోయాను.

సూర్యకళని మాటిమాటికి చూడడం కూడా ఆపేసాను.

అర నిముషమో... నిముషమో... తర్వాత, "నా భర్త చనిపోయాడు. మూడునెలలవుతోంది." చెప్పింది సూర్యకళ.

నేను జల్దుకున్నాను.

"ఏంటీ?" అన్నాను.

ఆమెనే చూస్తున్నాను.

అప్పటికి నన్నే చూస్తున్న సూర్యకళ, తన చూపును తిప్పేస్తూ, "బైక్ యాక్సిడెంట్. స్పాట్‌లోనే చనిపోయారు." చెప్పింది.

"సారీ" అనగలిగాను.

"ఆ పనిమీదే నీ దగ్గరకు వచ్చాను." చెప్పింది సూర్యకళ.

"ఏమిటీ? ఆ పనా? ఏంటట?" సందిగ్ధమవుతున్నాను.

"ఇన్సూరెన్స్ మొత్తం అందాలి. ఫైల్ మీ ఆఫీస్‌లో ఆగిపోయిందట. ఏజెంట్ ద్వారా తెలిసింది." చెబుతోంది సూర్యకళ.

ఆలకిస్తున్నాను.

“పేపర్ వార్త ద్వారా ఆ ఆఫీస్ ఆఫీసర్‌వి నువ్వేనని నిన్ననే తెలుసుకున్నాను. నిన్ను కలిస్తే పని కావచ్చని ఇలా వచ్చాను. బాబు భవిష్యత్తుకు ఆ మొత్తం తప్పనిసరి అవసరం.” చెప్పింది సూర్యకళ.

లంచ్ కానిచ్చేసి, సూర్యకళని తీసుకొని తిరిగి ఆఫీస్‌కి వచ్చాను.

సూర్యకళ నుండి సంబంధిత వివరాలు, కాగితాలు తీసుకున్నాను. అలానే మా ఆఫీస్‌లోని ఆయా ఫైల్సును తెప్పించుకున్నాను.

ఆ సబ్జెక్ట్ చూస్తున్న క్లర్క్‌తో మాట్లాడేను.

అన్నీ పరిశీలించేక, “ఈ కొర్రీ వెట్టుడేమిటి? అన్నీ సవ్యంగా ఉండగా, క్లియరెన్స్ ఇవ్వడంలో ఇంత జాప్యమేమిటి?” క్లర్క్‌ని నిలదీసాను.

క్లర్క్ నీళ్లు నములుతున్నట్టు, “పార్టీ పర్సనల్‌గా కలవలేదు.” చెప్పాడు.

నాకు భలే కోపం వచ్చింది. తమాయించుకున్నాను.

“వెళ్లి క్లియరెన్స్ పేపర్స్ వెంటనే తయారుచేసి, తెండి.” ఆర్డర్ వేసాను.

క్లర్క్ తన సీటుకు కదిలాడు, ఆ ఫైల్స్‌తో.

సూర్యకళ విజిటర్స్‌రూమ్‌లో ఉంది.

నా కేబిన్‌నుండి నేరుగా ఆమె వద్దకు వెళ్లాను.

“నేను ఇక్కడికి వచ్చి నెలవుతోంది. నీ ఫైల్ నా వద్దకు రాలేదు. ఇప్పుడే తెప్పించుకొని చూసాను. మీవైపునుండి అన్నీ సవ్యంగా ఉన్నాయి. మావైపునుండి నేను క్లియరెన్స్ ఇచ్చేస్తున్నాను. పద్ధతి ప్రకారం నీకు రిజిస్టర్డ్ పోస్టులో ఆ పేపర్స్ ఈ రోజే పంపబడతాయి.” చెప్పాను.

‘థాంక్స్’ సూర్యకళ చెప్పింది.

ఆ వెంబడే, “నేను బయలుదేరుతాను. అత్తయ్యని బాబు దగ్గర పెట్టి వచ్చాను.” సూర్యకళ చెప్పింది.

“ఉండు. నీ పేపర్స్ మీద ఫైనల్ సంతకాలు చేసేసి నేను వస్తాను. కారులో బస్సు కాంప్లెక్స్ వద్ద నిన్ను దింపుతాను.” అంటూనే తిరిగి నా కేబిన్ వైపు వెళ్లాను.

అరగంటలోనే ఆ క్లర్క్ కావలసిన పేపర్స్‌తో ఆ ఫైల్స్‌ను తెచ్చాడు. నా సంతకాలు అవసరమైన చోట నేను చేసేసాను.

“ఈరోజే వారికి పేపర్స్‌ను మన రివాజు ప్రకారం పంపే ఏర్పాటు చేయండి.” క్లర్క్‌కి మరలా ఆర్డర్ లానే చెప్పాను.

సూర్యకళని తోడ్కొని బస్సు కాంప్లెక్స్‌కు బయలుదేరాను, నా కారులో!

దారిలో, “నీ తాలూకు పేపర్స్ ఫైనలైజ్ అయిపోయాయి. డిస్పాచింగ్ కూడా కాబోతున్నాయి. నీకు రెండుమూడు రోజుల్లో

అవి అందిపోతాయి." చెప్పాను.

ఆ వెంబడే, "సారీ... నాకు తెలియక నీ పని డిలే అయింది." చెప్పాను.

"అయ్యో... తెలియక అంటున్నావుగా, ఇక సారీ ఎందుకు?" సూర్యకళ ఇబ్బందిగా కదిలింది.

కారు నెమ్మదిగా ముందుకు పోనిస్తున్నాను.

"నువ్వు పెళ్లి చేసుకోవలసింది." సడన్‌గా అంది సూర్యకళ.

నేనేమీ అనలేదు.

"నా మూలంగానే కదూ?" అంది.

తను నన్నే చూస్తున్నట్టు అనిపిస్తోంది.

నేను మాత్రం రోడ్డునే చూస్తున్నాను.

"నేను భయపడుతూనే నీవద్దకు వచ్చాను. అప్పటి నీ ప్రేమను తిరస్కరించిన నాకు, నువ్వు సాయపడవేమో అనుకున్నాను." సూర్యకళ అంది. ఆమె మాటలు చాలా భారంగా ఉన్నాయి.

నేనేమీ అనలేదు. సూర్యకళని చూడలేదు.

"నీ ప్రేమను నేను కాదంటే, ఒంటరిగా ఉండిపోతానన్నావు. సీరియస్‌గా అన్నావనుకోలేదు అప్పుడు." సూర్యకళ గొంతు బొంగురయ్యిపోయింది.

ఆ తర్వాత, మామధ్య మాటలు లేవు.

బస్ కాంప్లెక్స్ చేరాం.

సూర్యకళ కారు దిగింది.

నేనూ దిగాను.

తను పాడేరు వెళ్లే బస్సు ఎక్కింది.

ఆ బస్సు కదిలేకనే నేను వెనుతిరిగాను.

# ఏరు దాటాల

పి. రాజేంద్రప్రసాద్

✆ 9492525607

***"ఒరేయ్! ఈడికి పిచ్చెక్కిందిరా! రేయ్! కర్రోడా! నెగరా! మునిగి సత్తావ్."***

***ఒకళ్ళ తరవాత ఒకళ్ళు అరుస్తూ నన్ను బయటకు లాగారు.***

***నేనూ అరవసాగాను "రేయ్! ఎదవల్లారా! మీరు నా కులపోల్ని ముట్టుకోరు. శవాన్నీ ముట్టుకోరు. ఇపుడు నేనూ, సీతాలూ ఒకే కులంరా. నన్నెవరూ ఎలెయ్యలేరు." గెట్టిగా నవ్వాను.***

***అంతలో ఏడుపు ముంచుకొచ్చింది. దుక్కం పట్టలేక ఏడిసినాను.***

సలికాలం ఊపుమీదున్నాది. ఒళ్లంతా గింగిరాలు తిప్పేసే సలి!

నాలుగు రోజులాగితే కోతలు కొయ్యాల. కోతలవ్వగానే బోగీ, సంకురాత్రీ, కనుమా మూడూ నేస్తాల్లా కలిసి ఒచ్చేత్తాయి. నాలాంటి ఒంటరోడికి తప్ప అందరికీ పండగే. నన్ను కన్న మాయమ్మ "పెండ్లి సేసుకోరా నాయనా! నీ కడుపున ఓ కాయ కాత్తే సూసి సచ్చిపోతానయ్యా" అంటూనే సచ్చిపోనాది.

★★★

మాయమ్మకి నానొక్కన్నే కొడుకుని. పుట్టిన రెండోయేటనే మా అయ్యను మింగినానని ఊరంతా అనేది. నాకప్పుడదేంటో తెలిసేది కాదు. తెలిసే వయసొచ్చినాక కూడా బాదనిపించేది కాదు. నాకు అప్పటికి మిగిలింది మాయమ్మ ఒక్కర్తే. మాయమ్మ నన్ను గారంగానే పెంచింది. నల్లగా, బొద్దుగా ఉండే నన్ను "నా నల్లబంగారం..." అంటూ మురిసిపోయేది. మా ఊళ్ళో ఉన్నకాడికి సదువు సెప్పించింది. అంతకు మించి ఏల? నాకూ మరి నలుగురికీ కూడెట్టే ఎవసాయం ఉండనే ఉన్నది.

సిన్నప్పట్నుంచి ఇదే గట్లెమ్మటా, పుట్టలెమ్మటా తిరుగుతా ఉన్నా! పొలానికెళ్ళే దారిలోనే సీతాలిల్లు. నాకు పదేనొచ్చేటప్పటికి... దానికి ఆరో, ఏడో! అదంటే నాకిట్టమని అప్పుడు తెలీలేదు. నాకు ఇరవై దాటినంక అది పెద్దమనిసైంది. ఆ కాన్నించి దాన్ని రోజూ సూడాలనిపించేది. రోజూ ఆ దారమ్మట పోతా పోతా... ఆ ఇంటెంక సూసేటోన్ని. గుమ్మం కాడ కసువూడుస్తానో, గేదె పెయ్యలకి గడ్డేస్తానో, ముగ్గేస్తానో ఏదో ఒక పని సేస్తా ఉండేది. అప్పటిదంక ఏదో ఒక పనిసేసే సీతాలు నన్ను సూడగానే లోపటికురికేది. అట్టా ఎందుకురికేదో నాకు తెలిసేది కాదు. కొద్దిసేపుంటే బావుండనిపించేది. లోపట ఏదో జిల్లుమని లాగతా ఉండేది.



ఒయిసు వస్తా ఉండింది. కర్రిగా ఉండేటోన్ని, ఇంకా కర్రిగా అయితా ఉన్న. ఎదురుపుల్లలా ఉండేటోన్ని, సింతసెట్టు మానులా అయితా ఉన్న. కస్టం సేసీ, సేసీ కండలు బిరుసెక్కుతా ఉన్నయ్. నాతో పాటు సీతాలుకీ ఒయిసొచ్చేసింది. రయికలు బిగుతైనాయి. నడుం సన్నబడింది. ముకం తేటతీరింది. ఆయమ్మి నవ్వితే ఇంకా ఇంకా సూడాలనిపించేది. నవ్వినా, నవ్వకున్నా ఆయమ్మి ఒళ్ళెంక, కళ్ళెంక సూడంగనే నాకు కూడా ఒయసొచ్చిన ఇసయం నికార్సుగా తెలిసిపోయేది.

ఇదంతా ఎవలికీ తెలీదని నా ఎదవాలోసన! అయితే మాయమ్మా, ఆళ్ళమ్మా కనిపెట్టడాలూ, ఆళ్లమ్మా, నాన్నా మా యమ్మని బెదిరించడాలూ... ఇయ్యేవీ మా అమ్మ నన్ను తిట్టేదాకా నాకు తెలవనే తెలవదు.

"ఒరేయ్! ఆల్లు పెద్ద కులపోల్లురా. మనకీ ఆళ్ళకీ కలవదు. నువ్వు పొలం పోవాలంటే సింతతోపులోంచి పో. ఆ దారెమ్మట పోమాకు. పిచ్చేసాలు మానేయ్. మన పిల్లల్లో మంచిదాన్ని సూసి లగ్గం సేత్తా" అంటూ మా అమ్మ ఓ రోజు నన్ను కూసోబెట్టి పాటం సెప్పింది. నేనూ ఇనుకున్నా. కొద్ది రోజుల పాటు సింతతోపులోంచే దారి కట్టినా. కానీ పాడు వయసూరుకోలేదే! మరి కొద్దిదినాలకి మల్లీ కాల్లు అటే లాగినాయి. ఎదవ మనసుకు వద్దన్నా, కాదన్నా బుద్ది అనేదే ఉండదు. నేనేటి సేతును? మల్లా ఆ దారెమ్మటే మా పొలానికి పోవడం మొదలు పెట్టినాను.

ఒక రోజు సందేల పొలాన్నుంచి తిరిగొత్తా ఉంటే, ఎనక నుంచి నా ముకం మీద ముసుగు పడ్డది. దబదబా నా మీద పది పదేను కఱ్ఱదెబ్బలు పడ్డయ్. తప్పించుకుందామన్నా ఈలే కాలేదు. ముసుగు తీసుకునేలోపున దొంగనాయాల్లు పారిపోయినారు. ఇదంతా సీతాలు అయ్యే సేపిచ్చినాడని ఊళ్ళో అంతా గుసగుసలు పోయినారు.

నాకు పంతం పెరిగింది. రోజూ పొలానికి పోతా పోతా... ఊరికే ఈలేసి సీతాల్ని పిలవసాగినా! సీతాలు బెదిరింది. అసలు కంటికి కనపడకుండా మానేసింది. నాకూ పంతం పెరిగింది. రోజూ అట్టానే సేసేటోన్ని. ఇట్టా కొన్నాళ్ళు గడిసింది. ఇసుగెత్తిన సీతాలు అయ్య పంచాయితీ పెట్టించినాడు. నేను లొంగలేదు. ఎదురు తిరిగినా. సీతాలుకి లగ్గమయ్యి పెనిమిటి కాడికి పోయేదాకా నన్నూ, మా యమ్మనూ ఊరొదిలి పొలం కాడే ఉండమని తీర్పయింది. పంచాయితీ ఆన జవదాటరానిది. నేనూ, మాయమ్మా పొలంలోనే గుడి సేసుకుని ఆడనే ఉండబట్టినాము.

★★★

సీతాలు కోసం ఆళ్లయ్య పెళ్ళికొడుకుని ఎతకడం మొదలు పెట్టినట్టు తెలిసింది. ఏటీ సెయ్యలేకపోయినాను. పంచాయితీ ఆన మీరరానిది. మంచికీ, సెడ్డకీ నాకు మా అమ్మ, మా అమ్మకు నేను అయ్యి బతకసాగేము. ఊర్లో ఎవలూ మా ఇంటికి రావడమే ఆగిపోయింది. నేను పొలానికి పోయి కాలం గడుపుతా ఉంటే, మాయమ్మ మాత్రం ఒంటరిగా తనలో తానే కుమిలిపోయేది. అట్టనే మనాది పట్టి రోజుకోసారైనా "అయ్యా! పెండ్లి సేసుకోమంటే సేసుకోకపోతివి. మీ మేనమామ ఊరన్నా పోయి ఉందామురా! నీ మరదల్నే పెళ్లి సేసుకొందువు నాయనా!" అనేది. అది నాకిట్టం లేదు. ఏం మాట్లాడకపోయేటోన్ని!

దినాలు గడుస్తా ఉన్నయ్. మనేదితో మాయమ్మ మంచం పట్టింది. మందేసే ఆచార్లు ఇటేపు తొంగి సూడనే సూడలేదు. మనేదితోనే కండ్లు మూసినాది మా అమ్మ. ఆమె కత అట్టా ముగిసింది!

నేను ఒంటరోన్ని అయిపోయినాను. పొలమే ఇల్లు. పొలమే ఊరు. పొలమే లోకం. సెట్టూ, పుట్టా, నేనూ అన్నీ ఒకటే. మడిసి ఎట్టున్నా రోజులు గడవక మానవు. గడుస్తానే ఉన్నాయి. అమ్మ గురుతొచ్చేది. సీతాలు గురుతొచ్చేది. ఎవరు గురుతొచ్చినా, రాకున్నా రోజులైతే శానా గడిసిపోయినాయి.

★★★

అంతా ఒక్కసారి గురుతొచ్చి మనసు బాదతో మూలిగింది. ఆకాశమెంక సూసా. నడిరేత్తిరి దాటింది. సలి ఇంకా పెరిగింది. రొజాయి బిగించి దెగ్గిరికి నాక్కున్నా, ఏదో ఒక సందులో నుండి సలిగాలి లోపటికొచ్చి నరాలను పట్టేస్తా ఉన్నది.

సేను పొట్ట మీదున్నాది గందా అని ఒళ్ళంతా కళ్ళు సేసుకొని కాపు కాత్తా ఉన్నా. పక్కనే అడివి. అందులోంచి పంట మేసేందుకే కాదు... ఏదో ఒక జంతువు దొరకకపోద్దా అని పెద్ద జంతువులే రావొచ్చు. ఏటొచ్చినా అది తొక్కేత్తే పంటంతా పాడు పాడు. కళ్ళు పొడుసుకున్నా కనిపించని సీకటని ఎందుకంటారో అమాస రాత్రి నాడు పొలంలో మంచె మీద కూసుని సూత్తేనే తెలుస్తది.

ఉన్నట్టుండి కంటికి కనిపించేంత దూరాన్న ఓ తెల్లని ఆకారం... గుండె జల్లుమన్నది. జంతువు కాదే... మడిసి లాగా ఉందాది. అట్టానే నడుస్తాంది. ఊపిరి బిగబెట్టినాను. ఇరవై అడుగుల దూరానికి కాబోలు వచ్చినట్టనిపించింది. వచ్చేది ఆడమనిసి. నడక పద్దతి తెలుస్తానే ఉంది. వేగంగా నడుస్తా ఉన్నది. నాకు పదడుగుల దూరంలో కొచ్చినాది. నాకు

ఎన్నులోంచి సలి పుట్టుకొచ్చింది. 'మోహినీ పిశాచేమో!' అనిపించి బయమైనాది. "ఎహె! కాదునే!" నాకు నేనే దయిర్ణం సెప్పుకున్నాను.

ఆ యమ్మి నడుసుకుంటా అట్టనే ఒచ్చి, మంచె పక్కనే ఉన్న బండరాయి మీన కూసుంది. ఏం సేత్తదో సూద్దామని గొమ్మునున్నా. ఉలుకూ లేదు... పలుకూ లేదు. అట్టనే కూసుండిపోనాది. నాకు సిత్రమనిపించింది. ఇదేందో సూద్దామని, మంచె దిగి ఆమెకేసి నడిసిన. దెగ్గిరికి... ఇంకా దెగ్గిరికి... బాగా దెగ్గిరికి ఒచ్చిన. ఆమె తలెత్తి సూసింది. ఇప్పుడు నిజంగానే గుండె ఝల్లుమన్నాది.

నోట మాట పడిపోనాది. కష్టం మీద గొంతు పెగుల్చుకుని "సీతాలూ!" అని పిలిసినాను. ఆ ఒక్క మాట కోసరం ఎన్నటినించో ఎదురుచూస్తున్నదానిలాగా ముకం పైకెత్తి సూసినాది. కళ్ళనిండా, గుండె నిండా తడితో సూసింది. నా గుండె గొంతుకలోకొచ్చి దడదడలాడినాది.

"మావా!" ఒక్కటే మాట. మరి పలుకునేదు... ఊసునేదు... ఒక్కసారి నా అదురుతున్న ఒంటి మీంచి, ఒనుకుతున్న సేతుల సందులోంచి ఆమె సేతులు నన్ను, నాలోని పేవను ఎతుక్కుంటూ గుండెల మీంచి పాకుతూ ఎనక్కెల్లి, ఈపుని బిగించి గెట్టిగా నాక్కున్నాయి. మా రెండు కులాల మధ్య గోడల్లాగా గెట్టిగా, నా మీది సీతాలు పేవలాగా, మెత్తగా ఆమె గుండెలు నా ఎదకు వత్తుకుంటున్నాయి. సలి పులిని సంపనీకి ఒయిసు అగ్గిని రాజేసినాది. అగ్గి మంటై, కారుచిచ్చై మండినాది.

నిలబడ్డ నా కోసం నిలబడ్డాది సీతాలు! గొలుసులు తెంచుకొచ్చిన ఆమెకోసం నేనేమి సేతును? నా మనసూ పేవా కాక ఇంకేటిచ్చేది? ఏమివ్వాలో ఆమె ఒల్లే సెప్పింది. నా ఒల్లూ ఆ మాటిన్నది. ఎన్నెల రాత్తిరో, అమాస సీకటో... అదేటైతే మాకేల? నా ఒంట్లో, ఆమె ఒంట్లో ఉన్న సీకటో, ఎలుగో మాకు సాలదా! ఆమె కళ్ళల్లో, నా కళ్ళల్లో ఉన్న ఎలుతురు మాకు సాలదా! ఒల్లూ, ఒల్లూ రాసుకుని పుట్టే అగ్గిలో ఇద్దరం మండి, మరిగి కరిగి, ఆమెలో నేను, నాలో ఆమె పొంగిపోనాం. ఒయిసు కరిగి, ఆవిరై సల్లబడినాది.

రేత్తిరి ఎంతైనాదో మాకెరికే నేదు. అట్టాగే అలసిపోయి ఒకరి సేతుల్లో ఒకరం, ఒకరి గుండెల్లో ఒకరం ఒదిగిపోయినం. తూరుపున వేగుసుక్కతోనే ఆమె లేసింది. నాకు మెలకువ రానేలేదు. నా ఒంటి మీదంతా ఆమె ముద్దులు పెడతా ఉన్నది. కళ్ళ మీది ముద్దుకు మెలకువ వచ్చింది. ఒల్లు మల్లా ఏడెక్కింది. మాటలు రానేదు. వెచ్చని ఊపిరులే తీయని మాటలై ఇద్దరి మద్దెనా సెలయేరై పారాయి. ఎప్పటికో ఆ ఊసుల బాసలు అలసి నిట్టూర్పులుగా మారాయి.

పిచ్చిపిచ్చిగా తిరిగిన నా ఉంగరాల జుట్టును వేళ్ళతో మెలేస్తూ "మావా!" అన్నది.

"ఏటే!" అన్నాను ఆమె మెత్తని గుండెలపై చెయ్యేస్తూ.

"మరి... నువ్వేల నన్ను మనువు సేసుకోలేదు?"

నా గుండె గొంతుకలోకొచ్చినాది. మాట రానేదు. బయపడతానే అన్నా..." సీతాలూ! పంచాయితీ ఆన...ఎట్టా మీరేది! నేనేమి సేతును?"

సీతాలు కొద్దిసేపు గమ్మునుంది. ఒక్క క్షణం ఆగి "మావా!" అన్నది ఆర్తిగా.

"సెప్పు నా బంగారం..." అన్నాను.

"మరి నన్ను మరిసిపోతావా!"

"ఎందుకు మరిసిపోతానే! నా గుండెల్లో ఎప్పుడూ నువ్వే ఉంటావు. మీ అమ్మనీ, అయ్యనీ ఒప్పిద్దామే! పంచాయితీ ఆనని మారిపిద్దామే!" నమ్మకంగా సెప్పినాను.

సీతాలు ఎందుకో సన్నగా నవ్వినట్టనిపించింది.

"నన్ను మరిసిపోకు మావా! తెల్లారతాంది. మరి పోదునా?"

ఆమె కళ్ళనిండా నీళ్లు. ఎర్రోన్ని నేను. మరిసిపోవద్దని ఎందుకన్నదో నా ఎదవ బుర్రకి అర్ధం కానేదు. ఏం సెయ్యాలో తోసలేదు గాని, సీతాలూ, నానూ కలిసేందుకు, కలిసి ఉండేందుకు ఏదో ఒకటి సేద్దామనే అప్పటికి అనిపించింది. తల ఊపుతానే నా మీదికి లాక్కున్నా. ఆమె కూడా కావాలనే పడ్డది. ఇద్దరి మద్దెనా గాలే ఆగిపోనాది. వదలలేక వదలలేక వదిలింది. ఎనకెనక్కి తిరిగి సూస్తూ ఊరి దిక్కు నడిసింది. లేత సీకట్లో ఆమె కలిసే దాకా సూస్తానే ఉన్నా!

కల కరిగినట్టనిపించింది! కళ్ళు మూతలు పడ్డాయి. బాగా ఎండెక్కినాక సూరీడు కళ్ళల్లో పడి మెలుకువొచ్చినాది. తెల్లారిందనుకున్నాను. నా బతుకే తెల్లారిందని తెలీలేదు.

మంచె మీంచి దిగి ఊరు కాసి సూసినాను. నాకూ ఊరికీ మద్దిన ఎల్లలాగా ఉన్న ఏరు. ఊరిడిసి, ఏరు దాటి నా కాడకొచ్చినాది నా సీతాలు. నాకేటి కావాల? నేనూ పంచాయితీ ఆన ఎదిరిస్తా... నా సీతాల్ని నా సొంతం సేసుకుంటా... నా మనసులో సెప్పలేని ఊహలు, ఊసులు ఉరకలెత్తుతూ ఉన్నాయి.

నాకూ సీతాలుకీ మద్దెన పంచాయితీ అడ్డుగా నిలబడినాది. కాదు... కాదు... నాకూ నా సీతాలుకీ మద్దెన ఆ ఏరే అడ్డంగా ఉన్నది. ఏరు దాటితే, ఏటి కట్ట దాటితే సీతాలు నాదే!

ఇన్నాళ్ళూ అది దాటడమే నా వల్ల కానేదు. సీతాలట్టా కాదు... ఊరు దాటి... ఏరు దాటి నా కాడకొచ్చినాది. నా మగతనమేమైపోనాది? నేనూ ఏరు దాటతా. సీతాలు నాది. ఏటికివతల నాకున్నదేదీ నాది కాదు.

ఏరు దాటాల... ఏరు దాటాల... ఏరు దాటాల... మంచె దిగి... పొలం దాటి వడివడిగా ఏటికేసి నడవడం మొదలు పెట్టాను. ఏరు దాటాల... ఏటికట్ట దాటాల... ఇదే ఆలోచన!

ఏటి కాడికొచ్చినాను. అది దాటితే ఇక సీతాలు నా సొంతం. ఎవరూ కాదనేది లేదు. నడుస్తా ఉన్నాను.

ఏటి గట్టుమీన ఊరి జనం. పొద్దున్నే స్నానానికి, పానానికి వచ్చి ఉన్నారు. నన్ను సూసి ఒకడు నోట్లో పుల్ల తీసి తుపుక్కున ఊశాడు.

"ఇప్పుడొచ్చి ఈడేం సేస్తాడు! సీతాలు నిన్ననే ఇదే ఏట్లో దూకి సచ్చినాక... థూ..." సీత్కారంగా అన్నాడు.

"ఏం పేవరా ఈడిది? నిన్న అది సచ్చి నిన్ననే ఆళ్లయ్య దాన్ని పూడిస్తే ఈడికింకా తెలీనేలేదు. ఎర్రెదవ కాడా ఈడు?" మరొకడు హేళనగా నవ్వసాగాడు.

ఒల్లు జల్లుమన్నాది. కళ్ళు గిర్రున తిరిగాయి. నా సీతాలు సచ్చిపోయిందా! నిజమా? నిన్న ఏట్లో దూకి సచ్చిపోయిందంటున్న నా సీతాలు... ఈ రేత్తిరి నా కాడకొచ్చినాది కదా! నేన్నమ్మనే నమ్మను. ఇది ఈళ్ళు నా మీదా, సీతాలు మీదా సేత్తున్న కుట్ర... అంతే... అదే నిజం! నా సీతాలు కాడికి ఏరు దాటిపోవాల!

“సీతాలూ...” గొంతు చించుకొని అరిచినాను. నా సీతాలు పలకలేదు.

“సీతాలూ...” మల్లా అరిసినాను. నా సీతాలు ఉలకలేదు. పలకలేదు.

“ఒరే! ఇంకెక్కడి సీతాలు? నీ సీతాలు నిన్ననే పోయిందిరా! ఆళ్లయ్య దానికి నిన్ననే కార్యం జరిపించాడు. ఇంకెక్కడి సీతాలు! పో! ఊళ్ళోకి పో! నీ మీద పంచాయితీ ఆన తీరిపోనాది.” ఎవరో అంటున్నారు.

నమ్మబుద్ధి కాలేదు.

ఒంగి ఏట్లోకి సూసాను. అడుగు ముందుకేసి సూస్తే... ఏటి నిండా నీళ్ళు. ఏట్లో నా సీతాలు. తెల్లని సీరలో సందమావలాగ... అమాస మింగేసిన సందమామ నాగ! సేతులు రెండూ రెండు పక్కలా సాచి ఉన్నాయి. నన్ను కౌగిలిలోకి రమ్మంటూ. ఒక్కసారిగా ఉరికాను. నా సీతాల్ని వాటేసుకున్నాను.

“ఒరేయ్! ఈడికి పిచ్చెక్కిందిరా! రేయ్! కర్రోడా! నెగరా! మునిగి సత్తావ్.” ఒకళ్ళ తరవాత ఒకళ్ళు అరుస్తూ నన్ను బయటకు లాగారు.

నేనూ అరవసాగాను “రేయ్! ఎదవల్లారా! మీరు నా కులపోల్ని ముట్టుకోరు. శవాన్నీ ముట్టుకోరు. ఇపుడు నేనూ, సీతాలూ ఒకే కులంరా. నన్నెవరూ ఎలెయ్యలేరు.” గెట్టిగా నవ్వాను.

అంతలో ఏడుపు ముంచుకొచ్చింది. దుక్కం పట్టలేక ఏడిసినాను.

నవ్వూ, ఏడుపూ ఒకదాని ఎంట, ఒకటిగా తెరలు తెరలుగా వస్తానే ఉన్నాయి. అలిసిపోయి ఏటి పక్కనే పండుకున్నా. నా పక్కనే నా సీతాలు ఊసులు సెపతా ఉన్నది.

రేతిరయ్యింది. “రా మావా! మంచె కాడికి పోదాం.” అన్నది నా సీతాలు. నవ్వుకుంటా, తుళ్ళుకుంటా పొలం దారి పట్టామిద్దరం.

★★★

“ఎర్రోడు! ఎప్పుడూ మంచె మీనే ఉంటాడు. పంటెండి పోయింది. ఆడికి స్పృహ లేదు. ఆడు సీతాలు తోటే సచ్చిపోనాడు. ఆడి కట్టే ఆ మంచె మీదున్నాది.” ఊళ్ళోంచి బయటకీ, బయట నుంచి ఊళ్ళోకీ వచ్చేపోయే జనం నన్ను సూసి అనుకుంటూ ఉన్నారు.

ఆల్లకేం తెలుసు! ఏదో ఒక అమాస రేత్తిరి నన్ను ఎతుక్కుంటా నా సీతాలొస్తది. అంతదాకా నేను సావనే సావను. ఉహు! సచ్చినా సావను!

# రెండవ బాణం

**డా.పూడిపెద్ది శేషు శర్మ**

✆ +12812356641

> ***మొదటిబాణం మనని ఒక్కసారే బాధ పెడుతుంది.***
>
> ***కాని దానికి ప్రతిస్పందించి, మనమే విడిచిన రెండవబాణం కలిగించే క్షోభ ఇంతా అంతా కాదు.***
>
> ***అది అంతులేనిదై కూర్చుంటుంది. మనని విడిచిపెట్టదు.***
>
> ***ఆ రెండోబాణం ప్రయోగించకుండా చూసుకోమంటాడు... ఆ తథాగతుడు!***

స్నానం ముగించుకొని, తనకు కేటాయించిన గదిలోకి వచ్చింది సుభద్ర.

ఎదురుగా, తన సూట్‌కేసులో బట్టలన్నీ అటూ ఇటూ దొర్లిస్తూ ఏదో వెతుకుతోంది పద్మ. ఏం జరుగుతోందో అర్థం కాక, నిశ్చేష్టురాలై నిలుచుంది సుభద్ర.

"ఏమీ లేదు సుభద్రత్తా! కేశవ్ అమెరికా నుండి స్పెషల్ టవల్స్ పట్టుకొచ్చాడు, కాశీయాత్రకి వెళ్ళేటప్పుడు పెళ్ళికొడుకుకి ఇవ్వడానికి. అవి ఎక్కడపెట్టానో కనిపిచడంలేదు. ఎడంచేత్తో, ఈ సూట్‌కేసులో పడేసేనేమోనని వెతుకుతున్నాను. అయ్యయ్యో, ఇది మీ సూట్‌కేసా? పొరపాటైపోయింది. మీరేమీ అనుకోవద్దు." అంటూ కంగారుగా లేచి గబగబా బయటకు దూసుకుపోయింది పద్మ.

అంటే, ఆ తువ్వాళ్ళని, తను దాచేసుకుందేమోనని, తన మీద అనుమానమా? సూటిగా ఒక బాణం సుభద్ర గుండెల్లో గుచ్చుకుంది.

పెళ్ళివారి ఇల్లు సందడిగా ఉంది. పెద్ద బంగళా అది. విశాలమైన ప్రాంగణం. వెనకాల చిక్కటి గడ్డితో చక్కటి ఆకుపచ్చ కార్పెట్ పరచినట్టుగా ఉన్న ప్రదేశం. అందులో పెద్ద కల్యాణవేదిక వేయించారు. కుర్చీలన్నీ హంగులతో ముచ్చటగా పేర్చేరు.

కాశీయాత్ర ముందు వాకిటిలో జరుగుతున్నట్టుంది. అందరూ ఎవరి ధోరణిలో వాళ్ళు కబుర్లు చెబుతూ, ఆ తతంగాన్ని చూస్తున్నారు. పద్మకి చికాకుగా ఉంది.. అనుకున్నట్టు సమయానికి తను తెప్పించిన తువాళ్ళు కనపడలేదని! పద్మ చికాకు గ్రహించింది సుభద్ర. మనస్సు వికలమైపోయింది.



తువ్వాళ్ళు సమయానికి కనపడలేదని పద్మకు చికాకు... తనని అనుమానించిందని సుభద్ర వేదన!

ఇంట్లో ఉన్న ఒక కొత్తతువ్వాలు తెప్పించి కార్యం పూర్తిచేయించింది పద్మ.

సుభద్ర తిరిగి వెళ్ళి గదిలో తన మంచం మీద కూర్చుంది. విపరీతంగా దుఃఖం పెల్లుబుకి వస్తోంది.

తీవ్రమైన గాయం గుండెలో సూటిగా తగిలింది. తనమీద తన మేనల్లుడి భార్య పద్మ దొంగతనం ఆరోపించిందా? సహించలేకపోతోంది.

తన మేనల్లుడు రామం, 'ఒక్కగానొక్క కూతురు పెళ్ళి చేస్తున్నాను, నా తరపున పెద్దవాళ్ళెవ్వరూ లేరు, నువ్వు లేకపోతే ఎలాగ?' అని ఫోనులో బతిమాలితే, ప్రయాణాలు చేయడం ఇష్టం లేకపోయినా సరే, శక్తి కూడబెట్టుకొని, ముందురోజు రాత్రే పెళ్ళికి వచ్చింది. కొడుకు, కోడలు, వాళ్ల ఉద్యోగాల్లో వీలుకాక రాలేకపోవడంతో, ఒంటరిగా బయలుదేరి వచ్చింది. ఆప్యాయంగా ఆహ్వానించేరు రామం, పద్మ. వేరే పడకగది లేకపోవడంతో, పెళ్ళిసామాన్లు అన్నీ అందుబాట్లో ఉండేటట్టుగా అమర్చి పెట్టుకున్న గదిలో ఒక మూలగా ఒక మంచం వేయించేడు తనకోసం రామం. పక్కనే బాత్‌రూమ్ ఉందేమో,

తనకు సౌకర్యంగా ఉంటుందని అనుకుంది. కాని, పెళ్ళిసామాన్ల కోసం, ఎవరో ఒకరు వస్తూనే ఉన్నారు రాత్రంతా! రాత్రి నిద్రలేక పోవడంతో చికాకుగా ఉంది సుభద్రకి! పోనీ, ఈ రాత్రికి ఎలాగో సద్దుకుపోతే, తిరిగి తన గూడుకి పోవచ్చు అని సరిబుచ్చుకుంది.

కాని, ఎన్నడూ ఊహించని ఆ సంఘటన గుండెని పిప్పి చేస్తోంది. తన డెబ్బైనాలుగు సంవత్సరాల వయస్సులో ఇటువంటి అవమానం ఎప్పుడూ ఎదురవలేదు సుభద్రకి. తను దొంగతనం చేసిందేమో అని తన సూట్‌కేసు సోదా చేసింది పద్మ. ఆ అలోచన రానురాను చాలా గాఢంగా హృదయంలో నాటుకు పోతోంది. వెంటనే అక్కడినుంచి పారిపోవాలనిపించింది సుభద్రకి. మెల్లగా వెళ్ళి పక్క వరండాలో ఎవ్వరూ లేని చోట కూర్చుంది.

బయట బాజాలు, భజంత్రీలు, కోలాహలం!

రామం మంచి హోదాలో ఉన్న ఉద్యోగస్థుడేమో, కార్లలో ఎందరో గొప్పవాళ్లంతా వచ్చిపోతున్నారు. చాలా ఘనంగా పెళ్ళి జరిగింది. తనని వెతుక్కుంటూ మరీ వచ్చి పెళ్ళి అవుతున్నప్పుడు తన పక్కనే కూర్చో పెట్టుకున్నాడు రామం. మనస్సులో మథనం.. బాధ, కాని పైకి మాత్రం మొహం మీద చిరునవ్వు పులుముకుని, పెళ్ళికొడుకుని, కూతుర్ని దీవించి తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయింది సుభద్ర. సాయత్రం రిసెప్షన్. విందు భోజనాలు, పాటలు, నాట్యాలు. మొక్కుబడికి కాసేపు అక్కడ కూర్చుని, తిరిగి వచ్చి తన గదిలో పడుకుంది. రాత్రి ఎప్పుడో రామం, పద్మ వచ్చి తన పక్కన కూర్చున్నారు.

"అత్తా, నువ్వు రావడం మాకు ఎంత సంతోషంగా ఉందో. కొన్నాళ్ళు మా దగ్గర ఉండకూడదూ?" ప్రేమగా అడిగేడు రామం.

"అవునత్తయ్యా. ఇంత హడావిడిగా రేపే ప్రయాణం పెట్టుకుని మీరు వెళ్ళిపోవడం దేనికి?" అడిగింది పద్మ, ఉదయం జరిగిన సంఘటన సుభద్ర మీద ఎటువంటి ప్రభావం కలిగించిందో తెలియక.

"లేదురా రామం. ఎవరి గూటిలో వాళ్లుండడం క్షేమం!" అంటూ, తప్పించుకుంది సుభద్ర.

మంచం మీద నడుం వాల్చి, ఆలోచిస్తోంది సుభద్ర.

'అమెరికా తువ్వాళ్ళు ఏమయిపోయి ఉంటాయి?' అని పద్మ వాళ్ళతో, వీళ్ళతో మాట్లాడడం వింది. మనస్సులో క్షోభ ఇంకా ఎక్కువయింది.

"పిన్నీ, ఇక్కడ ఉదయం ఒక గద్వాలు చీర పెట్టేను. కనిపించడం లేదు, నువ్వుగాని తీసేవేమిటి?" గదిలోకి వస్తూ అడిగింది సుభద్రని, తన అక్క కూతురు కమల.

సూటిగా బాణం తగిలింది. క్షణం సేపు నోట మాట రాలేదు సుభద్రకు. ఇదేమిటి, కమల కూడా తనని అనుమానిస్తోందేమిటి? ఏం పాపం చేసింది తను?

"లేదు కమలా... నేను ఏవీ ముట్టుకోలేదు. ఏ సామాన్లు ఎక్కడ ఉన్నాయో నాకు తెలీదు." ముభావంగా అంది.

ఏ విసురుతో వచ్చిందో, ఆ విసురుతోనే బయటకి వెళ్ళిపోయింది కమల.

ముళ్ళమీద కూర్చున్నట్టు ఉంది సుభద్రకు. 'ఎప్పుడు తెల్లారుతుందా, ఎప్పుడు బయటపడదామా' అని ఆలోచిస్తోంది.

ఆ రాత్రి, అలసిపోయేరేమో, పెళ్ళివారంతా ఎక్కడ పడితే అక్కడ హాయిగా నిద్రపోయేరు.

సుభద్రకి కునుకులేదు. అందరూ తనను దోషిగా చూస్తున్నారన్న అనుమాన బీజం మొక్కై, వృక్షంగా పెరిగి, బలమైన వేళ్ళు నాటుకుంటోంది.

తెల్లారింది. ఎవరి ప్రయాణాల హడావిడిలో వాళ్ళు ఉన్నారు. రామం, పద్మ కనిపించలేదు సుభద్రకి. 'పెళ్ళికూతురుని తీసుకొని మగపెళ్ళివారి వసతి గృహానికి వెళ్ళినట్టున్నారు' అనుకుంది. అదే మంచిసమయం అనుకొని, ఒక పనివాణ్ణి పిలిచి, తనని రైల్వే స్టేషన్‌కి తీసుకెళ్ళడానికి ఆటోరిక్షాని తీసుకురమ్మంది. ఈలోగా ఎవ్వరినీ పలకరించాలని అనిపించలేదు. మంచం మీద కూర్చుంది.

"మామ్మగారూ, నిన్న రాత్రి ఇక్కడ కొత్త బ్రష్, టూత్‌పేస్ట్ సెట్లు పెట్టేను, మీరు కాని చూసారా?" ఎవరో ఓణీ వేసుకున్న అమ్మాయి అడిగింది సుభద్రని.

సూటిగా బాణం తగిలింది మళ్ళీ. మాట్లాడనిపించలేదు. మౌనంగా తల అడ్డంగా ఊపింది. ఆ పిల్ల తనని వింతగా చూస్తూ బయటకి పోయింది. ఇంటినిండా మనుష్యులు, హడావిడి! సుభద్రని మాత్రం చెప్పలేనంత ఒంటరితనం ఆవహించింది.

అంతలో ఆటో వచ్చింది. మౌనంగా ఎక్కి బయలుదేరింది సుభద్ర. యాంత్రికంగా మనిషి వెళ్తోంది. కాని చాలా విలువైనది పోగొట్టుకున్నానన్న విషయం గ్రహించలేదు సుభద్ర.

★★★

సుభద్ర స్వతహాగా నెమ్మదస్తురాలు. ఎక్కువగా ఎవ్వరితో మాట్లాడదు. భర్త చనిపోయి పదిహేను సంవత్సరాలయింది. భర్త పోయిన దగ్గరనుంచీ ఎక్కువగా ఒంటరిగా ఉండడమే అలవాటు చేసుకుంది. కొడుకు సూర్యంతో తణుకులో ఉంటుంది. కోడలు వాణి అత్తగారిని గౌరవంగా చూసుకుంటుంది. ఒక్క మనవడూ, కాకినాడలో మెడిసిన్ చదువుతున్నాడు. భర్త లేకపోయినా, ప్రశాంతంగానే జీవితం గడచిపోతోంది సుభద్రకి. కూతురు అమెరికాలో ఇరవై ఏళ్ళ క్రితమే సెటిల్ అయిపోయింది. ఎప్పుడైనా చుట్టంచూపుగా వస్తుంది. కొన్నాళ్ళు ఉండి వెళ్ళిపోతుంది. అప్పుడప్పుడు ఫోన్లో మాట్లాడుతుంది కాని తల్లికీ, కూతురికి గొప్ప అనుబంధం అంటూ లేదు. కూతురి గురించి సుభద్ర ఎక్కువ ఆలోచించదు కూడా.

తనని ఇంటికి తీసుకెళ్ళడానికి కోడలు వాణి స్టేషన్‌కి వచ్చింది. మౌనంగా ఆటో ఎక్కి కూర్చుంది సుభద్ర.

"అత్తయ్యా, మీ స్వెట్టర్, శాలువా ఏవీ? ఈ చలిలో, ఈ ఈదరగాలిలో ఏమీ కప్పుకోకుండా వస్తే ఎలాగ చెప్పండి. మీకు జలుబూ, జ్వరం ఏమైనా వస్తే?" కాస్త మందలించింది వాణి.

అప్పుడు గుర్తుకు వచ్చింది సుభద్రకు. అవి పెళ్ళివారింట్లో, ఆ మంచం మీదనే వదిలేసిందని! అన్యమనస్కురాలవడంతో వాటి సంగతే మర్చిపోయింది.

వాణి అడిగిన ప్రశ్నలకి ముక్తసరిగా సమాధానాలిచ్చింది. అత్తగారు పెద్ద మాటకారి కాదు కానీ ఆమెలో ఇంత ఉదాసీనత్వం, మొహంలో ఏదో అనూహ్యమైన చింత ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు వాణి! 'ఏమయి ఉంటుందా?' అని అలోచించసాగింది.

ఇంటికి వెళ్ళి, అన్నం తినకుండా, ఒంట్లో బాగులేదని, మంచంమీద ముసుగు కప్పుకొని పడుక్కొంది సుభద్ర. ఆరోజు సాయంత్రం వాణి బలవంతం చేస్తే, కొంచెం చారూ అన్నం తిని పెందరాళే పడుక్కుంది. పడుక్కుంది గాని, గుండెలోని బాణం పొడుస్తూనే ఉంది సుభద్రకు. ఎప్పుడో మెల్లగా నిద్రలోకి జారుకొంది.

అత్తగారి ప్రవర్తన విచిత్రంగా అనిపించింది వాణికి.

ఆ మర్నాడు సూర్యం ఊరినుండి వచ్చాడు. ఇంటికి రాగానే, తల్లిని పలకరించాడు. వాణి ద్వారా అమ్మ ఏదో మనోసంక్షోభానికి గురి అవుతోందని తెలుసుకున్నాడు. మెల్లగా కదిలించి చూసాడు. సుభద్ర ఏమీ మాట్లాడలేదు. సరే, కాలమే అన్నిటినీ సరి చేస్తుంది అని ఊరుకున్నాడు.

సుభద్ర సరిగ్గా తినడం మానేసింది. ఆకలి లేదంటుంది. ఊరినుండి వచ్చిన రెండు రోజులకి ఆమెకి తీవ్రంగా జ్వరం, వణుకు, దగ్గు మొదలయ్యాయి. మందులిచ్చినా జ్వరం తగ్గటం లేదు. మర్నాటికి తగ్గకపోతే డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్దామని నిర్ణయించుకున్నారు, వాణి, సూర్యం.

సుభద్ర రాత్రంతా మగతగానే పడుక్కొంది. మధ్యమధ్యలో నిద్రలోనే ఆవిడ ఏవో మాట్లాడడం విన్నారు సూర్యం, వాణి.

"నేను దొంగని కాను. నాకు వాటి గురించి తెలియదు, మరి నన్ను ఎందుకు అడుగుతున్నారు?" సన్నగా గొణుక్కుంటోంది సుభద్ర.

స్పష్టంగా వినబడకపోయినా, విషయం గ్రహించేరు, సూర్యం, వాణి!

సూర్యం, రామానికి ఫోన్ చేసి ఏమయి ఉంటుందో అడుగుదామనుకున్నాడు. వద్దని వారించింది వాణి. 'లేని పోని కొత్త గొడవలు రావచ్చు, మనమే మెల్లిగా కనుక్కుందాం' అంది.

'సరేనని' ఊరుకున్నాడు సూర్యం.

మర్నాడు జ్వరం ఎక్కువ కావడంతో, డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళింది వాణి. సుభద్రకి న్యుమోనియా అని తేలింది. ఇంజక్షన్ ఇచ్చి, మందులు రాసి ఇచ్చేడు డాక్టర్. మందులు తీసుకొని ఇంటికి వచ్చి, అత్తగారిని తన గదిలో పడుక్కోబెట్టి, ఫోన్ డయల్ చేసింది వాణి.

★★★

ఆటోరిక్షా వాడికి డబ్బులు ఇచ్చి, తలుపు తట్టింది రమణమ్మ. తలుపు తీసి, వాణి చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించింది రమణమ్మని. రమణమ్మ చిన్నతనం నుండి సుభద్రకు స్నేహితురాలు. రమణమ్మ పిల్లలిద్దరూ, అమెరికా సిటిజన్స్. కొడుకు అమెరికన్ అమ్మాయిని, కూతురు పంజాబీవాణ్ణి చేసుకున్నారేమో... అల్లుడు, కోడలుతో అంత కనెక్షన్ లేదు రమణమ్మకు.

ఎప్పుడో చుట్టపుచూపుగా వచ్చి పోతూంటారు. మనవలు, మనవరాళ్ళు, అక్కడే పుట్టి పెరిగేరేమో, వాళ్ళతో కూడా అనుబంధం అంతగా లేదు.

భర్త పోయి పదేళ్లు దాటింది. పరదేశం పోయి పిల్లల దగ్గర ఉండాలనిపించలేదు రమణమ్మకి. స్వతహాగా, స్వాతంత్ర్య భావాలు, ఆధ్యాత్మిక చింతన ఉన్న మనిషి. తన ఆరోగ్యాన్ని భౌతికంగా, మానసికంగా చక్కగా చూసుకుంటుంది. తనకు వచ్చే పెన్షన్‌తో తిండికి, గుడ్డకూ లోటు లేకుండా గడిపెయ్యగలదు. ఒంటిలో శక్తి ఉన్నంత కాలం నలుగురికి సాయం చేయాలి అన్న ఉద్దేశ్యంతో, తణుకు దగ్గర ఒక వృద్ధుల ఆశ్రమంలో అసిస్టెంట్ మేనేజర్‌గా జాయిన్ అయింది. ఆనందంగా బతుకుతోంది.

రమణమ్మ అంటే వాణికి చెప్పలేనంత గౌరవం. అత్తగారి విషయంలో ఎటువంటి సందేహాలొచ్చినా రమణమ్మని అడుగుతుంది వాణి.

సంగతంతా వివరంగా చెప్పింది రమణమ్మకు వాణి. చిరునవ్వు నవ్వింది రమణమ్మ.

"ఏమయిందో నేను ఊహించుకోగలను వాణీ. ఎవరో ఏదో అని ఉంటారు. ఈవిడ బాధపడింది. కాని తను అనుభవిస్తున్న ఈ క్షోభ రెండో బాణం వల్ల" అంటూ ఆపింది రమణమ్మ.

అర్థం కానట్టు చూసింది వాణి.

"మనని అవతల వాళ్లు ఏదో మాటతో లేదా చేష్టతో బాధ పెట్టడం మొదటిబాణం! కాని దానికి ప్రతిస్పందించి, పదేపదే తలచుకొని, అలా ఎందుకు అన్నారు అని తెగ బాధపడిపోతూ, మనల్ని మనమే ఎక్కువ హింసించుకుంటాం. దాన్నే రెండోబాణం అంటాడు బుద్ధుడు! మొదటిబాణం మనని ఒక్కసారే బాధపెడుతుంది. కాని దానికి ప్రతిస్పందించి, మనమే విడిచిన రెండవబాణం కలిగించే క్షోభ ఇంతా అంతా కాదు. అది అంతులేనిదై కూర్చుంటుంది. మనని విడిచిపెట్టదు. ఆ రెండోబాణం ప్రయోగించకుండా చూసుకోమంటాడు, ఆ తథాగతుడు! 'యోగః చిత్త వృత్తి నిరోధః' అని చేప్పేదు పతంజలి మహర్షి. చిత్త వృత్తి నిరోధం అంటే ఇదే. మనస్సుని పరిపరి విధాలుగా పోకుండా మన కంట్రోల్‌లో పెట్టుకోవడమే. మన సంసారంలో ముక్తి, మోక్షం అంటే అదే. వేరే ఏమీ లేదు!" అంటూ నవ్వుతూ సుభద్ర గదిలోకి దారితీసింది రమణమ్మ.

'నిజమే, ఆ రెండోబాణాన్ని ఆపగలిగేవారు ఎవరైనా ఉంటారా? ఉంటారు కాబోలు, వాళ్ళు నిజంగా యోగులు...' అనుకుంది వాణి.

చిత్తవృత్తుల గురించి చదివింది యోగా క్లాస్‌కి వెళ్ళినప్పుడు. ఇప్పుడు అదేమిటో అర్థమైంది. పతంజలి మహర్షికి మనస్సులో శ్రద్ధాంజలి సమర్పించుకొంది.

# టప్ టప్ ధాం ధాం

సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
✆ 9908554535

***"మనం ఇలాంటి ధ్వని విన్నప్పుడు, మనం భయపడి ఇతరులను భయ పెట్టకూడదు. అలా ఎందుకు జరుగుతున్నదో తెలుసుకోవాలి. అంతేగానీ ఏవేవో ఊహించుకొనరాదు. ఇటువంటి వాటికి ధైర్యమే మందు! ఎన్ని ప్రమాదాలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలి. మన పిల్లలకు కూడా ధైర్యం నూరిపోయాలి.***

సుందరవనం అనే అడవికి రాజుగా 'కేసరి' అనే సింహం ఉండేది. అది జంతువులను చక్కగా పాలించేది.

ఒకసారి ఆ అడవిలో ఒక కోతి పరిగెత్తుతూ ఒక ఏనుగుకు కనిపించింది. ఏనుగు దానిని " ఓ కోతీ! ఎందుకు పరిగెడుతున్నావు?" అని అడిగింది.

అప్పుడు ఆ కోతి "టప్ టప్ ధాం ధాం. పరిగెత్తు. ప్రమాదం ముంచుకొని వస్తున్నది" అని అంది.

అది విని ఏనుగు "ఏం ప్రమాదం? ఎక్కడ?" అని అడిగింది.

"అయ్యో! ఏనుగు మామా! నన్ను ఆపకు. నేను భయంకరమైన శబ్దాన్ని విన్నాను. అది ఎక్కడి నుండి వస్తుందో తెలియరాలేదు. మనం వెంటనే ఈ అడవి నుండి పరిగెత్తి, మరొక అడవికి పోయి తలదాచుకోవడం మంచిది" అని అంది.

అది విని ఏనుగు, కోతితో పాటు పరిగెత్తింది.

వాటికి ఎదురుగా ఒక ఎలుగుబంటి కనిపించింది. ఆ ఎలుగుబంటి వీటిని చూసి "ఆగండి మిత్రులారా! మీరు ఎందుకు పరిగెడుతున్నారు?" అని అడిగింది.

అప్పుడు కోతి "టప్ టప్ ధాం ధాం" అని అంది.

ఎలుగుబంటి అది విని "అయ్యో! ఇదేమిటో నాకు అర్థం కాలేదు. కానీ ఏదో ప్రమాదం వస్తున్నట్లు మీ ధోరణి చూస్తే కనిపిస్తోంది. పదండి పోదాం!" అంటూ వాటితో పాటు పరిగెత్తింది.

వాటికి ఎదురుగా ఒక నక్క కనిపించింది. ఆ నక్క కూడా వీటిని ఆపి "ఎందుకు పరిగెడుతున్నారు" అని ప్రశ్నించింది.

ఆ మూడూ ఒక్కసారిగా "టప్ టప్ ధాం ధాం" అని అన్నాయి.



అప్పుడు అది కూడా ఏదో ప్రమాదం ముంచుకొని వస్తుందని భావించి, వాటితో పాటు పరిగెత్తింది. ఇంతలో వాటిని చూసిన ఒక తోడేలు, వెంటనే వెళ్లి మృగరాజు సింహానికి ఆ విషయం తెలిపింది. వెంటనే సింహం వచ్చి వాటిని ఆగమంది. సింహం ఎంత అరుస్తున్నా వినకుండా, ఆ జంతువులు అన్నీ అక్కడి నుండి మరో అడవికి పరిగెత్తడం ప్రారంభించాయి. సింహం ఎంత వారించినా అవి ఆగలేదు. ఒక కుందేలు, తోడేలు మాత్రం సింహాన్ని అంటిపెట్టుకొని ఉన్నాయి.

సింహం ఆ కుందేలుతో “ఇదేమిటి కుందేలా? ఈ వేళ ఇవన్నీ ఎందుకు పరిగెడుతున్నాయి? వీటిని ఆపు” అని అంది.

అప్పుడు కుందేలు “ ఓ మృగరాజా! మీరు చెబితేనే అవి వినలేదు. ఇక నా మాటను అవి లెక్క చేస్తాయా!” అని అంది.

“మరి ఇప్పుడు నేను ఏం చేయాలి?” అని అడిగింది సింహం.

“ఏమీలేదు మృగరాజా! మీరు వేగంగా అడ్డదారి గుండా పరిగెత్తి వాటిని కలుసుకొని, ఆ ధ్వని ప్రక్క అడవి నుంచే వస్తున్నదని వాటికి చెప్పండి. అప్పుడు అవన్నీ మీ మాటలను వింటాయి. ఈలోగా నేను వెళ్లి ఆ ధ్వని ఏమిటో, ఎందుకు వస్తుందో తెలుసుకొని వస్తాను” అని వెళ్లిపోయింది.

సింహం వెంటనే అడ్డదారి గుండా పరిగెత్తి ఆ జంతువులను కలుసుకొని వాటితో “ఔను. మీరు చెప్పింది నిజం! ఆ టప్ టప్ ధాం ధాం అనే శబ్దం ఇక్కడ కాదు. ప్రక్క అడవి నుంచే వస్తోంది. మీకు ఈ సంగతి చెప్పేలోపే, మీరు ఆ ధ్వనికి భయపడి పరిగెత్తుకొని వస్తున్నారు. ఆ ప్రక్క అడవికి వెళ్లకండి. మన అడవే సురక్షితమైన ప్రదేశం. అనవసరంగా ఆందోళన చెందకండి!” అని అంది.

అవి సింహం మాటలు విని ఆగిపోయాయి. తర్వాత సింహాన్ని అనుసరించాయి. జంతువులన్నీ సింహం నివాసం వద్దకు చేరుకున్నాయి.

అప్పుడు సింహం "మొదట ఈ శబ్దాన్ని విన్నది ఎవరు?" అని ప్రశ్నించింది.

అప్పుడు కోతి లేచి 'తానేనని' జవాబు చెప్పింది.

వెంటనే సింహం, "కోతి చెప్పిన దానికి మీరు అనవసరంగా భయపడి దాని మాటలను విని "ఇదిగో పులి అంటే అదిగో తోక! అని పరిగెత్తుతున్నారు. నిజంగా ఆ ధ్వని భయంకరమైనది కాదు. నేను మృగరాజుగా చెబుతున్నాను. మీకేం భయం లేదు. మీకు ఏమన్నా అయితే, నా ప్రాణాలు అర్పించైనా మిమ్మల్ని కాపాడుకుంటాను!" అని అంది.

అప్పుడు ఏనుగు, "మృగరాజా! అయితే ఈ కోతి చెప్పింది అబద్ధమేనా?" అని అడిగింది.

"లేదు... లేదు! అది నిజమే చెప్పింది. దేహబలం కన్నా బుద్ధిబలం గొప్ప కదా! అందుకే ఆ సంగతి ఏదో కనుక్కొని రమ్మని నేను తెలివి, ధైర్యంగల మన కుందేలును పంపాను. అదిగో! అది ఇక్కడికి రానే వస్తున్నది. అది చెప్పేది మనం విందాం!" అని అంది.

ఇంతలో కుందేలు అక్కడికి వచ్చి, "మృగరాజా! ఈ కోతి చెప్పింది నిజమే! కానీ ఆ శబ్దం అంత ప్రమాదకరమైనది కాదు. 'టప్ టప్. ఢాం ఢాం' అని ధ్వని రావడం మాత్రం నిజం. వర్షానికి చెట్ల ఆకుల పైన ఆగిన నీరు, క్రిందనున్న ఎండిన ఆకుల మీద పడి, ఆ టప్ టప్ ధ్వని వస్తున్నది. ఆ టప్ టప్ అదే! ఇక 'ఢాం, ఢాం' అంటే, దూరంగా ఆకాశం ఉరుముతోంది. ఆ 'ఢాం ఢాం' అంటే పిడుగుల ధ్వని! ఆ ధ్వనికి, ఈ కోతి ఏదో ప్రమాదం అనుకొని, తాను భయపడి, మనందరిని భయపెట్టింది. అంతే తప్పు, మరి ఏమీలేదు. అదే 'టప్ టప్ ఢాం ఢాం" అని అంది.

వెంటనే కోతి, "మృగరాజా! నేను చాలా పిరికిదానిని! అందుకే నేను భయపడి మీ అందరినీ భయపెట్టాను" అని అంది.

అప్పుడు సింహం, "మనం ఇలాంటి ధ్వని విన్నప్పుడు, మనం భయపడి ఇతరులను భయపెట్టకూడదు. అలా ఎందుకు జరుగుతున్నదో తెలుసుకోవాలి. అంతేగానీ ఏవేవో ఊహించుకొనరాదు. ఇటువంటి వాటికి ధైర్యమే మందు! ఎన్ని ప్రమాదాలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలి. మన పిల్లలకు కూడా ధైర్యం నూరిపోయాలి. నేను ఈ కుందేలుకు ప్రమాదం జరగకుండా దానికి తెలియకుండా ముందు జాగ్రత్తగా, ఒక తోడేలును దానిని అనుసరించమన్నాను. అది ఇంకా రాలేదు!" అని అంది.

ఇంతలో ఆ తోడేలు వచ్చి "మృగరాజా! నేను కూడా ఆ ధ్వనిని చూసి వచ్చాను. మన కుందేలు చెప్పింది అక్షరాలా నిజమే!" అని అంది.

అప్పుడు జంతువులన్నీ ఊపిరి పీల్చుకొని, తమతమ నివాసాలకు వెళ్లాయి!

# సింహం సలహా

భారతి

✆ 98665 90967

***తన స్నేహితుల మధ్య ఉద్రిక్తతను గ్రహించి, సింహం జోక్యం చేసుకుంది. "మిత్రమా! ఏనుగును వెక్కిరించటం మంచిది కాదు. నీ పద్ధతి మార్చుకో! ఇతరుల లోపాలను హేళన చేసి, బాధ పెట్టి నువ్వు ఆనందించటం తప్పు!" అంది సింహం.***

మృగరాజు సింహానికి... కొంగ, ఏనుగు మంచి స్నేహితులు. అవి మూడూ తరచుగా కలుసుకుంటూ ఉండేవి. కొంగ అందర్నీ ఆటపట్టిస్తూ ఉండేది.

ఒకరోజు సింహంతో కొంగ, చెరువు వద్ద ముచ్చట పెడుతుండగా, నీళ్లు తాగటానికి ఏనుగు వచ్చింది.

ఏనుగుకు నల్లటి చర్మం ఉండటం వలన, "హే... కాలియా! కాలియా!" అంటూ పిలిచింది కొంగ.

ఏనుగుకు కోపం వచ్చింది. "నన్ను కాలియా... అంటావా!" అంటూ చెరువులో నీళ్లు తొండంతో తెచ్చి, కొంగ మీద చిమ్మింది. కానీ, కొంగ తప్పించుకుని చెట్టు మీద కూర్చుంది.

కొంగలా తెల్లగా లేనందుకు బాధ పడింది ఏనుగు. అది బాధ పడుతుంటే చూసి, సంతోషించేది కొంగ.

ఇంకోసారి గుహ దగ్గర మృగరాజుతో కొంగ కబుర్లు చెపుతుండగా, ఏనుగు రావటం చూసి, "ఓ... టుంటుం బజ్జీ! టుంటుం బజ్జీ!!" అని పిలిచింది.

ఏనుగు కోపంగా వెళ్లి తొండంతో కొంగ నెత్తిన బాదబోయింది. కొంగ తప్పించుకుని బండ మీద కూర్చుంది. కొంగలా సన్నగా లేనందుకు ఏనుగు విచారించింది. అది చూసి సంబరపడింది కొంగ.

తన స్నేహితుల మధ్య ఉద్రిక్తతను గ్రహించి, సింహం జోక్యం చేసుకుంది. "మిత్రమా! ఏనుగును వెక్కిరించటం మంచిది కాదు. నీ పద్ధతి మార్చుకో! ఇతరుల లోపాలను హేళన చేసి, బాధపెట్టి నువ్వు ఆనందించటం తప్పు!" అంది సింహం.

కానీ, కొంగ తన తీరు మార్చుకోలేదు. తన ముందే మిత్రులు కొంగ, ఏనుగు పోట్లాడుకోవటం సింహం చూడలేకపోయింది. కొంగ స్వభావం ఎలాగైనా మార్చాలనుకుంది.

వెంటనే ఏనుగును ఒంటరిగా పిలిపించి సలహా ఇచ్చింది. ఏనుగుకు సింహం వ్యూహం నచ్చింది.



తెల్లారి – సింహం, ఏనుగు వాగు దగ్గర సంగతులు చెప్పుకుంటుండగా కొంగ వచ్చింది.

అది ఏనుగును చూసి ''హే... కాలియా ! ఎప్పుడు వచ్చావు?'' పలకరించింది.

ఏనుగు నవ్వింది. దానికి కోపం రాలేదు.

“ఓ... టుం టుం బజ్జీ! నీకు కోపం రావటం లేదా?” అడిగింది కొంగ.

“నువ్వు ఇలా ఎగతాళిగా అంటున్నా, ఆలోచిస్తే నిజమేననిపించింది. వాస్తవానికి నేను నల్లగా, లావుగానే ఉన్నాను. ఇక మీదట నీవు ఇలా అన్నా నాకు కోపం రాదు!” అంది శాంతంగా ఏనుగు.

ప్రశాంతంగా ఉండి కొంగకు తనను మళ్లీ అవమానపరిచే అవకాశం ఇవ్వలేదు ఏనుగు. ఏనుగునుంచి స్పందన రాకపోవటంతో దాన్ని అవమానించడం అర్థరహితమని గ్రహించింది కొంగ!

“ఇతరులు మన లోపాలను ఉత్సాహంగా బయటపెట్టినప్పుడు, మనం ఆ లోపాలను అంగీకరిస్తే నిరాశ పడతారు!” అని చెప్పిన సింహం సలహా ఫలించింది.

స్నేహితులు ఇద్దరూ ప్రశాంతంగా ఉండటంతో సింహం సంతోషపడింది!

# దృశ్యం

డా. సుభద్ర వేదుల
✆ +1(669) 2788065

**విశిష్ట అతిథి కథ**

> ***పిల్లల కోసమని ఎంతో ఆలోచించి చేసిన పని ఇది! నాకిట్టమయ్యో, నా సుకం కోసమో సేసినది కాదు. అందుకే ఈ పాలికి మాటాడకుండా ఊరుకో! అన్నీ బాగుంటే వచ్చే ఏడాదికి మళ్ళీ చేయించుకుంటాను, అంతవరకూ నాకు పోయిందేటి.. కళ్లెదురుగా నువ్వున్నావు, మెళ్ళో పసుపుతాదున ఉన్న కొమ్ముంన్నాది!"***

"ఎంత బాగుందో సినిమా, ఎంకటేష్ యాక్టింగ్ సూపరసలా, కదే వరలక్ష్మి? ఆ కుర్రోడు సచ్చిపోయినందుకు కూసింత బాదేసిందనుకో, అయినా మీనావోల్లు కావాలని సంపలేదు కదా ఆడిని." అడుగుతోంది శివాలక్ష్మి తన స్నేహితురాలిని.

వెంకటేష్, మీనా జంటగా నటించిన 'దృశ్యం' సినిమా చూసి వస్తున్నారా స్నేహితురాళ్లిద్దరూ! ఔనన్నట్టు మౌనంగా తల ఊపింది వరలక్ష్మి.

"ఏటే వరాలూ, మాతాడతల్లేవు? ఏటయింది? ఒంట్లో బాగోనేదా? సోడా తాగుదారా?" అని ఆత్రంగా అడిగింది శివాలక్ష్మి.. ఎప్పుడూ గల గలా మాట్లాడే స్నేహితురాలు ఆ రోజు ముభావంగా ఉండడం చూసి!

"వద్దెహే, నేను బాగానే ఉన్నాను, పద ఎళదారి, బస్ అందదు లేకపోతే" అంటూ వేగంగా అడుగులు వేసింది వరలక్ష్మి.

బస్సు వేగాన్ని మించిన ఆలోచనలు వరలక్ష్మి మనసులో! సినిమా చూసినప్పటినించీ మరీ ఎక్కువయ్యాయి. అందుకే మౌనంగా కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చుంది. స్నేహితురాలేమీ మాట్లాడకపోయేసరికి సీటుకి ఆనుకుని కునుకు తియ్యసాగింది శివాలక్ష్మి.

★★★

వారిద్దరిదీ అమలాపురానికి దగ్గరలో ఉన్న అప్పనపల్లి అనే ఊరి పక్కనున్న పల్లెటూరు. ఇద్దరికీ దూరపు చుట్టరికం ఉన్నా, స్నేహమే ఎక్కువ. ఇద్దరూ చేలల్లో పనులకెళతారు. శివాలక్ష్మి భర్త సత్తిబాబు దింపులు తీయిస్తాడు, తీస్తాడు.. అంటే కొబ్బరి

కాయలు దింపించడం, అవన్నీ లెక్క పెట్టి జాగ్రత్తగా యజమానులకి అప్పచెప్పటం, వారిచ్చినది పుచ్చుకోవడం అతని ఉద్యోగం! సత్తిబాబు, శివాలక్ష్మికి ఒక కొడుకు, కూతురు.

వరలక్ష్మి భర్త వీర్రాజుకి అప్పనపల్లి వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర కొబ్బరికాయలు, పూలు, పళ్ళూ అమ్మే కొట్టుంది. వరలక్ష్మీ, వీర్రాజులకి ముగ్గురు ఆడపిల్లలు, వీర్రాజుకింకా కొడుకు కావాలని ఆశ! 'ఉన్న వాళ్ళు చాలు, వాళ్ళు ఆడైనా, మగైనా బాగా చదువు చెప్పించి మంచి ఇళ్ళల్లో పెళ్ళిళ్ళు చెయ్యాలని' వరలక్ష్మి కోరిక! అందుకే వాళ్లని స్కూల్లో చదివిస్తుంది. వాళ్ళు చక్కగా యాస లేకుండా మాట్లాడుతూ, బాగా చదువుకుంటున్నందుకు ఆమెకెంతో సంతోషంగా ఉంటుంది. చిన్నదో, పెద్దదో, ఏదో ఒక పని చేసుకుంటూ వాళ్ళు తమ కాళ్ళ మీద తాము నిలబడాలని ఆమె ఆశ!



వాళ్ళిద్దరూ ఎప్పుడూ జంటగానే కలిసి తిరుగుతారు, కలిసే పనిలోకి వెళతారు.

ఇద్దరివీ చిన్న ఇళ్ళే, ఈ మధ్యనే తాటాకు కప్పులు తీసి, సగం వరకూ పెంకులేసుకున్నారు. వెనకొక చిన్న వంటగదీ, దానినానుకుని ముందుకో గదీ, చూరు బాగా కిందకి దిగినచోట గుమ్మానికి అటూ, ఇటూ చిన్న అరుగులు! వెనక వైపు చిన్న పెరడూ, దాంట్లోనే కొబ్బరాకులతో కట్టిన స్నానాలగదీ. వానాకాలం కాలవ దగ్గరకెళ్ళి స్నానాలు చెయ్యడం కష్టంగా ఉందని ఈ మధ్యనే అవి కట్టుకున్నారు. వెనక చిన్న పెరడు కలిపే ఉంచుకున్నారు.

రోజూ పొద్దున్నే ఇంటికి కావలసిన నీళ్ళు, దగ్గరలో ఉన్న కాలవకెళ్ళి తెచ్చుకుంటారు ఇద్దరూ! తెచ్చి గోలేల్లో పోసుకుని, బిందెల్లో తెచ్చుకుని అవే వాడుకుంటారు వంటకీ, మిగతా అవసరాలకి! బట్టలు కాలవగట్టు దగ్గరే ఉతుక్కుని తెచ్చి ఇంటి వెనక తీగమీద ఆరేసుకుంటారు.

ఊడుపులూ, కోతలూ, కలుపు తీయడాలూ, ఎరువు చల్లడాలూ లాంటి పంటచేల పనులు సంవత్సరం పొడవునా ఉండవు. అందులోనూ చాలా మటుకు పంటచేలని రొయ్యల చెరువులుగా మార్చేశాకా.. ఆ పనులు మరీ తగ్గిపోయాయి. అందుకని అలాంటి పనుల్లేని సమయ్యాల్లో, వీళ్ళు నాలుగిళ్ళల్లో కారాలూ, పసుపూ లాంటివి దంచడాలూ, చింతపండు గింజలు తీయడాలూ, వడియాలూ, వరుగులూ లాంటివి పెట్టి, వాటినీ.., కొబ్బరి మట్టలని సేకరించి వాటిల్లోంచి ఈనుపుల్లలు చీరి కొబ్బరి చీపుళ్ళు తయారు చేసి, అవి అమ్మడమూ లాంటి పనులేవో ఒకటి చేస్తూనే ఉంటారు. దగ్గరలో ఓ మాదిరి టవున్ మామిడికుదురులో ఈ మధ్యనే వచ్చిన ఒక పెద్ద పచారీకొట్టుకి పప్పులూ, బియ్యమూ అవీ శుభ్రం చేసే పని, కొత్తగా వారు ఒప్పుకున్న పనుల్లో ఒకటి! ఆ కొట్టు కుర్రాడు వచ్చి తూకం వేసిన సరుకులు ఇచ్చి వెళతారు. సాయంత్రం మళ్ళీ తీసుకెళ్ళేడప్పుడు తూకం వేసి తీసుకెళతాడు. ఇలా నాలుగు రకాలైన పనులు వెతుక్కుని మరీ చేసి ఇంటి కోసమే అహరహమూ శ్రమ పడుతూ ఉంటారు. ఎందుకంటే వారి భర్తల సంపాదనెంతో వారికి తెలియనే తెలీదూ.. అంటే దానిక్కారణం దాంట్లో సింహభాగం బ్రాకెట్ లేదా పేకాటకీ, కల్లు దుకాణాన్ని పోషించడానికే సరిపోతుంది. వాళ్ళకిష్టమైనంత ఇస్తారు ఇంట్లోకి, అంతే!

"ఆడిని మార్చేదానికి నా వల్ల కాదు, ఆ పాటిదానికుత్తపున్యాన గొడవెందుకు? రోజూ పిల్లల ముందు" అని వరలక్ష్మి గట్టిగా ఎప్పుడూ మాట్లాడదు. కానీ శివాలక్ష్మి మాత్రం ఊరుకోలేక నాలుగురోజులకొకసారి అరిచి, గొడవపడి, దెబ్బలూ, తన్నులూ తింటుంది. తెల్లారేసరికి కాలవలోకొచ్చే కొత్తనీరులా, ఆ పాత నీరుని మర్చిపోతుంది. ఆ పేటలోని చాలా ఇళ్ళల్లో ఇదే పరిస్థితి!

ఆ పేట ఆడవాళ్ళందరిలోనూ కాస్త చదువుకున్నది వరలక్ష్మి కావడాన, ఆమే కావలసిన సలహాలు చెప్తూ ఉంటుంది. 'నెలకొక వంద రూపాయల పొదుపు' అని ఒక ఆలోచన చేసి అందరినీ కాస్తో కూస్తో దాచుకుని, చిట్టీ పాడుకుని అవసరానికి కాసైనా డబ్బు వెసులుబాటుండేలా చూస్తుంది. ఆ డబ్బుని తీసుకెళ్ళి మామిడికుదురులోని టీచర్ అరుణమ్మ దగ్గర దాస్తుంది. నెల నెలా వెళ్ళి తెచ్చుకుని పాట పాడినవాళ్ళకి ఇస్తుంది. ఇలాంటివన్నీ ఎంతో బాగా చేస్తుందనే అందరికీ వరాలంటే అభిమానం.

★★★

మర్నాడు భర్తలు పనుల్లోకీ, పిల్లలు స్కూళ్ళకీ వెళ్ళాకా, భోజనం చేసి ఒంటిగంటవేళ వరలక్ష్మి ఇంటికి వచ్చింది శివాలక్ష్మి.

"ఏటే వరాలూ, గుడ్ల పులుసెట్టావా? ఇల్లంతా ఓ ఘుమ ఘుమలాడిపోతాంది!" అంది ముక్కు ఎగబీలుస్తూ!

చూరు నీడలో కూర్చుని మట్టని చీలుస్తున్న వరలక్ష్మి మాట్లాడలేదు. పక్కన కూర్చోమన్నట్టుగా సైగ చేసింది.

"నీకేటయిందసలు? మూడురోజుల బట్టీ మాటానేదు, పలుకూ నేదు, ఎంత అడిగినా మాటాడవు, ఏటయింది?" పక్కనే కూర్చుంటూ అంది.

"ఏమీ లేదొలే సివాలూ, మనసెందుకో బాగోనేదు చాన్నాళ్ళబట్టీ!" అంది రవ్వంత ఆవేదనగా.

'నాతో సెప్పకూడదా? సిటికెలో తీరవలేను గానీ, ఎదైనా సలహా సెప్పగలనేమో! నీకిట్టం నేకపోతే వద్దులే, అట్టీపెట్టేసుకో" అంది నవ్వుతూ.

“నీగ్గాక ఇంకొకరికి సెప్పుకోగలనా? అయినా ఇషయమే అట్టాంటిది” అంది భారంగా! ఒక్క నిమిషం ఆగి తానే మళ్ళీ.. “వారం, పది రోజులబట్టీ పెద్దది ఒక్క పూట కూడా సరిగ్గా అన్నం తినడమే మానేసింది, మారడిగితే కడుపునొస్తోంది, వద్దంటంది!” అంది ఎటో చూస్తూ.

“అంతేనా, నేనింకా ఏటో అయిపోనాదనుకుని మా సెడ్డ భయపడిపోయాను.. నీ ఆలకం సూసి! రేపు అది స్కూల్ నించి రాగానే డాక్టరమ్మ కాడికి తీసుకెళదారి, నువ్వేం బెంగ పెట్టుకోమాక!” అంది శివాలక్ష్మి అనునయంగా.

“హు” అని నిట్టూరుస్తూ “అసలు సంగతి నీకర్ధమవతల్లేదు శివమ్మా, అది కావాలని బోయనం మానేసి పేణం మీదకి తెచ్చుకుంటాంది” అంది వరాలు .

“కావాలనా? అదేటి? ఎందుకు?” అనడిగింది ఆశ్చర్యంగా శివాలక్ష్మి.

అప్పటికే వరలక్ష్మి వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది. ఆమెనలా చూసేసరికి శివాలక్ష్మికి కంగారు వేసింది. రెండు నిమిషాల పాటు ఏడుస్తూనే ఉంది వరలక్ష్మి.

ఆమె వీపు మీద చెయ్యి వేసి “ఊరుకో, ఏదో కడుపు మందం సేసుంటది, దానికే ఇంత గాభరా పడతావా?” అంటూ అనునయించసాగింది శివాలక్ష్మి.

ఏడుపు ఉధృతం తగ్గాకా, కళ్ళనీళ్ళని పైట చెంగుతో తుడుచుకుంటూ, ఎక్కిళ్ళ మధ్యలో చెప్పింది నెమ్మదిగా అసలు విషయం. “అన్నం మాములుగా, కడుపుకి సాలినంత తింటే బయటకు రోజూ ఎల్లాల్సొస్తదని దాని బాధ, అందుకని కావాలని కడుపు మాడ్చుకుంటాంది” అంటూ.

ఒక్క క్షణం తాను విన్నది నిజమో, కాదో అర్ధం కాలేదు శివాలక్ష్మికి. అర్ధం అయ్యాకా ఆశ్చర్యంతో మాట రాలేదు ఆమెకి! ఆ పేటలోని వారెవ్వరికీ ఇళ్ళల్లో టాయిలెట్లు లేవు. వారందరూ ఊరి చివర ఉన్న బీడులాంటి బహిర్భూమికి, లేదంటే బాగా దూరంగా కాలవ దగ్గరకో వెళ్ళవలసిందే. అది అందరికీ, ముఖ్యంగా ఆడవారికి అసౌకర్యంగా ఉంటుంది. వరలక్ష్మి, శివాలక్ష్మి లాంటి వారు చిన్నప్పటి నించీ అలవాటు గనక, చాలా చీకటివేళనో లేదా సాయంత్రం పొద్దుపోయాకో వెళ్తూ ఉంటారు. బాగా చిన్నపిల్లలకి పరవాలేదు కానీ, యుక్తవయస్సులోకి అడుగిడుతూ, చదువుకుంటూ, ఇప్పుడిప్పుడే ప్రపంచాన్ని కొద్ది కొద్దిగా తెలుసుకుంటున్న ఆడపిల్లలకి అదెంతో అవమానకరంగానూ, సిగ్గుగానూ ఉంటుంది.

వరలక్ష్మి పెద్దకూతురు.. శాంతి పదోక్లాసులోకి వచ్చింది. ఆ అమ్మాయికీ, తన తోటి పిల్లలకీ ఇదెంతో భరించరానిదిగా ఉంది. ఈ మధ్య ఇంచుమించు రోజూ ఆ విషయం తల్లితో చెప్తూనే ఉంది! ఆ బయలు ప్రదేశం దూరం కావడాన ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలు కలిసి వెళతారు. అది చూసి తరచూ వీరి వెనకే చేరి, అసభ్యంగా మాట్లాడుతూ అవమానపరిచే కుర్రకారు వెనకపడుతుంటే, అది మరింత కంటకప్రాయమైపోసాగింది వారికి!

భారత దేశం సాధిస్తున్న ప్రగతి, అభివృద్ధి అవీ పాఠాల్లో చదువుకుంటూ, టీచర్ల నించీ తెలుసుకుంటూ ఉన్న ఆ పిల్లలకి తామిలా కనీస సౌకర్యాలు కూడా లేకుండా ఎలా ఉన్నాము.. అనేది అర్ధం కాని ప్రశ్నే!

మొదట్లో కూతురు చెప్పిన మాటలు పెద్దగా పట్టించుకోలేదు వరమ్మ. “ఎహే, సాయంత్రమో, తెల్లారు ఝామునో గుట్టు సప్పుడు కాకుండా ఎల్లండి, ఊరంతా ఇనబడేలా టముకేసుకునెళ్తారా ఏటి.. అందరికీ తెలీడానికి!” అని కసిరింది.

దానికి శాంతి "అమ్మా, రోజూ అలా బయటకి వెళ్ళాలంటే మా సెడ్డ సిరాకమ్మా, పైగా అలా బయటకెళితే జబ్బులొచ్చే ప్రమాదం కూడా ఉందట, టీచరమ్మ సెప్పింది. దానికి తోడు మన ఊరి కుర్రోళ్ళు నిన్న రాత్రి నేనూ, గంగా లాంతర్ తీసుకుని వెళుతూండగా వెనకాలే రావడం మొదలెట్టారు. 'లండన్ ప్రయాణమా? మాట్లాడరేం దొరసానులూ?' అంటూ చిరాగ్గా మాట్లాడారు. రామయ్య మావయ్య ఎదురొచ్చి ఇద్దరినీ బాగా తిట్టేసరికి వెళ్ళిపోయారు. అయినా సరే మేము వెనక్కి వచ్చేశాము, ఇంకెవరైనా కనబడతారేమో అన్న భయంతో. మనింట్లోనే టాయిలెట్ ఉంటే ఈ బాధలుండవు కదమ్మా!" అంది. కళ్ళ నిండా నీళ్ళు ఆ పిల్లకి అప్పటికే...!

"టాయిలెట్టా? అంటే ఏంటే?" అంది వరమ్మ.

"టాయిలెట్ అంటే మరుగుదొడ్డమ్మా, టీవీల్లో కూడా సూపిత్తన్నారు కదా, అందరూ ఇంట్లోనే కట్టుకోవాలని, అదే" అంది శాంతి.

ప్రముఖ హిందీ సినిమా నటి విద్యాబాలన్ ( ఆమె పేరు వారికి తెలీదు ) నటించిన ప్రకటనలు గుర్తొచ్చాయి వరలక్ష్మికి.

"నిజమే కానీ, ఇప్పటికిప్పుడు అంత డబ్బంటే ఎలా?" అనుకుంది.

కానీ ఆ తర్వాత ఆ పిల్లలో వచ్చిన మార్పు కన్నతల్లిగా ఆమె హృదయాన్ని మెలిపెట్టింది. రోజూ రోజుకీ నీరస పడడం తెలుస్తోంది. కడుపుకి సరిపడా తినకపోయేసరికి, అప్పుడప్పుడు కడుపు నొప్పి వస్తోంది కూడా. అవన్నీ చూస్తుంటే సుడులు తిరిగిన ఆ బాధే ఈ జడికి కారణం!

"మొదట నేనూ సెప్పి సూశాను. నాలుగు నాళ్ళుంటాది, ఆ తర్వాత అలవాటయిపోద్దిలే అనుకున్నాను కానీ తిండే మానేస్తుందనుకోలేదు శివా! నీరసమొచ్చుద్ది, నీకు పాణమని గుడ్లేసి వాటంగా పులుసొండానంటే, ఒక్క ముద్ద తిని గంజి నీళ్ళు తాగేసి లెగిసిపోయింది" అంది.

ఈ బాధలు శివాలక్ష్మికి తెలియనివి కావు, కానీ సమస్యని సాధించే మార్గమే ఆమెకీ తట్టడం లేదు, ఆ చుట్టుపక్కల చిన్న ఊర్లన్నింటిలోనూ చాలామందికి ఉన్న సమస్యే అది, కానీ చాలా రోజుల వరకూ అదొక సమస్య అని వారికి తెలియలేదు. ఆ మాటకొస్తే పెద్దోరిళ్ళల్లో కూడా ఈ మధ్యనే పాయిఖానాలు కట్టించుకున్నారు.

"ఇక చిన్నోళ్లిద్దరూ కూడా రేపో మాపో పెద్దోళ్ళవుతారు. ఈళ్ళందరితోనూ ఏం కట్టాలు పడాలో ఏటో, అరదమవుతల్లేదనుకో" అంది వరలక్ష్మి దిగులుగా.

ఇద్దరూ కాసేపు మౌనంగా ఉండిపోయారు. "నేనోపాలి సెప్పి సూత్తాలే, తక్కిన పిల్లలతో జతగా పొద్దున్నే ఎల్లి రమ్మని" అంది వరలక్ష్మిని సముదాయిస్తున్నట్టు.

మౌనంగా, పెరట్లో స్నానాలగదికి నాలుగు అడుగుల దూరంలో శివాలక్ష్మి ఇంటి భాగంలో ఉన్న కొబ్బరి చెట్టుకేసే చూస్తూ పుల్లలు తీయసాగింది వరలక్ష్మి. ఇంతలోనే పరుగు, పరుగున వచ్చారు వరలక్ష్మి రెండో కూతురూ, శివాలక్ష్మి కూతురూ.

"అమ్మా, శాంతక్క స్కూల్లో కళ్ళు తిరిగి పడిపోయింది, నిన్ను టీచరమ్మ బేగే కేకేసుకురమ్మంది" అంటూ. ఎక్కడి పని అక్కడ వదిలేసి స్కూల్‌కి పరిగెత్తారు ఇద్దరూ. వాళ్ళు వెళ్ళేసరికి స్కూల్లో నేలబెంచీ మీద తోటకూర కాడలా వాలి, పడుకున్న కూతుర్ని చూడగానే వరలక్ష్మికే కాదు, శివాలక్ష్మికీ కళ్ళ నీళ్ళు తిరిగాయి.

"ఎప్పటిలాకాకుండా ఈ మధ్య శాంతి బాగా డల్‌గా ఉంటోంది, మునుపటి హుషారు లేదు పిల్లలో! ఒంట్లో నలతగా ఉందేమో అనుకున్నాను కానీ, ఈ రోజు మధ్యాహ్నం ఉన్నట్టుండి కళ్ళు తిరిగి పడిపోయింది, నీళ్ళు చల్లితే తేరుకుని లేచింది కానీ, చాలా నీరసంగా ఉంది. ఒకసారి డాక్టర్ దగ్గరకి తీసుకెళితే మంచిది!" అంది టీచరమ్మ.

ఇద్దరూ కలిసి పిల్లని రిక్షా ఎక్కించి ఇంటికి తీసుకొచ్చారు. చాప వేసి పడుకోబెట్టింది శాంతిని! నీరసానికి నిద్రపోయింది. నిద్రపోయే ముందు కూడా తినడానికేమీ వద్దంది.

"కొంచెం టీ ఉంటే ఇవ్వమ్మా" అంది.

"ఒద్దమ్మా, పాలు తాగు, టీలో బలం ఏటున్నది?" అంటూ తనవాటా టీకి ఉంచుకున్న పాలు కూడా పోసి వేడిగా తాగించింది. అవి తాగి నిద్రపోయింది శాంతి.

"సూశావా శివాలూ, ఇదీ దీని వరస, ఎట్టా ఉండే పిల్ల ఎలా అయిపోయిందో సూడు" అంది వరమ్మ దిగులుగా పీక్కుపోయిన శాంతి చెంపలు నిమురుతూ!

అంతవరకూ విషయాన్ని కాస్త తేలిగ్గా తీసుకున్న వాళ్ళిద్దరికీ ఆ చిన్నపిల్ల పడుతున్న బాధ బాగా అర్థం అయింది. కానీ ఏం చెయ్యాలో తెలియని పరిస్థితి.

★★★

మరో వారం రోజుల తర్వాత ఎప్పుడూ లేంది వరలక్ష్మి ఇంట్లోంచి వీర్రాజు కేకలు వినిపిస్తుంటే శివాలక్ష్మి ఆశ్చర్యపోయింది. గబగబా పరిగెత్తింది వరలక్ష్మి ఇంటివైపు.

"ఏటీ? ఇంట్లో మరుగుదొడ్డి కట్టిత్తావా? దానికోసం తాళిబొట్టు అమ్మేశావా? పైగా ఈ సారి చిట్టీ పాడేసుకున్నావా? నీ కూతుళ్ళు మహారాణీలా? అందరితో పాటు ఊరవతలకి ఎల్లలేరా? మతుండే మాతాడతన్నావా? అహ, అసలు మతుందా.. పోయిందా? నీ బుద్దేమైనా గాడిదలు కాసిందా? " అంటూ తిట్ల పురాణం విప్పుతున్నాడు వీర్రాజు.

"అసలు నిచ్చేపంలాంటి తానాల గది ఉండగానే, అది వల్లకాదు, అక్కడ తానమాడను అని నీ పెద్దకూతురు అన్నప్పుడే రెండు తగిలించాల్సింది.. ఈ టెక్కు ఏషాలు లేకపోను! ఆవిడ గారడగ్గానే వంటగదిలో తానాలాడమన్నావు కదూ! ముందది, ఇప్పుడిది. రేపు ఈ పాక నాకు నచ్చలేదు, డాబా ఏసేసి, నాకో పెషల్ గది కావాలంటది, అప్పుడెక్కడనించొచ్చు? బుర్రుందా నీకు? పైగా తాళిబొట్టమ్ముతావంటే? సిగ్గునేదూ, నేను ఉన్నాననుకున్నావా? పోయాననుకున్నావా?" కోపంతో మాటలు రావడం లేదు వీర్రాజుకి. అతని ముఖం రోషంతో అదురుతోంది, వీలుంటే వరలక్ష్మిని రెండు వేసేట్టు కనపడుతున్నాడు.

అతనన్న మాటలన్నీ ఓపిగ్గా వింది వరలక్ష్మి. "తాళిబొట్టు తాకట్టెట్టడం మనకేమీ కొత్త కాదు, కిందటిపాలు అయ్యగోరు పేకాటలో నిలువుదోపిడీకొస్తే సుబ్బయ్యగారి దగ్గర తాలిబొట్టు తాకట్టెట్టే డబ్బు కట్టాము, అప్పుడూ నా మెళ్ళో పసుపు కొమ్మే కట్టుకున్నాను. ఆ ఇషయం నువ్వు మరిసిపోయావేమో, నేను మరిసిపోలేదు. ఇప్పుడూ అంతే!" అంది విసురుగా.

"సాల్లే ఎదవమొకందానా, సేసిందతా సేసి ఎదురు సమాదానాలు సెప్తున్నావా? మతోయిందే నీకు? ఓ కొడుకుని కనడం తెల్దు గానీ, ఈ ముగ్గురినీ ఎనకేసుకు రావడం బాగా తెల్సు! దొడ్డంటే.. దొడ్డి! పైగా 'టాయిలెట్టూ' అంటో దానికో ఇంగ్లీసు

పేరు. ఊరికే వస్తుందా? ఎన్నేలు కావాలో తెల్సా అసలు? అసలే ఎదవిచ్చాడే నీకీ సలహా? ముందేమో ఆళ్ళ సదువులన్నావు, ఇప్పుడిదా?" అంటూ మీద మీదకి రాబోతున్న వాడిని శివాలక్ష్మి ఆపబోయింది.

"ఊరుకో అన్నయ్యా, వరాలు ఏం చేసినా ఆలోచించే చేస్తది కదా, ఉత్తిపున్నేన ఎందుకు గొడవ?" అంది. "నువ్వూరుకో సివాలమ్మా, దాన్నెనకేసుకురాకు! ఈ రోజు అదో, నేనో తేలిపోవాల. ఎప్పుడైనా నేనేమన్నా ఎదురు మాటాడిందా? ఇప్పుడిలాంటి పని సేస్తదా! మొగుడంటే లక్షముందా దానికి,, తింగరిదా?" అంటూ ధుమ ధుమ లాడసాగాడు.

"ఏటన్నావే? నాకోసమోపాలి తాకట్టెట్టావా? అదేదో పొరపాటున అన్నీ ఓడిపోతే, మరో దారిలేక, అలా జరిగింది. దాన్ని ఇప్పుడు పైకి తెచ్చి రాద్ధాంతం సేస్తన్నావా? సంసారంలో గుట్టూ, రోగానికి రట్టూ ఉండాలనే ఇషయమూ తెలీదేటే నీకు? తెలిసుంటే మొగుడ్నిలా నడి ఈదిలో ఎడతావా? అయినా తాకట్టెట్టడవూ.. అమ్ముకోడమూ ఒకటేనా?" అన్నాడు కోపంగా.

"అదే నేనూ అంటున్నాను. పిల్లల కోసమని ఎంతో ఆలోచించి చేసిన పని ఇది! నాకిట్టమయ్యో, నా సుకం కోసమో సేసినది కాదు. అందుకే ఈ పాలికి మాటాడకుండా ఊరుకో! అన్నీ బాగుంటే వచ్చే ఏడాదికి మళ్ళీ చేయించుకుంటాను, అంతవరకూ నాకు పోయిందేటి.. కల్లెదురుగా నువ్వున్నావు, మెళ్ళో పసుపుతాడున ఉన్న కొమ్ము న్నాది!" అంది వరలక్ష్మి స్థిరంగా.

ఆమె వాలకం చూస్తుంటే వీర్రాజుకి మరింత కోపం తన్నుకు వస్తోంది. తనకొక్క మాటైనా చెప్పలేదని కొంతా.., ఇప్పుడు కూడా తాను చేసిన పనికి క్షమాపణ అడగకపోగా, ఎదురు తిరిగి తనకే సమాధానం చెప్తోందని కొంతా, వీటివల్ల అతని కోపం రెట్టింపైంది.

"మొండికెత్తినదాన్ని మొగుడేం సేత్తాడు.. అన్న సామెత నీకులాంటోళ్ళని సూసే పుట్టిందే! పిల్లలంట.. పిల్లలు, ఎప్పుడూ ఆళ్ళ ఊసే గానీ, మొగుడి మాట ఇందామనే జ్ఞానం లేదే నీకు? అందుకే ఇలా తయారయ్యావు, నీ.." అని ఇంకా ఏదో అనబోతుంటే..

అప్పటి వరకూ ఎంతో సహనంతో వింటున్న వరలక్ష్మి ఒక్కసారి గట్టిగా అరిచింది. "ఇక సాల్లేవయ్యా, ఆపు, పెద్ద సెప్పోచ్చాడు మొనగాడు! నా ఇట్టం, నా పిల్లల కోసం నేనేదైనా సేత్తాను, నీలా సంపాదనంతా తాగుళ్ళకీ, పేకాటకీ తగలెయ్యడం లేదు కదా, ఇంకెందుకా గోల? ఈడొచ్చిన, సదూకుంటున్న పిల్లలు రోజూ బయటకెల్లడానికెంత ఇబ్బంది పడతన్నారో నీకేం తెలుసు? ఏనాడైనా అడిగావా? ఆలోసించావా? మూడు వారాలుగా తిండి తినడం లేదు శాంతి, నువ్వు సూశావా? సరిపడా తింటే రోజూ బయటకు ఎల్లాల్సి వస్తాదని, నీళ్ళూ, గంజీ తాగి కడుపు నింపుకుంటాంది బిడ్డ! ఇది ఇంటే నీకెలాగుందో నాకు తెల్దు గానీ, నా మనసంతా పీకేసినట్టయింది. ఎన్నిసార్లు ఏడ్చానో, శివాలమ్మని అడుగు సెప్తుంది, ఓ రంకెలేస్తున్నాడు." ఆయాసంతో ఒక్క క్షణం ఆగింది.

అన్నీ విన్నా ఆమె మాటలోని నిజాన్ని ఒప్పుకోనివ్వని అహం అతనిలో.. "ఐతే ఏంటే? మహా నీకే ఉన్నారా వయసొచ్చిన పిల్లలు! మిగతావోళ్ళకి లేనిది ఈవిడగారికేటంట.. నిక్కూ, టెక్కూ కాకపోతే!" అన్నాడు చిరాగ్గా.

"ఏటన్నావు? మిగతావోళ్ళకి లేదా? ఓ పాలెల్లి ఆ పిల్లల్నో, ఆళ్ళ అమ్మల్నో అడిగి వత్తే తెలుస్తది, ఆళ్ళు పడే ఇబ్బంది. అదే కట్టమనుకుంటే, ఎనక బడుతూ పోకిరీ నాయాళ్ళు! మరీ పొద్దున్నేనో, రాత్రో ఎల్దారంటే పామే ఉంటదో, పురుగే ఉంటదో అనో బయం. అది సాలనట్టు ఈ మద్దెన పెతీ వాడూ ఓ సెల్‌ఫోనట్టుకు ఇష్టం వచ్చిన సోటల్లా ఫోటోలూ, విడియోలూ

తీసెయ్యడమే. పిల్లలు బయటకెళ్ళినప్పుడో, కాలవ దగ్గరకెళ్ళినపుడో.. ఏ పోరంబోకు యెదవో, ఓ ఫోటోవో, వీడియోవో తీసి ఆ తర్వాత "దృశ్యం" సినిమాలో సూపినట్టు పిల్లల్ని బెదిరిస్తే? ఆ ఫోటోలూ అయ్యీ బయటెడితే, నలుగురికీ సూపెడితే సిన్నపిల్లలేటయిపోతారు? బలవంతాన పళ్ళకొట్లోనూ, సంబరంగా సారా కొట్లోనూ కూకునే నీకు పిల్లలని సూసుకునే ఇషయమే పట్టదు? ఎద్దైనా ఐతే ఆ సినిమాలో ఎంకటేష్‌లా కాపాడగలవా?" ఎఱ్ఱబడిన ముఖంతో రోషంగా అడిగింది భర్తని.

"అది సినిమాయే అని తీసిపారేసేలా లేదు, నిజంగా జీయితాన్ని సూసినట్టుంది. మూడు వారాలుగా కడుపునిండా తిండి తినని పిల్లని సూసే బాదపడతన్న. నాకు ఆ సినిమా సూసినప్పుడు పిల్లలకి ఎన్ని రకాల పెమాదాలు జరగొచ్చో తెలిసింది. ఎదుగుతున్న పిల్లలని, ఆళ్ళు ఆడైనా, మొగైనా ఎంత జాగ్రత్తగా, సెద్దగా సూసుకోవాలో ఎంత బాగా సూపెట్టారో తెలుసా? అందులో ఆడపిల్లలని మరీ కంటికి రెప్పల్లా సూసుకోవాలి అని అర్ధం అయింది. అందుకే దాని బాద సూడలేక వెంటనే టీచర్ అరుణమ్మ దగ్గరకెళ్ళి కావలసిన రొక్కం అమరించుకొచ్చాను. అరుణమ్మ సెప్పింది 'రేపు పంచమి మంచిదంట', మేస్త్రీ నారాయడన్న వచ్చి పని మొదలెడతాడు. సిమెంటూ, ఇసకా, మిగతాయన్నీ ఆయన తెత్తాడు, మనల్ని పైన పరవడానికి రేకులు తెచ్చుకోమన్నాడు. రేపు పొద్దున్నే నువ్వు మామిడికుదురెళ్ళి తెచ్చిపెట్టు!" అంది స్థిరంగా.

ఆమె మాటలు పూర్తిగా విని అప్పటికి మెత్తబడ్డ వీర్రాజు, "రేకులెందుకే, గోడలంటన్నావు, తలుపుంటది కదా, సాలదా? పైన కప్పు మానేస్తే కూసింత డబ్బు మిగులుద్ది కదా?" అన్నాడు.

"సాలదు, కప్పెయ్యాల్సిందే, సెప్పానుగా, ఈ ఒక్కపాలికీ నా మాటకి అడ్డు సెప్పకు, సక్కగా పై కప్పు ఏయిద్దారి. అయినాయన్నీ మేస్త్రీ సూసుకుంటాడులే, మనకెందుకు? నువ్వు మాత్రం ఈపాలికి నా మాట కాదనకుండా రేకులు పట్రా" అంది వరలక్ష్మి.

ఇంట్లో స్నానాలకీ, వాటికీ తమకంటూ సొంత టాయిలెట్ ఉండాలని పిల్లల ముందూ, శివాలక్ష్మి ముందూ వీర్రాజుకి గట్టిగా చెప్పిన వరలక్ష్మి.. పైకప్పు కోసం తను ఎందుకంత పట్టుపడుతోందో మాత్రం గట్టిగా చెప్పలేకపోయింది. దానిక్కారణం ఆవిడకీ, పెద్ద కూతురుకీ మాత్రమే తెలుసు. ఆమెని విపరీతంగా కలచివేసిన ఆ విషయం ఎవరికీ చెప్పుకోలేనిది, ముఖ్యంగా భర్త వీర్రాజుకీ, స్నేహితురాలు శివాలక్ష్మికీ అసలు చెప్పుకోలేదు.

దాదాపు రెండు నెలల క్రితం ఓరోజు..

"అమ్మా, నేను తానాల గదిలోకి ఎల్లనమ్మా, నీ వొంటంతా అయిపోయాకా రెండు తలుపులూ గడెట్టుకుని వంటింట్లోనే స్నానం చేస్తాను" అంది శాంతి.

"అదేటే? తానాలగది బాగానే ఉంది కదా, మొన్నే మీ నాన్న తడికె గట్టిగా, దగ్గిరగా అల్లి మరీ బిగించాడు,

ఇంతలో కేటయింది?" అంది

"మరి, ఏటంటే" అంటూ నసగసాగింది శాంతి.

"ఏటే? ఆ నీళ్ళు నమలడం? నాంచుడాపి అసలు విషయం సెప్పు" అంది

"మొన్న పొద్దున్న నేను పాట పాడుకుంటూ స్నానానికి వెళ్లబోయానా.. కోయిల కూత విని పైకి సూస్తే, అత్తమ్మా వాళ్ళింట్లో ఉన్న కొబ్బరి సెట్టు మీద సత్తిబాబు మావయ్య కనిపించాడు, నేనేమీ అడక్కుండానే.. 'దింపు తియ్యాలి కదా, కాయలు ఎలా ఉన్నాయో.. సూద్దామని ఎక్కానే, దిగుతాలే! నువ్వు తానమాడడానికొచ్చావుగా' అంటూ అంటూ అదోరకంగా నవ్వాడు. ఎప్పుడూ లేంది మావయ్యనలా సూత్తే ఎందుకో తెలీద గానీ భయమేసిందమ్మా! అప్పటినించీ ఒకటికి నాలుగుసార్లు చుట్టూ సూసి మరీ వెళ్తున్నాను" అంది భయంగా.

ఒక్క క్షణం కర్రాటలా నిలబడిపోయింది వరలక్ష్మి. 'తమ పిల్ల పెద్దదయిందని ఇంట్లో వారికంటే, ఊరివారికే ముందు తెలుస్తుంది' అన్న ఏదో సినిమాలోని డైలాగ్ అనుకోకుండానే గుర్తొచ్చింది. భయంతో ఒళ్ళు గగుర్పొడిచింది.

"అలాగా? నిజమేనంటే? అలాగైతే నువ్వూ, సెల్లీ కూడా రేపటినించీ వంటగదిలోనే తానం సెయ్యండి,

తానాలగది కాడికెల్లొద్దు." అంది వెంటనే! అది మాత్రమే అనగలిగింది.

అందుకే రెండు నెలలనించీ వీర్రాజు వద్దన్నా, విసుక్కున్నా లెక్కచెయ్యలేదు, ఆ మాట చెప్తున్నప్పుడు శాంతి కళ్ళల్లో కనిపించిన భయం ఆమెని అంతలా కట్టేసింది, కుదిపేసింది.

"ఇదేటన్నయ్యా? కళ్ళముందు పెరిగిన పిల్ల, ఇలాంటి పని సేయబోవడం నీకు నాయవా?" అని సత్తిబాబుని.. ఏ రకంగానూ నిలదీసి అడగలేదు, ఇలా జరిగిందని ఎవరితోనూ చెప్పుకోలేదు.. కనకే పైకి చెప్పలేని అలాంటి సంఘటనలు పునరావృతం అయ్యే వీలు కల్పించడం కంటే పైకప్పు వేసుకుని పరిష్కారం చూసుకోవడమే మేలనే అలా చెప్పింది.

ఇప్పుడామె కళ్ళల్లో ఒకటే "దృశ్యం" కనిపిస్తోంది, తన పిల్లలూ, తనూ దర్జాగా తమ ఇంట్లోనే టాయిలెట్ వాడుకుంటూ హాయిగా ఉండడం. అంతకంటే శుభకరమైన పని లేదన్నట్టుగా ఆ అమ్మ హృదయాన్ని మరింత దగ్గరగా హత్తుకుంది పచ్చని పసుపుకొమ్ము!

*(కౌముది – రచన మాస పత్రికలు నిర్వహించిన కథలపోటీ 2015 బహుమతి పొందిన కథ.*
*కౌముది అంతర్జాల మాసపత్రిక సెప్టెంబర్ 2015 నుంచి పునర్ముద్రణ)*

# గాడిద బొమ్మ

## జ్యేష్ఠ

**కథా మార్గదర్శి కథ**

> ***"ఈ గాడిదబొమ్మ మగదో, ఆడదో అనేది మరో గాడిద అడగాల్సిన ప్రశ్న. నీకీ వింత కుతూహలం దేనికి భామా" అని చమత్కరించి, పిల్లలిద్దరికీ చెరో రూపాయీ ఇచ్చి ఊరుకోబెట్టాడు.***
>
> ***బావ గాడిద బొమ్మని అంత పదిలంగా ఎందుకు దాచాడో అర్థం కాలేదు నాకు. సరే, శక్తియోగి లాంటి మూర్ఖుణ్ణి ఆరాధించేవాడికి ఇదో లేక్కా అని ఊరుకున్నాను.***

మా పెద్దబావ రవి... అతనే నాకు చిన్నప్పుడు నాస్తికత్వం, హేతువాదం, శ్రామిక విప్లవంలో నమ్మకం నేర్పాడు.

ఈమధ్య దిగజారిపోతున్నాడన్న దాఖలాలు కనిపిస్తున్నాయి. పదిరోజుల క్రితం అతను 'మామగారి కోసం' అంటూ ముఖేష్, ఎంఎస్, ఘంటసాల, సుధీర్ ఫడ్కే వాళ్ళూ పాడిన భక్తిగీతాల కేసెట్లు నలభయ్యారూ, సోనీ టేప్ రికార్డరూ పంపినప్పుడే నాక్కొంచెం అనుమానం కలిగింది. ఈరోజు బావ రాసిన ఉత్తరంతో నిజం తేలిపోయింది.

ఆ ఉత్తరం మూడోపేజీలో 'అసలు దేవుడున్నాడని ప్రూవ్ చెయ్యడం కోసమే స్పినోజా హేతువాదాన్ని కనిపెట్టాడు. అంచేత దేవుడు లేడనే వాళ్లెవ్వరూ హేతువాదులు కాలేరు. నిజానికి నాస్తికత్వం భగవంతుని మీద పగ. భగవంతుడు తాము కోరినది తీర్చలేదన్న ఏడుపుతో వచ్చినది. నాకు శ్రీ శ్రీ శక్తియోగి మహరాజ్ (సహస్రతేజ్) వారి ఆశీర్వాదం, కరుణా లభించాక, మా బొమ్మల బిజినెస్ దివ్యంగా సాగుతోంది. క్లబ్లో చేరి అన్నింటిలోనూ చురుకుగా పాల్గొంటున్నాను. మీ అక్కకీ పాపాయికీ నగలు చేయించాను' అంటూ రాశాడు.

నెలజీతం చాలక ఈమధ్య ఒక టోయ్ బిజినెస్‌లో వాటా తీసుకున్నాడు. కాని, పెట్టుబడి తక్కువై లాభం ఆనటం లేదనేవాడు. ఇప్పుడు శ్రీ శ్రీ శ్రీ అదేదో మహారాజ్ గారి దయవల్ల డబ్బులు గిడుతున్నాయిట... మంత్రాలకి చింతకాయలు రాలినట్టు!

నేను ఉత్తరం సాంతం చదివి పిడికిలి బిగించి గాలిలో ఊపుతూ, పళ్ళు పటపట కొరుకుతుండగా నాన్న వచ్చి "చాల్లేరా, పళ్లూడిపోతే కొత్తవి కట్టించే స్తోమత లేదు మనకి! పేదవాని కోపం పెదవికి చేటు అన్నారే గాని, బక్కవాని కోపం పళ్ళకి చేటు అనాల్సింది!" అంటూ, తన జోకుకి తానే ''హ్హహ్హహ్హ' అంటూ నవ్వి ముక్తాయింపుగా టేప్ రికార్డర్ ఆన్ చేశాడు.



'జ్యోత్ సే జ్యోత్ చలాకే ఛలో, ప్రేమ్ కీ గంగా బహాతే ఛలో' అని ముఖేష్ మహోద్రేకంతో పాడుతుంటే అతనూ నాన్న పక్షమే అయి, నన్ను వెక్కిరిస్తున్నట్టు ఫీలయ్యాను.

ఈ భక్తి టేప్‌రికార్డర్ వచ్చాక.. నాన్న నిద్దట్లో కూడా దాన్ని విడవడం లేదు. ఎవరితోనైనా వాదన వస్తే ఆయన తను చెప్పాల్సింది చెప్పేసి, వెంటనే టేప్ ఆన్ చేసి, 'దీనికి నీ జవాబేమిటి?' అన్నట్టు విజయగర్వంతో చూస్తున్నాడు. పాటల వల్ల ఆయన బీపీ పది పాయింట్లు తగ్గిందని అమ్మ మురిసిపోతుంది, కానీ ఆయన వరస నాకేం నచ్చట్లేదు!

నేను నిరసన ప్రకటిస్తూ, పోస్టాఫీస్ వరకూ వాకౌట్ చేసి, ఓ కార్డు కొని, 'మూఢనమ్మకాలు మంచివి కావు' అని రాసి, సంతకం కూడా పెట్టకుండా బావకి పోస్ట్ చేశాను. తిరుగుటపాలో అతనూ అలాగే రాశాడు. 'మూఢనమ్మకం షష్ఠీ విభక్తి' అని. ఇంకా తీవ్రంగా ఎర్రసిరాతో 'మతం ప్రజల మత్తుమందు' అని నేను రాశాను. జవాబు 'మార్క్సిజం గోడరాతల నుంచి నేర్చుకుంటే ఇదే బాధ. మార్క్స్ కొటేషన్ పూర్తిగా చదువు' అని బావ రాసేసరికి ఇది ఉత్తరాలతో అయ్యే పనికాదు, ఎదట నిలబడి నాలుగూ దులిపేస్తే తప్ప ఇతని దుమ్ము వదలదు అని నిశ్చయించుకొని 'దసరాకి వస్తున్నా' అని రాశాను.

వాల్తేరు స్టేషన్లో దిగి నడుస్తుండగా అక్కా బావా ఎదురొచ్చారు. నేను మాట్లాడకుండా కోపంగా బావ కళ్లలోకి చూశాను కానీ, అర్ధంకాక అతను హాయిగా ఇకిలిస్తూ 'స్వాగతం' అన్నాడు.

అక్క నా తల నిమురుతూ, "ఎందునక్కలా ఈ వాలకం ఏమిట్రా?" అంది ప్రేమగా.

బావ నా సూట్కేస్ అందుకొని "ఈ రోజుల్లో యువతరం అంటే ఇదే. వీళ్ళే ఈ సమాజాన్ని మార్చేవాళ్లు. నీ తమ్ముడు నీరసంగా ఉన్నాడని మోసపోకు మగువా.. అమ్మో దేవాంతకుడితను" అని సీరియస్గా చెప్తుంటే నేనేదో అనబోయి ఊరుకున్నాను.

ఆటో ఎక్కాం. దారిలో ఒక కోటలాంటి భవంతి కనబడింది. జైళ్ళకి పనికొచ్చేటంత ఎత్తైన గోడలు, పెద్దపెద్ద స్టీల్గేట్లు. 'ఓం' అని రాసి ఉన్న ఎర్రజెండాలు.

అక్కడ ఆటో ఆపించి దిగాడు బావ. గేట్లు మూసి ఉండడం గమనించి, అంతకు ముందే, ఖరీదైన కారులో వచ్చి ఆ గేట్లకి సాష్టాంగ నమస్కారం చేస్తున్న ఒక కుటుంబాన్ని పలకరించి, రెండు చేతులతో తన రెండు చెవులూ (కుడిచేత్తో ఎడమచెవీ, ఎడమచేత్తో కుడిచెవీ) పట్టుకొని కళ్ళు మూసుకున్నాడు. అలా మూడుగుంజీలు తీసి మూడుసార్లు లెంపలు వాయించుకున్నాడు. మనసులోనే ఏదో గొణిగి, గేట్లకి మళ్ళీ నమస్కరించి, ఆటో ఎక్కి పోనీమన్నాడు.

"అక్కా ఏమిటే ఇదంతా?" అన్నాను నా గొంతు నాది కానట్టూ, రాజబాబు బాలూకి ప్లేబేక్ పాడుతున్నట్టూ, జలుబుచేసిన కాకి మైకు ముందు మాట్లాడుతున్నట్టూ... నాకే విచిత్రంగా ధ్వనించింది.

"శక్తి బాలయోగిగారి ఆశ్రమం అది. అంటే మెయిన్బ్రాంచిలే. మీ బావ ఆయన భక్తుడు. కానీ ఇలా రోడ్డు మీద గుంజీలు తియ్యడం ఇదే మొదటిసారి. నిన్ను ఇంప్రెస్ చెయ్యడానికేమో!" అంది అక్క.

ఇంటికెళ్ళి కాఫీ తాగాక గాని నా రెండో ప్రశ్న వెలువడలేదు. "బావకి పిచ్చెత్తిందా?"

"మిగతా విషయాల్లో బాగానే... ఆ మాటకొస్తే బెటర్గానే ఉన్నారు గాని, ఈ శక్తియోగి పిచ్చి మాత్రం నానాటికీ పెరుగుతోంది. ఈ యోగిది మన ఊరే తెలుసా?" అంది అక్క.

"ఇతన్ది మన ఊరే. పన్నెండేళ్ళు వల్లకాట్లో రావిచెట్టు కింద కళ్లు మూసుక్కూర్చున్నాడు. 'తపస్సూ కాదు, వల్లకాడూ కాదు' కొంగజపం అనేవాడు నాన్న. ఆ సంగతి భక్తుల ద్వారా విని, తెగ తాగేసి, కారులో మనింటికొచ్చారు యోగిగారు! నువ్వు, చిన్నక్కా బాగా చిన్నవాళ్లప్పుడు! నేనూ, అమ్మా భయంతో వణికిపోతున్నాం. నాన్న నిర్భయంగా వీధిలోకి వెళ్ళి, యోగిగార్ని ఆహ్వానించాడు."

"ఆయనకి భయం వెయ్యలేదా?"

"భయానికేం లోటు. కానీ రాజబాబు భీముడి వేషం వేస్తే ఎవరికైనా భయమేస్తుందా? అలా అయిందన్న మాట. యోగిగారు తుపాకి గురిపెట్టి ఆవేశంతో ఊగిపోతున్నాడు. మెట్లు దిగివెళ్ళి 'మీకు ఆవేశం వస్తే చాలు, ముల్లోకాలూ మసైపోతాయటగా? ఈ తుపాకీ ఎందుకు మీకు? పైగా తుపాకీ గొట్టం మీ వేపూ, మడమ నా వేపూ పెట్టారు మీరు. తుపాకీ పేలిస్తే గుండు ముందు మీకు తగిలి, వీలుంటే వెనకాలున్న మీ భక్తుడికి తగులుతుంది' అన్నాడు. తుపాకి కింద పడింది. దానితోపాటు యోగిగారు పడబోతుంటే భక్తులు ఆపేశారు. కార్లో పడుకోబెట్టారతన్ని. కారు వైజాగ్ చేరేదాకా ఆగలేదట!" నవ్వింది అక్క.

"చూశావా మా గురువుగారి మహత్తు, కారు వైజాగ్ వెళ్ళే వరకూ ఆగలేదంటే అర్థమేమిటి? పెట్రోల్ని మించిన శక్తి ఏదో దాన్ని నడిపించిందని. ఆ మిరకిల్ తోనే వైజాగ్ ఆయనకు మోకరిల్లింది" అన్నాడు బావ భక్తి పారవశ్యంతో!

"పెట్రోలుకి బదులు సారాయి ఇంధనంగా వాడొచ్చని మొన్న పేపర్లో చదివాను" అక్క చెప్పింది.

"ఎగ్జాక్ట్లీ! సైంటిస్టూ, ఇంజనీర్లూ ఈ ఉపాయాన్ని మా గురువు నుంచే నేర్చుకున్నారు. అదే నేననేది"

"శ్రీశ్రీ' యుగం అంతరించిందని ప్రవచించిన ఒక అభ్యుదయకవిగార్ని 'జగదేక మూర్ఖుడని' కీర్తిస్తూ కరపత్రం వేశారు కొందరు. వాళ్ళకి బావతో పరిచయం లేదు. ఉంటే ఇతనికే అగ్రతాంబూలం ఇచ్చేవారు." నేను బావకి ఈ సువార్త చెప్పబోతుంటే వీధిలో ఒక ఇంపోర్టెడ్ కారొచ్చి ఆగింది. ఓ పెద్దమనిషి దిగి ఇంట్లోకి వచ్చాడు. బావ సగౌరవంగా లేచి నిలబడ్డాడు. వాళ్ళిద్దరూ 'జై శక్తి మహారాజ్' అంటే 'జైజై శక్తి మహారాజ్' అని గ్రీట్ చేసుకున్నారు. నేనూ అక్కా లోపలి గదిలోకి వెళ్ళాం.

అక్క వివరించింది. "ఆయనే సేఠ్ బాలకృష్ణజీ. కోటీశ్వరుడు. యోగిగారి ప్రియభక్తుడు. కాఫీ తాగడు." నేను మూతి ముడుచుక్కూర్చోవడం గమనించి బుజ్జగింపుగా అక్క ఈ కథ చెప్పింది.

డబ్బులు చాలక అక్కని సినిమాలకీ, పిక్నిక్కులకీ తీసుకెళ్ళేవాడు కాదు బావ. శక్తియోగి ఆశ్రమానికి వెళ్దామని కాలి నడకన వైజాగ్ గాలి పీల్చుకుంటూ వెళ్లారు.

ఆశ్రమం పెద్దకోటలా ఉంది. ఏభైలక్షలు చేస్తుందట. కాంపౌండ్ అంతా జనంతో కళకళలాడుతోంది. వికసిత వదనాలూ, రంగురంగుల దుస్తులూ ధరించిన ఆడవారూ, చిగురించిన ఏ ఆశల మైకంలోనో తేలిపోతున్న మగవాళ్లు! అందరూ గుమిగూడిన ఆ దృశ్యం మనోహరంగా, ఒక పూలతోటలా కనిపించింది. ఒక పెద్దగదిలో ఒలికిన సెంటుబొట్టు సుగంధం.. మనం రాసుకోకపోయిన మన ముక్కుకి ముద్దుగా హత్తుకున్నట్టు ఏదో పవిత్రభావం అంతటా అలముకుంది. డబ్బు గొడవలూ, అనారోగ్యాలూ, కక్షలూ, క్రూరత్వం ఇవేమీ లేని మరేదో లోకంలో.. దేవతల దేశంలో హనీమూన్‌కి వెళ్ళిన వధువులా మురిసిపోయింది అక్క. అందరూ ఒక్కసారే మాట్లాడేస్తున్నా నిశ్శబ్దంగా ఉంది.

ఇస్మాయిల్ చెప్పినట్టు కలలో వినబడే సంగీతంలా ఆ నిశ్శబ్దం పాడుతోంది... మెహిదీ హసన్ గొంతులోని గుండె నిట్టూర్పుల్లా....!

ఇంతలో యోగిగారి రాక ప్రకటించారు.

శక్తియోగిని చూసి అక్క తన కళ్లను తను నమ్మలేకపోయింది. పదేపదే చూసింది. సందేహం లేదు. తన చిన్నప్పుడు కారులో వచ్చి, నాన్నని తుపాకితో కాల్చేస్తానని చిందులేసిన వాడే వీడు. స్పృహ వచ్చేసరికి ఇంట్లో సోఫాలో పడుకొని ఉంది తను. అంతా కలలా ఉంది. వీధిగదిలో ఉన్న సేఠ్ రామకృష్ణజీకి (ఆశ్రమం నుండి ఆయన కారులోనే వచ్చారట అక్కా, బావా) తను కోలుకుందని బావ చెప్పడం.. మైలు దూరంలోని మాటలా తోచింది. సేఠ్‌జీ మాటలూ అలాగే!

"మిస్టర్ రవీ, మీ శ్రీమతి మహాభక్తురాలు. యోగి మహారాజ్‌ని చూసీ చూడ్డంతోటే, ఇలా భావసమాధిలోకి వెళ్ళిందంటే అది పూర్వజన్మ సుకృతమే! నేను కళ్ళారా చూశాను కాని, లేకపోతే నమ్మేవాడ్ని కాను. మహారాజ్ కూడా నాతో అదే అన్నారు. మీ భార్య జన్మజన్మలుగా తనను ఆరాధిస్తోందని..."

వీధిగదిలో నుంచి గురుభాయిలా గురుగుణ సంకీర్తన స్థాయి పెరగడంతో అక్క కథ ఆపేసి వినసాగింది.

“శక్తిమహరాజ్ అవతార పురుషుడు.” సేఠ్‌జీ

“కాదు మరీ! సంభవామి యుగే యుగే అంటే అంతేగా” అన్నాడు బావ.

“బాగా చెప్పారు. పాపం పెరిగిపోతే దేవుడే దిగి రావాలి”

“కాదు మరీ! సంభవామి యుగే యుగే అంటే అంతేగా”

“బాగా చెప్పారు. పాపం పెరిగిపోతే దేవుడే...”

“కాదు మరీ, సంభవామి యుగే యుగే అంటే ...”

“బాగా చెప్పారు పాపం పెరిగిపోతే దేవుడే...”

“కాదు మరీ సంభవామి యుగే యుగే...”

“శక్తిమహరాజ్ అవతారపురుషుడు”

“కాదు మరీ, సంభవామి యుగే యుగే”

“బాగా చెప్పారు...”

అరిగిపోయిన రికార్డులా అవే మాటలు తిప్పితిప్పి కొడుతున్నారిద్దరూ.

నేను నా నిరసన ప్రకటించేలోగా, వంటింట్లో పిల్లలు కీచుమని అరుస్తూ కొట్టుకోవడం, ఏడవడం వినిపించి అక్క అటు పరుగెత్తింది. వాళ్ళని కూకలేసి, ఇద్దర్నీ వెంటబెట్టుకు వచ్చింది. ఇద్దరూ జంటకవుల్లా షిఫ్టులేసుకొని ఏడుస్తున్నారు.

బాబిగాడు బస్సాట ఆడుతున్న బొమ్మ తనకిమ్మంది పాప! దానికి గౌను తొడుగుతానని. అది ఆడపిల్ల కాదని వాడు మొరాయిస్తే జుట్టు పీకి బొమ్మ లాక్కోబోయింది. ఇద్దరూ కొట్టుకున్నారు.

వాళ్ళ ఏడుపు ఆగకపోవడంతో అక్క బావని పిలిచింది. “ఈ బొమ్మ మొగదో ఆడదో తేల్చండి బాబూ, పిల్లలు రావణయుద్ధం చేస్తున్నారు” అని ఒక చిన్న కర్రబొమ్మ బావ చేతిలో పెట్టింది.

బావ దాన్ని చూడగానే “ఇది వీళ్లకెలా దొరికింది. ఇదే మన భావి భాగ్యవిధాత” అని జేబులో పెట్టేసుకున్నాడు.

తరవాత “ఈ గాడిదబొమ్మ మగదో, ఆడదో అనేది మరో గాడిద అడగాల్సిన ప్రశ్న. నీకీ వింత కుతూహలం దేనికి భామా” అని చమత్కరించి, పిల్లలిద్దరికీ చెరో రూపాయీ ఇచ్చి ఊరుకోబెట్టాడు.

బావ గాడిద బొమ్మని అంత పదిలంగా ఎందుకు దాచాడో అర్థం కాలేదు నాకు. సరే, శక్తియోగి లాంటి మూర్ఖుణ్ణి ఆరాధించేవాడికి ఇదో లెక్కా అని ఊరుకున్నాను.

కానీ సేఠ్జీకి పళ్ళరసం ఇవ్వడానికి నేను వీధి గదిలోకి వెళ్ళేసరికి ఆయనా బావా టీపాయ్ మీదున్న గాడిద బొమ్మనే తదేకంగా చూస్తూ ఏదో తీవ్ర చర్చ చేస్తున్నారు.

"...... అనంతకృష్ణని కూడా కాంటాక్ట్ చేశాడు విల్సన్. అనంతకి మీకంటే ఎక్కువ అనుభవం, పెట్టుబడీ రెండూ ఉన్నాయి. ఉన్నపాటున పదివేల పీసెస్ అడిగినా తెల్లారేసరికి సప్లై చెయ్యగలడు. విల్సన్‌కి నెల్లాళ్ళు ఇండియాలో ఉండేసరికి డిసెంట్రీ పట్టుకుంది. అమెరికా తిరిగి పోవాలని తొందరపడుతున్నాడు"

"అనంతకృష్ణ పరమభక్తుడని విన్నాను. మన గురువు చెప్తే వినడా?" ఆశగా అడిగాడు బావ.

"వినడు. వాడిది ఓ రకం పిచ్చిభక్తి. వాడి గురువూ పిచ్చోడే. వాడికి మహరాజ్ అంటే కన్నెర్ర... పెద్ద ఆశ్రమం ఉందని."

"అయితే ఈ బేరం మనకి రాదంటారా?"

"మహారాజ్ సంకల్పం ఏనాడైనా విఫలమైందా రవీ? చక్రం అడ్డేస్తాడు" సగర్వంగా చెప్పాడు సేఠ్‌జీ. తరవాత కొన్ని క్షణాలు ఆలోచించి "పదండి వెళ్దాం... ముందు పోలీస్ క్లబ్‌కి! త్వరగా బట్టలు మార్చుకోండి" అని తొందరపెట్టాడు.

బావ గబగబా బట్టలు మార్చుకొని "అలా వెళ్లొస్తాం. భోజనానికి లేటవ్వొచ్చు. నువ్వు తినెయ్" అని అక్కతో చెప్పి "వెళ్లొస్తానోయ్ అరుణతారా! నువ్వు కంగారుపడకు! నిజం నిలకడ మీద తేలుతుంది. టాటా" అని కారెక్కి వెళ్లిపోయాడు.

నేను ప్రయాణ బడలిక వల్ల నిద్రపోయాను. లేచేసరికి చీకటి పడుతోంది. మనస్సంతా అలజడిగా ఉంది. అక్క ఇచ్చిన దాణా స్వీకరించి వీధిలో పడ్డాను. నా కాళ్ళు అనుకోకుండా శక్తియోగి కోట వైపు నడిచాయి. కోట గేటు మూసి ఉంది. అక్కడే తచ్చాడసాగాను. ఎదురుగా ఉన్న ఇనప్పెట్టె సైజు ఆంజనేయస్వామి గుడికి వచ్చిపోయే భక్తుల్ని లెక్కించగా, ఐదు నిమిషాల్లో ముప్పైతొమ్మిదిమంది వచ్చారనీ, పదేహేనుమంది వెళ్లారనీ తేలింది.

ఇంతలో ఆశ్రమంలో నుండి నన్ను చూసిన నాయరు (మా కాలేజీలో స్మగుల్డ్ గుడ్స్ అమ్మేవాడు) గేట్లు తీయించడం, నేను ఆశ్రమ ప్రవేశం గావించడం జరిగింది.

నాయరుతో అవీ ఇవీ మాట్లాడుతూ, "స్వామీజీ దర్శనం ఇస్తారా?" అన్నాను... కనబడితే తిట్టెయ్యాలని. "ఈరోజు దర్శనం లేదు. మహరాజ్ కొందరు భక్తుల కష్టాలు తీరుస్తున్నారు. ఈ కార్లన్నీ వాళ్ళవే. నమ్మి చెడినవారు లేరు కదా!" అన్నాడు.

అక్కడున్న వికసించిన పూలమొక్కలు మూఢవిశ్వాసాల పుట్టల్లా కనిపిస్తున్నాయి. ఆకాశం వాటిని చూసి ఏడుస్తున్నట్టుంది. నాకూ అలాగే ఉంది.

అరగంట గడిచాక, ఓ చిన్న గుంపు ఆశ్రమంలో నుంచి బయటకు వచ్చింది. అందరూ స్పీడుగా మాటాడేస్తున్నారు. బావ భుజం తడుతూ, అభినందిస్తూ పొగిడేస్తున్నారు. ఒక్కొక్కళ్లూ కారెక్కుతుంటే వినయంగా షేక్‌హేండిచ్చి థేంక్స్ చెప్తున్నాడు బావ.

వాళ్ళూ, వాళ్ళ కార్లూ వెళ్ళిపోయాక బావ నన్ను చూసి, గబగబా వచ్చి, కావలించుకొని, గట్టిగా వీపు పగిలేలా తట్టసాగాడు. నేను బాధ భరించలేక ఎలాగోలా వదిలించుకున్నాను.

"అంతా స్వామీజీ దయ! గాడిదల కాంట్రాక్ట్ మనకే వచ్చిందోయ్. ఎడ్వాన్స్ పాతికవేల చెక్కు కూడా ఇచ్చేశాడు విల్సన్" అంటూ అమెరికాలో ఒక పార్టీ వాళ్ళు తను చేయించే గాడిద బొమ్మల్ని ఎన్నికల్లో ధరిస్తారనీ, అనంతకృష్ణ మిలియనీరైనా కాంట్రాక్ట్ తనకు రావడానికి శక్తియోగి భక్తులంతా సాయపడ్డారనీ అనంతకృష్ణకి తరవాత మరేదో లాభం చూపిస్తామనడంతో అతనూ భక్తుడైపోయాడనీ..."

"మీ శక్తిమహారాజ్ బోగస్ గాడిద" అన్నాను వీధిలోకి వస్తూ.

"మీలా ప్రోగ్రెస్‌కి అడ్డుపడే అడ్డగాడిద మాత్రం కాదు. ఆయన యమా ప్రోగ్రెసివ్. నా బిజినెస్ని ఎంత ముందుకు తోశాడో చూడు" అని... "ఆంజనేయస్వామిని చూద్దామా? అక్కడ పూజారీ, మహంతూ, ప్రీస్టూ ఎవరూ లేరు. అంతా డైరక్ట్" అన్నాడు బావ.

*(ఆంధ్ర వారపత్రిక, 29.07.1959 నుంచి పునర్ముద్రణ)*

మీ చందా మాకు ఆర్థికంగా కొంత ఆలంబన నిస్తుంది.
ఐనను, వార్షిక చందా చెల్లించినవారు, చెల్లించలేనివారు
అందుకొనే సంచికలో ఎటువంటి భేదము ఉండదు.

వార్షిక చందా రూ.200/-

https://imjo.in/ebrJuh

ఉచిత సంచిక కోసం

https://zcmp.in/K93t

మిగతా వివరాల కోసం,
పూర్వ సంచిక, శ్రావ్య సంచికల కోసం

www.kathamanjari.in

బాలల దినోత్సవ సందర్భంగా నవంబర్ 2025 సంచిక..
బాలల సంచికగా ముస్తాబవుతోంది.
పది కథలూ బాల కథలే.  మీరు చదవండి,
ఇంట్లో బాలలకు చదివి వినిపించండి.